PRAJASAKTI Regd.No. 15795/68 సిటీ
ప్రజాశక్తి
ప్రతి అక్షరం ప్రజల పక్షం
Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu
సంపుటి : 45 సంచిక : 14 | విజయవాడ, గురువారం 14 ఆగస్టు 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50
Vol No | Vijayawada, Thursday 14 August 2025 | Rs



8

రాయల్స్ ఆఫ్ రాయలసీమ విజయం
- వర్షంతో విజయవాడ సన్‌షైనర్స్, భీమవరం బుల్స్ మ్యాచ్ రద్దు


గుంటూరు జిల్లా అమరావతి మండలం పెదమద్దూరు వద్ద కృష్ణా నది ఉధృతి

ఉమ్మడి కృష్ణా, గుంటూరు, గోదావరి జిల్లాల్లో
కుండపోత
- ఎన్‌టిఆర్, గుంటూరు జిల్లాల్లో నలుగురు మృతి, ఇద్దరు గల్లంతు
- పొంగిన కాలువలు, వాగులు
- రాకపోకలకు తీవ్ర అంతరాయం
- చేబ్రోలులో రికార్డు స్థాయిలో 272.4 మిల్లీమీటర్ల వర్షపాతం
- ప్రకాశం బ్యారేజీ వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక
- వేలాది ఎకరాల్లో పంటలు నీట మునక

ప్రజాశక్తి- యంత్రాంగం

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో ఉమ్మడి కృష్ణా, గుంటూరు, పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో కురిసిన కుండపోత వర్షాలు బీభత్సం సృష్టించాయి. కాలువలు, వాగులు పొంగి ప్రవహించాయి. వేలాది ఎకరాల్లో పంటలు నీటమునిగాయి. రోడ్లపై నీరు చేరడంతో రాకపోకలకు జనజీవనం స్తంభించింది. ఇళ్లలోకి వర్షం నీరు చేరింది. ఎన్‌టిఆర్ జిల్లాలో ముగ్గురు మృతి చెందారు. గుంటూరు జిల్లాలో ఒకరు మృతి చెందగా, ఇద్దరు గల్లంతయ్యారు. కృష్ణా జిల్లాలో 83.4 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైంది. అత్యధికంగా చల్లపల్లి మండలంలో 117.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. ఎన్‌టిఆర్ జిల్లాలో 50.10 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా ఇబ్రహీంపట్నం మండలంలో 142.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. భారీ వర్షాలతో బుడమేరు నీటి ప్రవాహం పెరిగింది. లోతట్టు ప్రాంతాల్లోని కొన్ని ఇళ్లు నీట మునిగాయి. గుణదల వంతెనపై నీరు ప్రవహిస్తోంది. కృష్ణా నది వరద ఉధృతితో ప్రకాశం బ్యారేజీ ఎగువ, దిగువన లంక గ్రామాలను అధికారులు అప్రమత్తం చేశారు. వేలాది ఎకరాల్లో వరి పొలాలు నీట మునిగాయి. వరి పొలాలు చెరువులను తలపిస్తున్నాయి. విజయవాడ నగరంలోని లోతట్టు ప్రాంతాల్లో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు తదితరులు పర్యటించారు. వర్షాలకు నీట మునిగిన ఇళ్లను పరిశీలించారు.

విజయవాడ వన్‌టౌన్ 53వ డివిజన్ దూది ఫ్యాక్టరీ వద్ద మ్యాన్‌హోల్‌లో పడి మెడికల్ షాపులో పనిచేస్తున్న టిడిపి డివిజన్ అధ్యక్షులు మధుసూదన్ (46) మృతి చెందారు. వించిపేటకు చెందిన గోల్డ్ షాపులో పాలీష్ పని చేస్తున్న ముత్తుజా (40) అనే కార్మికుడు ఇంటికి వెళ్తూ డ్రెయిన్లో పడి మరణించారు. తెల్లవారుజామున ద్విచక్ర వాహనంపై వెళ్తున్న మహేష్ అనే యువకుడు లయోల కళాశాల వద్ద వర్షానికి కూలిన చెట్టును ఢీకొని మృతి చెందారు. గుంటూరు జిల్లా పెదకాకాని మండలం నంబూరు వద్ద కాలువలో పడి ఎనిమిదో తరగతి విద్యార్థి నెలపాటి భరత్ (12) మరణించారు. తుళ్లూరు మండలం రాజధాని ప్రాంతంలోని ఉద్దండరాయునిపాలెం వద్ద కృష్ణా నదిలో తెనాలికి సమీపంలోని పెదపాలేనికి చెందిన అన్నదమ్ములు పసంగి వీర ఉపేంద్ర (22), పసంగి కామేశ్వరరావు (19) గల్లంతయ్యారు. వీరిద్దరూ ఉద్దండరాయునిపాలెం ఇసుక రేవు వద్ద పనిచేస్తున్నారు.

రాజధాని అమరావతికి నిలిచిన రాకపోకలు

గుంటూరు-తుళ్లూరు మార్గంలోని వాగులు పొంగడంతో రాజధాని అమరావతికి రాకపోకలు నిలిచిపోయాయి. అమరావతి నుంచి మిగతా 2లో


గుంటూరు జిల్లాలో కాజా టోల్ ప్లాజా వద్ద 16వ నంబరు జాతీయ రహదారిపైకి వచ్చిన వరద నీరు


తాడికొండలో మునిగిన పైర్లు

అప్రమత్తంగా ఉండండి
- లోతట్టు ప్రాంతాల ప్రజలను తరలించండి
- భారీ వర్షాలపై సమీక్షలో సిఎం ఆదేశం

2

క్షేత్ర స్థాయికి 'జిల్లాల' సబ్ కమిటీ
- 29,30 తేదీలలో పర్యటన
- సెప్టెంబరు 2వరకు వినతుల స్వీకరణ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

జిల్లా పేర్లు, సరిహద్దుల మార్పులపై రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన మంత్రివర్గసబ్‌కమిటీ క్షేత్రస్థాయి పర్యటనకు వెళ్లనుంది. బుధవారం నాడు సచివాలయంలో జరిగిన సబ్ కమిటీ సమావేశంలో ఈ మేరకు నిర్ణయించారు. ఈ సమావేశంలో కేబినెట్ సబ్‌కమిటీ సభ్యులు అనిత,పి.నారాయణ, బిసి జనార్ధన్‌రెడ్డి, నిమ్మల రామానాయుడు, నాదెండ్ల మనోహర్, సత్యకుమార్ యాదవ్ పాల్గొన్నారు. అనంతరం రెవిన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ మీడియాతో మాట్లాడుతూ ఈనెల 29,30తేదీల్లో ఉమ్మడి జిల్లాల్లో పర్యటించనున్నట్లు చెప్పారు. సెప్టెంబరు15 నాటికి తమ నివేదికను సిఎంకు అందజేస్తామన్నారు. డిసెంబరు31లోగా జిల్లాల పేర్లు, మార్పుల ప్రక్రియ ముగించాల్సి ఉందన్నారు. గత ప్రభుత్వం జిల్లాల పునర్విభజన సక్రమంగా చేయకపోవడంతో ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఉమ్మడి జిల్లాల్లో రెండు రోజుల పర్యటనలో సభ్యులు రెండు గ్రూపులుగా విడివిడిగాపర్యటించడం జరుగుతుందన్నారు. పర్యటన సందర్భంగా ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తామన్నారు. ప్రజల ఇప్పటి నుంచే తమ వినతులును ఆయా కలెక్టర్లకు ఇవ్వవచ్చన్నారు. వినతులు స్వీకరించేందుకు సెప్టెంబరు 2 చివరి తేదీఅని మంత్రి తెలిపారు. జిల్లా, డివిజన్, మండల, గ్రామాల పేర్లు, సరిహద్దుల మార్పులతో పాటు కొత్త జిల్లాల ఏర్పాటును కూడా కేబినెట్ సబ్ కమిటీ పరిశీలిస్తుందన్నారు. అయితే నియోజకవర్గాల ఏర్పాటుతో జిఓఎంకు సంబంధం లేదన్నారు. రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా కేంద్రాలతో పాటు గిరిజనులకు అందుబాటులో ఉందే విధంగా రెండుగిరిజన ప్రాంతాలలో కూడా మంత్రుల బృందం పర్యటిస్తుందన్నారు. సమావేశం అనంతరం ప్రజలనుంచి పలు వినతులు అందాయన్నారు. పల్నాడు జిల్లాకు గుర్రం జాషువా పేరు పెట్టాలంటూ మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్ వినతి పత్రం అందజేశారు. చీరాల నుంచి వచ్చిన కొందరు బాపట్ల జిల్లా కేంద్రాన్ని చీరాలకు మార్చాలని, బాపట్ల జిల్లాకు దుగ్గిరాల గో పాలకృష్ణయ్య పేరు పెట్టాలని వినతి పత్రాలు అందజేశారు. కృష్ణ జిల్లా మడిచర్ల గ్రామ సర్పంచ్ తమ గ్రామాన్ని బాపులపాడు మండలం నుంచి తీసి నూజివీడు మండలం, లేక ముసునూరు మండలంలో కానీ కలపాలని కోరారు.

నెల్లూరు జిల్లాలోని గ్రామాలను ప్రకాశంలో కలపాలి: మంత్రి డోలా వినతి

గత వైసిపి ప్రభుత్వం జిల్లాల పునర్విభజన ప్రక్రియ సక్రమంగా చేయకపోవడంతో అనేక సమస్యలు ప్రజలు ఎదుర్కొంటున్నారని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి కేబినెట్ సబ్ కమిటీకి వివరించారు. ఈ సందర్భంగా నెల్లూరు జిల్లాలో ఉన్న కొండపి నియోజకవర్గంలోని పలు గ్రామాలను ప్రకాశం జిల్లాలో కలపాలని వినతి పత్రం అందజేశారు. కొండపి నియోజకవర్గంలోని జరుగుమల్లి మండలం రామనాథపురంలో ఒక వీధి ప్రకాశంజిల్లాలో మరొక వీధి నెల్లూరు జిల్లా పరిధిలో ఉందన్నారు. నెల్లూరు జిల్లా పరిధిలోని ఆ ప్రాంతాన్ని ప్రకాశం జిల్లాలో కలపాలని కోరారు.


7
విజయవాడలో ట్రంప్ - మోడీ దిష్టిబొమ్మ దగ్ధం చేస్తున్న రైతు సంఘాల నాయకులు

కార్పొరేట్ సంస్థల నుంచి వ్యవసాయాన్ని రక్షించాలి
- ట్రంప్ విధించిన 50 శాతం సుంకాలను ఎత్తేయాలి
- ట్రంప్-మోడీ దిష్టిబొమ్మ దగ్ధం

పులివెందుల, ఒంటిమిట్ట
ఉప ఎన్నికలు రద్దు చేయాలి
- వైసిపి అధ్యక్షులు జగన్‌మోహన్‌రెడ్డి
- కేంద్ర బలగాలతో ఎన్నికలు నిర్వహించాలి

2

లీజుకు ఫైబర్ ఆప్టిక్ నెట్
- గ్రీన్ ఎనర్జీ కారిడార్‌గా రాష్ట్రం
- ఇంధనశాఖ సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు

16, 17 తేదీల్లో పోలవరం మునక ప్రాంతాల్లో
ఎంఎ బేబీ, బ్రిట్టాస్ పర్యటన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పోలవరం మునక ప్రాంతాల్లో ఈ నెల 16, 17 తేదీల్లో సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబీ, రాజ్యసభలో సిపిఎం ఫ్లోర్‌లీడర్ జాన్ బ్రిట్టాస్ పర్యటించనున్నారు. ఈ మేరకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు బుధవారం పర్యటన వివరాలు వెల్లడించారు. పర్యటనలో భాగంగా ఎంఎ బేబీ 16వ తేదీ ఉదయం రాజమండ్రి ఎయిర్‌పోర్టుకు చేరుకుని అక్కడ నుండి రంపచోడవరం దగ్గరున్న దేవీపట్నం మండలంలో పెనికెలపాడు, ఇందుకూరు, తాల్లూరు నిర్వాసిత కాలనీల్లో పర్యటిస్తారని తెలిపారు. జాన్ బ్రిట్టాస్ 16వ తేదీన విజయవాడ చేరుకుని ఏలూరు జిల్లాలో ఉన్న జీలుగుమిల్లి, బుట్టాయిగూడెం మండలాల్లో ప్రజలను కలుసుకుని వారి సమస్యలు అడిగి తెలుసుకుంటారని వివరించారు. 17వ తేదీ బేబీ, బ్రిట్టాస్ చింతూరు, విఆర్‌పురం, కూనవరం, ఎటపాక మండలాల్లో ఉభయులూ పర్యటించనున్నారని వివరించారు. మధ్యాహ్నం తిరుగు ప్రయాణమై ఢిల్లీకి వెళ్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాలను జయప్రదం చేయాలని ప్రజలను కోరారు. పోలవరం ప్రాజెక్టు పనులు వేగంగా చేస్తున్నా నిర్వాసితులను పట్టించుకోవడం లేదని శ్రీనివాసరావు తెలిపారు. ప్రాజెక్టు కోసం జీవనాన్ని ధారబోసిన గిరిజనులు అభద్రతా భావంతో బతుకుతున్నారని వివరించారు. ఈ నేపథ్యంలో వారి సమస్యలు అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయడానికి పార్టీ నాయకులు పర్యటిస్తున్నారని పేర్కొన్నారు.

పోలవరంలో భూములు మాయం!
- ప్రజాప్రతినిధులు, పెత్తందార్ల గుప్పిట్లో వెయ్యి ఎకరాలు
- పెద్దల ప్రమేయంతో నోరు మెదపని రెవెన్యూ అధికారులు
- నిర్వాసితుల కోసం మళ్లీ భూసేకరణ
- గిరిజనుల సాగు భూములే టార్గెట్

3

ఎస్‌సి, ఎస్‌టిల్లో రిజర్వేషన్లకూ
క్రీమీ లేయర్!
కేంద్రానికి సుప్రీం నోటీసు



న్యూఢిల్లీ : ఎస్‌సి, ఎస్‌టిల్లో రిజర్వేషన్ ప్రయోజనాలను సమానంగా పంపిణీ చేయడానికి గానూ ఒబిసిల్లో క్రీమీ లేయర్ మాదిరిగానే ఒక వ్యవస్థను ప్రవేశపెట్టాలని కోరుతున్న పిటిషన్‌ను విచారించాలని సుప్రీం కోర్టు నిర్ణయించింది. రామశంకర్ ప్రజాపతి దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోమాల్యా బాగ్చిలతో కూడిన బెంచ్ కేంద్రానికి నోటీసులు జారీ చేసింది. ప్రస్తుత రిజర్వేషన్ విధానం ఎస్‌సి, ఎస్‌టిల్లో ఇప్పటికే బాగా సంపన్నులై, సామాజికంగా కూడా పలుకుబడి కలిగిన గ్రూపులకు అసమానంగా ప్రయోజనాలు సమకూరుస్తోందని, అదే సమయంలో సమాజంలో అత్యంత వెనుకబడిన, దారిద్ర్యం మగ్గుతున్న వారు మాత్రం ఇంకా దుర్భర దారిద్ర్యంలో మగ్గుతునే వున్నారని ఆ పిటిషన్ పేర్కొంది.

ఎస్‌సి, ఎస్‌టి కేటగిరీల్లో అమలు పరిచేందుకు రెండంచెల రిజర్వేషన్ వ్యవస్థను ప్రవేశపెట్టాలని పిటిషన్ కోరుతోంది. అక్టోబరు 10న దీనిపై విచారణ జరపాలని బెంచ్ నిర్ణయించింది. రిజర్వేషన్ విధానంలోని సున్నితత్వాన్ని, విభిన్న అభిప్రాయాలు తలెత్తే అవకాశాలను పరిగణనలోకి తీసుకుంటూ ఈ అంశాన్ని అత్యంత జాగ్రత్తగా విచారించాల్సిందిగా సూచించింది. కమ్యూనిటీల్లో ఆర్థిక సామర్ధ్యాలను అంచనా వేసేందుకు ప్రభుత్వానికి గల సమర్ధత చుట్టూనే ఈ భావన తిరుగుతోందని జస్టిస్ సూర్యకాంత్ విచారణ సందర్భంగా వ్యాఖ్యానించారు.

కోదండరామ్, అమీర్ అలీఖాన్ నియామకంపై స్టే

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ గవర్నర్ కోటాలో నియమితులైన ఇద్దరు ఎమ్మెల్సీల నియామకంపై సుప్రీంకోర్టు స్టే విధించింది. ఎమ్మెల్సీలుగా కోదండరామ్, ఆమీర్ అలీఖాన్‌ల నియామకాన్ని సర్వోన్నత న్యాయస్థానం తప్పుబట్టింది. ఎమ్మెల్సీల నియామకంపై మధ్యంతర ఉత్తర్వులు అమలులో ఉండగా తెలంగాణ ప్రభుత్వం ఇద్దరు ఎమ్మెల్సీలను నియమించడాన్ని వ్యతిరేకిస్తూ... 2023లో అప్పటి ప్రభుత్వం సిఫార్సు చేసిన ఎమ్మెల్సీ అభ్యర్థులు దాసోజు శ్రావణ్, సత్యనారాయణ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. వారి పిటిషన్లపై జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. గతంలో గవర్నర్ కోటా ఎమ్మెల్సీ ఎన్నికపై న్యాయస్థానం స్టే విధించిందనీ, మధ్యంతర ఉత్తర్వులు అమలులో ఉండగానే ఎమ్మెల్సీలు ప్రమాణస్వీకారం చేయడం తప్పని ధర్మాసనం పేర్కొంది. ఎమ్మెల్సీలుగా కోదండరామ్, ఆమీర్ అలీఖాన్‌ల ఎన్నికపై స్టే విధిస్తూ ధర్మాసనం తీర్పు ప్రకటించింది. ఈ మేరకు గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను ధర్మాసనం సవరించింది.

ఇసి Vs ప్రజలు
- బీహార్‌లో ఎస్‌ఐఆర్‌పై సుప్రీం వ్యాఖ్య
- ఓటరు జాబితాలో పేరు ఓటరుకు చట్టబద్ధ హక్కు : పిటిషనర్లు

న్యూఢిల్లీ : బీహార్‌లో ప్రస్తుతం జరుగుతున్న ఎస్‌ఐఆర్‌ను కేంద్ర ఎన్నికల కమిషన్ యొక్క అధికారులకు, సాధారణ పౌరుడికి ఉన్న ఓటు హక్కుకు మధ్య జరిగే యుద్ధంగా సుప్రీంకోర్టు బుధవారం వ్యాఖ్యానించిది. ప్రజా ప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 21(3) కొన్ని అసాధారణ కేసుల్లో ప్రత్యేక సవరణకు ఎన్నికల కమిషన్‌కు స్వేచ్ఛనిచ్చిందని, అయితే వయోజనుల ఓటు హక్కును అది దెబ్బతీయలేదని సుప్రీంకోర్టు పేర్కొంది. బీహార్‌లో ఎస్‌ఐఆర్‌కు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్ల విచారణ బుధవారం కూడా కొనసాగింది. ఓటర్ల జాబితాలో వుండే చట్టబద్ధమైన హక్కు ప్రతి ఓటరుకు వుంటుందని విచారణ సందర్భంగా పిటిషనర్లు వాదించారు. ఓటు వేసే హక్కు చట్టబద్ధమైనదే కాదు, రాజకీయ హక్కు కూడానని వారు స్పష్టం చేశారు. పౌరసత్వాన్ని నిర్ణయించే హక్కు ఎన్నికల కమిషన్‌కు లేదని పేర్కొన్నారు. అలాగే సరైన విచారణ జరపకుండా ఓటర్ల జాబితా నుండి ఓటరు పేరును తొలగించే హక్కు కూడా లేదన్నారు. పైగా రుజువు చేసుకునే భారాన్ని ఓటరుకు బదిలీ చేయడాన్ని కూడా వారు తప్పుబట్టారు. గురువారం కూడా ఈ విచారణ కొనసాగే అవకాశం వుంది. అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఎడిఆర్)తో సహా పలువురు వ్యక్తులు, సంస్థలు వేసిన పిటిషన్లపై సీనియర్ న్యాయవాదులు ప్రశాంత్ భూషణ్, గోపాల్ శంకర్‌నారాయణన్, సింఘ్వీలు తమ వాదనలు వినిపించారు.

పిటిషనర్ల వాదనలన్నింటినీ క్రోడీకరిస్తూ జస్టిస్ జోమాల్యా బాగ్చి, ఇది రాజ్యాంగ అర్హతకు, రాజ్యాంగ హక్కుకు మధ్య జరుగుతున్న యుద్ధమని వ్యాఖ్యానించారు. 324(ఇసి అధికారాలు), 326(ఓటు హక్కు) అధికరణల మధ్య పోరు ఇదని అన్నారు. కాగా, ముసాయిదా జాబితాను సిద్ధం చేస్తున్నపుడు పొరపాట్లు దొర్లే అవకాశం వుందని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ బాగ్చిలతో కూడిన బెంచ్ అంతకుముందు విచారణలో వ్యాఖ్యానించింది. అయితే వాటిని సరిదిద్దుకోవడానికి ఎన్నికల కమిషన్ కూడా సుముఖంగానే వుందని తెలిపింది. అయితే మూకుమ్మడిగా ఓటర్ల తొలగింపు జరిగితే తాము రంగంలోకి దిగుతామని న్యాయస్థానం ఇచ్చిన హామీని పిటిషనర్లు ఈ సందర్భంగా గుర్తు చేశారు.

సెర్చ్ ఆప్షన్ తొలగించారు

ఓట్ల చౌర్యం జరిగిందని విమర్శిస్తూ, రాహుల్ గాంధీ పత్రికా సమావేశం పెట్టిన తర్వాత ఇసి వెబ్‌సైట్‌లో ఓటర్ల జాబితాల సెర్చ్ ఆప్షన్‌ను తొలగించారని న్యాయవాది ప్రశాంత్ భూషణ్ పేర్కొన్నారు. ఆగస్టు 4వరకు ఈ ఆప్షన్ అందుబాటులో వుందన్నారు. ఎన్నికల కమిషన్ మోసపూరితంగా వ్యవహరించిందనడానికి ఐదు కారణాలు కనిపిస్తున్నాయన్నారు. హడావిడిగా ఎస్‌ఐఆర్‌ను నిర్వహించడం, ఆధార్, ఓటర్ కార్డులను ఆమోదించడానికి తిరస్కరించడం, తొలగించిన 65లక్షల ఓటర్ల పేర్లను ప్రచురించడానికి, వారిని తొలగించడానికి గల కారణాలను వెల్లడించడానికి తిరస్కరించడం, ముసాయిదా జాబితాలో పేర్లన వెతుక్కునే యంత్రాంగాన్ని తొలగించడం వంటి చర్యల ద్వారా ఇసి వ్యవహార శైలి స్పష్టమవుతోందని ప్రశాంత్ భూషణ్ పేర్కొన్నారు.

అప్రమత్తంగా ఉండండి

- లోతట్టు ప్రాంతాల ప్రజలను తరలించండి
- భారీ వర్షాలపై సమీక్షలో సిఎం ఆదేశం


భారీ వర్షాలపై ఉన్నతాధికారులతో సమీక్షిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికార యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికారులను ఆదేశించారు. క్యాంపు కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని దిశానిర్దేశం చేశారు. నాగార్జున సాగర్, పులిచింతల గేట్లను ఎత్తడంతో ప్రకాశం బ్యారేజీకి వరద ప్రవాహం ఎక్కువ అవుతోందని చెప్పారు. కృష్ణా నదీ పరీవాహక ప్రాంతాల్లోని వాగులు, వంకలు నుంచి వచ్చే ఆకస్మిక వరద ప్రవాహాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ దిగువున ఉన్న ప్రాంతాలకు సమాచారం ఇవ్వాలని సిఎం సూచించారు. ప్రకాశం బ్యారేజీకి దిగువున ఉన్న ప్రాంతాల్లోని ప్రజలను ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల ప్రజలను తరలించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. పట్టణ ప్రాంతాల్లో రోడ్లు , లోతట్టు ప్రాంతాల్లో నిలిచిన నీటిని తక్షణం తొలగించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను సిఎం ఆదేశించారు.

ఈ సందర్భంగా బుడమేరు డైవర్షన్ ఛానెల్ పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తున్నట్లు అధికారులు సిఎంకు వివరించారు. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షం వల్ల వచ్చే నీటిని కృష్ణానదిలోకి డిశ్చార్జి చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వరద నిర్వహణ పనుల్లో భాగంగా రూ.40కోట్లతో బుడమేరు-వెలగలేరు యూటి నిర్మాణాన్ని చేపట్టేందుకు సిఎం అనుమతి మంజూరు చేశారు. ప్రకాశం బ్యారేజీకి గురువారం కల్లా 5లక్షల క్యూసెక్కుల వరద నీరు వచ్చే అవకాశం ఉందని అధికారులు సిఎంకు తెలిపారు. ప్రకాశం బ్యారేజీ నుంచి ప్రస్తుతం 3.09లక్షల క్యూసెక్కుల నీరు 35 గేట్లు ఎత్తి దిగువకు విడుదల చేస్తున్నట్లు , 5వేల క్యూసెక్కుల నీటిని కాలువలుకు విడిచిపెట్టినట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో మంత్రులు నిమ్మల రామానాయుడు, వంగలపూడి అనిత, సిఎస్ విజయానంద్ తదితరులు పాల్గొన్నారు.

వరద నీటిని సద్వినియోగం చేసుకోవాలి:

ఎగువ నుంచి వస్తున్న నీటిని సద్వినియోగం చేసుకునేలా రోజుకు నాలుగు టిఎంసిల చొప్పున తరలించి సోమశిల, కండలేరు ప్రాజెక్టులను నింపాలని సిఎం అధికారులను ఆదేశించారు. వరద నీటిని వృధాగా సముద్రంలోకి పోనీయకుండా సద్వినియోగం చేసుకునేలా సమర్ధ నీటి నిర్వహణ చేయాలని సూచించారు. మైలవరం సహా ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షం బుడమేరు, వెలగలేరుకు పెద్ద ఎత్తున వస్తోందని, ఈ నీటిని కృష్ణానదిలోకి డిశ్చార్జి చేస్తున్నట్లు తెలిపారు.

కాలువల్లో గుర్రపుడెక్కను తొలగించండి

భారీ వర్షాల కారణంగా కాలువల్లో నీటి ప్రవాహాలు సక్రమంగా వెళ్ళేందుకు వీలుగా గుర్రపుడెక్క, తూడును తొలగించాలని సిఎం జలవనరుల శాఖ అధికారులను సిఎం చంద్రబాబునాయుడు ఆదేశించారు. కాలువలు, చెరువులకు గండ్లు పడకుండా గట్లను పటిష్టం చేయాలని సూచించారు. జిల్లాల్లో వర్షాల పరిస్థితిపై ఎప్పటికప్పుడు జిల్లా కలెక్టర్లు కూడా అప్రమత్తంగా ఉండి రైతులకు తక్షణ సమాచారం ఇవ్వాలని చెప్పారు.


రాజధాని ప్రాంతం అమరావతిలో పెద్దపరిమి వద్ద రహదారులను ముంచెత్తి ప్రవహిస్తున్న వరద నీరు

రాజధాని ప్రాంతాన్ని చుట్టుముట్టిన వర్షపు నీరు

- తొలిసారి రహదారులపై చేరిక
- జిఎడి టవర్ల పునాదుల్లోకి నీరు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అమరావతి రాజధాని ప్రాంతంలోపాటు చుట్టుపక్కలున్న మంగళగిరి, తాడికొండ, పెదపరిమి, నీరుకొండ ప్రాంతాల్లో ఎక్కడికక్కడ వర్షపు నీరు నిలిచిపోయింది. మంగళవారం అర్ధరాత్రి కురిసిన వర్షంతో రాజధాని కోసం కొత్తగా ఆమోదించిన పెద్దమద్దూరు, ప్రతిపాదిత మోతడక, నిడుముక్కల ప్రాంతాల్లో వాగులు పొంగుతున్నాయి. ఎద్దువాగు పొంగడంతో అమరావతి విజయవాడ, కొట్టేళ్లవాగు, కొండవీటివాగు పొంగడంతో గుంటూరు తాడికొండ అమరావతి మధ్య రాకపోకలు నిలిచాయి. జాతీయ రహదారిపై కాజ టోల్‌గేట్ వద్ద నీరు నిలిచి రాకపోకలు తీవ్ర అంతరాయం కలిగింది. మంగళగిరి టిక్కో కాలనీ నీటమునిగింది. విజయవాడ దగ్గర బుడమేరులోకి నీరురావడంతో కట్టపక్కన ఉంటున్న ఇళ్లలోకి నీరు వచ్చి చేరింది.

ఉండవల్లిలో వరిపొలాలు నీటమునిగాయి. కుంచనపల్లి వద్ద పొలాల్లోపెద్దఎత్తున నీరు నిలిచిపోయింది. ఆకుకూరలు, పంటలు దెబ్బతినే ప్రమాదం ఉంది. ఇబ్రహీంపట్నంలో పలుకాలనీల్లో అడుగుమేర నీరొచ్చింది. కృష్ణానది వరదతో ముందు జాగ్రత్తగా ఫెర్రీలో ప్రజలను ఖాళీ చేయిస్తున్నారు. సుదీర్ఘకాలం తరువాత సీతానగరంలోని మేఘా లిఫ్టు ద్వారా నీటిని తోడి కృష్ణానదిలో పోస్తున్నారు. అమరావతి రాజధాని నగరంలో జిఎడి టవర్ల కోసం వేసిన ఐదు ర్యాఫ్టుల్లో రెండు వర్షపునీటితో నిండాయి. బుధవారం అర్ధరాత్రికి మరింత నీరొచ్చి చేరే ప్రమాదం ఉంది. మరోవైపు రాజధానిలోకి వచ్చి చేరే నీరు బయటకు వెళ్లే కాలువల్లో అడ్డంకులు ఏర్పడ్డాయి. జాతీయ రహదారితోపాటు, 8,9,10,11 రోడ్లపై వంతెనల నిర్మాణాల సమయంలో కాలువలు పూడిపోయాయి. వాటిని సరిచేయలేదు. వెంకటపాలెం సమీపంలో జాతీయ రహదారి నిర్మాణ సమయంలో పాలవాగు వంతెన వద్ద కాలువ పూడుకుపోయింది. దీన్ని క్లియర్ చేయలేదు. కొండవీటివాగు నుండి వచ్చే నీరు కూడా ఇదే మార్గం నుండి బయటకు వెళ్లాల్సి ఉంటుంది. మార్గం లేకపోవడంతో నీరు నిలిచిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కృష్ణాయపాలెం వద్ద కొండవీటివాగులో గుర్రపుడెక్క పెరిగింది. దీన్ని తొలగించాలని రైతులు గతంలో సిఆర్‌డిఏ కమిషనర్ దృష్టికి తీసుకెళితే ఆగస్టు, సెప్టెంబరు నాటికి క్లియర్ చేస్తామని చెప్పినా పట్టించుకోలేదు. ఫలితంగా ఇప్పుడు నీటికి అడ్డుపడుతోంది. జాతీయ రహదారిపై కాజా టోల్‌గేట్ వద్ద రెండు అడుగులకుపైన నీరు నిలిచింది. బయటకు పోయేమార్గం లేకపోవడంతో గంటల తరబడి నిలిచిపోయింది. మంగళగిరి నగరంలో ఎక్కడికక్కడ వర్షపునీటితో నిండిపోయాయి. తాడికొండ మండలం, తుళ్లూరు మండల పరిధిలోని రాజధానికి సరిహద్దు గ్రామాల్లో పెద్దఎత్తున వర్షపు నీరు చేరింది. అమరావతి బ్లూప్లాన్‌లో భాగంగా తవ్విన కాలువలలోకి వచ్చే నీరు బయటకు వెళ్లే మార్గాన్ని నిర్మించలేదు. దీంతో నీరు నిలిచిపోయాయి.

అల్పపీడన ప్రభావంతో భారీ వర్షాలు

అల్పపీడనం ప్రభావంతో రానున్న 48 గంటల్లో రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలు పడే అవకాశం ఉందని, అక్కడక్కడ చెదురుమదురుగా తేలికపాటి నుంచి ఒక మోస్తరుగా వర్షాలు పడతాయని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరిస్తున్న నేపథ్యంలో హోంమంత్రి విపత్తుల నిర్వహణ సంస్థ కార్యాలయం నుంచి కోస్తా జిల్లాల కలెక్టర్లు, లైన్ డిపార్టుమెంట్ అధికారులతో ఆమె బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ నెల 14న ఉత్తరాంధ్ర, మధ్య కోస్తా జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు పడే అవకాశం ఉన్న నేపథ్యంలో ఎటువంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు అధికార యంత్రాంగం సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. భారీ వర్షాల నేపథ్యంలో మత్స్యకారులు ఆదివారం వరకు సముద్రంలోకి వేటకు వెళ్లరాదని హెచ్చరించారు. ఎన్‌డిఆర్ఎఫ్, ఎస్‌డిఆర్ఎఫ్ బృందాలు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. అల్లూరి, అంబేద్కర్ కోనసీమ, ఏలూరు, ఎన్‌టిఆర్, కృష్ణా, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో భారీ వర్షాలు పడే అవకాశం ఉందని ఆమె పేర్కొన్నారు.

జిల్లాల్లోనూ కంట్రోల్ రూమ్స్

భారీ వర్షాల నేపథ్యంలో అన్ని జిల్లా కేంద్రాల్లో కంట్రోల్ రూమ్స్ ఏర్పాటు చేయాలని ఆయా జిల్లాల కలెక్టర్లను హోంమంత్రి అనిత ఆదేశించారు. క్షేత్రస్థాయిలో అధికారులు వర్ష ప్రభావ ప్రాంత ప్రజలకు అందుబాటులో ఉండేలా తీసుకోవాలని కలెక్టర్లకు సూచించారు. అత్యవసర సహాయం కోసం విపత్తుల నిర్వహణ సంస్థలోని కంట్రోల్ రూమ్ టోల్ ఫ్రీ నెంబర్లు 112, 1070, 18004255010 1ను సంప్రదించాలన్నారు. ప్రకాశం బ్యారేజీ వద్ద వరద ప్రవాహం ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లో 3,44,638 క్యూసెక్కులుగా ఉందన్నారు. బాపట్ల, గుంటూరు, కృష్ణా, ఎన్‌టిఆర్, పల్నాడు జిల్లాల అధికారులు నదీ పరివాహక లోతట్టు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. వాగులు, వంకలు, కాలువలు, కల్వర్టులు పొంగుతున్నందున ప్రమాద ప్రాంతాల్లో తప్పనిసరిగా ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ఈ సందర్భంగా గుంటూరు, ఎన్‌టిఆర్, కృష్ణా, బాపట్ల కలెక్టర్లు ముందస్తుగా తీసుకున్న చర్యలను మంత్రికి వివరించారు. గ్రామ సచివాలయాల్లో 24/7 గంటలు అధికారులను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఇప్పటికే ఇసుక బ్యాగులు, నిత్యావసర వస్తువులను సిద్ధంగా ఉంచినట్లు మంత్రికి పలు జిల్లాల కలెక్టర్లు వివరించారు.

నేడు ఎన్‌టిఆర్ జిల్లాలో పాఠశాలలకు సెలవు

ఎన్‌టిఆర్ జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలలకు కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశా సెలవు గురువారం ప్రకటించారు. భారీ వర్షాలు, వరదల ఉధృతి నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు.

నేడు ప్రకాశం బ్యారేజీకి ఐదు లక్షల క్యూసెక్కుల ప్రవాహం!



ప్రకాశం బ్యారేజీకి వరద పోటు మరింత పెరిగింది. నాగార్జునసాగర్ జలాశయానికి వరద ప్రవాహం కొనసాగుతోంది. సాగర్‌కు 2.30 లక్షల క్యూసెక్కుల ప్రవాహం వస్తుండగా, 2.71 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో, పులిచింతలకు వరద పోటు పెరిగింది. 3.15 లక్షల క్యూసెక్కుల ప్రవాహం వస్తుండగా, వచ్చిన నీటిని వచ్చినట్లుగా దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రకాశం బ్యారేజీకి 3.97 లక్షల క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది. దీంతో, మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. వచ్చిన నీటిని వచ్చినట్టు దిగువకు విడుదల చేస్తున్నారు. పులిచింతల నీటితోపాటు ఖమ్మం, కృష్ణా జిల్లాల పరిధిలోని వరద ప్రవాహం కూడా ప్రకాశం బ్యారేజీని చేరుతోంది. గురువారం ఉదయానికి ఐదు లక్షల క్యూసెక్కుల వరకు వరద ప్రవాహం వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

నిండుకుండలా 'శ్రీశైలం'

- ఏడు గేట్ల ద్వారా నీటి విడుదల

ఎగువ ప్రాంతాల నుండి వరద ఉధృతితో శ్రీశైలం జలాశయం నిండుకుండలా మారింది. మొత్తం ఏడు గేట్లను పది అడుగుల మేర ఎత్తి 1,89,133 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. బుధవారం సాయంత్రం ఆరు గంటలకు ఎగువ జూరాల నుండి 90,980 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 42,669 క్యూసెక్కులు, హంద్రి నుండి 3,750 క్యూసెక్కులతో జలాశయానికి 1,37,399 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. తెలంగాణ రాష్ట్ర పరిధిలోని ఎడమ గట్టు భూగర్భ జల విద్యుత్ కేంద్రం నుండి 39,443 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తూ 16.820 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను, కుడిగట్టు జల విద్యుత్ కేంద్రం నుండి 30,596 క్యూసెక్కుల నీటితో 15.210 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి చేస్తున్నారు. శ్రీశైలం బ్యాక్ వాటర్ నుండి పోతిరెడ్డిపాడుకు 32 వేల క్యూసెక్కులు, హంద్రీనీవా సుజల స్రవంతికి 2,818 క్యూసెక్కులు, మహాత్మాగాంధీ కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్‌కు 546 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. జలాశయం నీటిమట్టం 885 అడుగులకుగాను ప్రస్తుతం 882.70 అడుగులకు చేరింది. నీటి నిల్వ సామర్థ్యం 215 టిఎంసిలకుగాను ప్రస్తుతం 202.050 నమోదైంది. దిగువ నాగార్జునసాగర్‌కు ఏడు గేట్ల ద్వారా, రెండు విద్యుత్ కేంద్రాల నుండి 2,54,784 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

ఎమ్మెల్యే బండారుకు తృటిలో తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి - ఆలమూరు (అంబేద్కర్ కోనసీమ జిల్లా)

అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావుకు తృటిలో ప్రమాదం తప్పింది. ఆలమూరులో బుధవారం నిర్వహించిన అన్నదాత సుఖీభవా రైతు సంబరాలు వేడుకలకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా టిడిపి కూటమి నేతల ఆధ్వర్యంలో చేపట్టిన ట్రాక్టర్ ర్యాలీలో పాల్గొన్నారు.

ర్యాలీ అనంతరం ఆయన ఎడ్ల బండిపై ప్రయాణిస్తుండగా బండికి కట్టిన బెలూన్లు పేలాయి. దీంతో ఒక్కసారిగా ఎద్దులు రంకెలు వేయడంతో ఎడ్ల బండిపై ఉన్న ఎమ్మెల్యే ఎమ్మెల్యే బండారు సత్యానందరావుతోపాటు పలువురు నాయకులు కిందపడిపోయారు. అకస్మాత్తుగా జరిగిన ఈ ప్రమాదం నుంచి ఎమ్మెల్యే బండారు, తదితరులు బయటపడటంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు చిలువూరి సతీష్ రాజుకు కాలు విరగడంతో ఆయనను ఆస్పత్రికి తరలించారు.

పులివెందుల, ఒంటిమిట్ట ఉప ఎన్నికలు రద్దు చేయాలి

- వైసిపి అధ్యక్షులు జగన్‌మోహన్‌రెడ్డి
- కేంద్ర బలగాలతో ఎన్నికలు నిర్వహించాలి



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పులివెందుల, ఒంటిమిట్ట ఉప ఎన్నికలు రద్దు చేయాలని, కేంద్ర బలగాల ఆధ్వర్యాన తిరిగి ఎన్నికలు నిర్వహించాలని వైసిపి అధ్యక్షులు జగన్‌మోహన్‌రెడ్డి కోరారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో బుధవారం ఆయన మాట్లాడారు. ఎన్నికలు మొత్తం రిగ్గింగ్ జరిగాయన్నారు. వైసిపి ఏజెంట్లు లేకుండా పోలింగు ప్రక్రియ నిర్వహించారని, ఎక్కడికక్కడ ఏజెంట్ల ఫారాలు చింపేసి టిడిపి దౌర్జన్యం చేసిందని ఆరోపించారు. పోలింగు కేంద్రాల నుండి వైసిపి ఏజెంట్లను తరిమేశారని పేర్కొన్నారు. పోలీసు సహకారంతోనే అధికార పార్టీ దౌర్జన్యకాండ నిర్వహించిందని తెలిపారు. పులివెందుల జడ్‌పిటిసిలో ఆరు పంచాయతీలుంటే 700 మంది పోలీసులను నియమించారని తెలిపారు. ప్రతి పోలింగు కేంద్రం వద్ద 400 మంది టిడిపి కార్యకర్తలు అలా దాదాపు ఎనిమిది వేలమంది వచ్చారని తెలిపారు. ఇటు పోలీసులు, టిడిపి కార్యకర్తలు ఓటరుకు ఒక రౌడీ చొప్పున మోహరించారని అన్నారు. అంతా కలిసి వైసిపి నాయకులపై దాడులు, దౌర్జన్యాలు చేశారని పేర్కొన్నారు. దీన్ని ప్రజాస్వామ్య ఎన్నికలంటారా? అని ప్రశ్నించారు. మంత్రులు గ్రామాలను పంచుకున్నారని, అధికార పార్టీ ఎమ్మెల్యేలు ఎక్కడికక్కడ తిష్టవేసి యథేచ్ఛగా దాడులు చేయించారని పేర్కొన్నారు. అయినా పోలీసులు ఏ మాత్రమూ పట్టించుకోలేదని, అధికార పార్టీకి పూర్తిగా వత్తాసు పలికారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వేర్వేరు ప్రాంతాలకు చెందిన వారు ఓటర్లుగా ఉన్న ఫొటోలను, వీడియోలను ప్రదర్శించారు. ముఖ్యమంత్రికి ఆయన పరిపాలన మీద నమ్మకం ఉంటే ఇంతటి దౌర్జన్యం చేయాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. బూత్‌లలో వీడియో రికార్డులను బయటకు ఇస్తే అసలు విషయం బయటకు వస్తుందని అన్నారు. రిగ్గింగు కోసం పోలింగు కేంద్రాలను మార్చేశారని, ఒక ఊరివారు మరొక ఊరిలో ఓటు వేసేలా మార్పులు చేర్పులు చేశారని, మూడు, నాలుగు కిలోమీటర్లు వెళ్లి ఓటు వేసేలా కుట్రలు పన్నారని తెలిపారు.

ఓటు కోసం వెళుతున్నవారిని ఎక్కడికక్కడ కొట్టారని, వేధించారని అన్నారు. జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి నల్లపురెడ్డి పల్లెలో వందల మందితో తిష్టవేస్తే పట్టించుకోలేదని, పుత్తా చైతన్య ఈ కొత్తపల్లిలో, బిటెక్ రవి కవనంపల్లిలో తిష్ట వేసి ఓటర్లను బెదిరించారని అన్నారు. వైసిపి ఓటర్లను పోలీసులు ఇష్టం వచ్చినట్లు కొట్టారని అన్నారు. డిఐజి కోయ ప్రవీణ్.. గరికిపాటి రామ్మోహన్‌రావుకు సమీప బంధువని, ఆయన ఆధ్వర్యంలో ఎన్నికలు జరిపారని విమర్శించారు. కాల్చిపారేస్తామంటూ ఓ డిఎస్‌పి బెదిరింపులకు దిగారని వివరించారు. కోయప్రవీణ్ తెలుగుదేశం కార్యకర్తలా పనిచేశారని ఆరోపించారు. కవనంపల్లి సర్పంచ్ ఇంట్లో తుపాకీ పెట్టి మరీ బెదిరించారని అన్నారు. ఒంటిమిట్టలో మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి దౌర్జన్యం చేశారని పేర్కొన్నారు. ఇలాంటి చర్యలతోనే నక్సలిజం పుడుతుందని పేర్కొన్నారు. ఇలాంటి చర్యలన్నీ భవిష్యత్‌లో టిడిపి నాయకులకు చుట్టుకుంటాయని తెలిపారు. చంద్రబాబుకు ఇవే చివరి ఎన్నికలు కావొచ్చని, ఇప్పటికైనా మార్పు తెచ్చుకుని ప్రజాస్వామ్యాన్ని గౌరవించాలని అన్నారు.

రాహుల్ గాంధీతో కలవాల్సిన అవసరం లేదు

కాంగ్రెస్ నాయకులు రాహుల్ గాంధీతో కలవాల్సిన అవసరం లేదని జగన్ అన్నారు. గత ఎన్నికల తరువాత ఓట్లు అక్రమాలు జరిగాయని చెబితే అప్పుడు మాట్లాడలేదని, ఇప్పుడు వేర్వేరు రాష్ట్రాల అంశాలు చెబుతున్నారని తెలిపారు. రాహుల్ గాంధీ హాట్‌లైన్లో చంద్రబాబుతో టచ్‌లో ఉన్నారని వివరించారు. అందుకనే రాష్ట్రంలో ఎన్నికల అక్రమాల గురించి మాట్లాడటం లేదని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఇన్‌ఛార్జి మాణిక్కం ఠాగూర్.. చంద్రబాబు గురించి మాట్లాడటం లేదని, కూటమి ప్రభుత్వ అక్రమాలను ప్రశ్నించడం లేదని అన్నారు.


విజయవాడలో నీట మునిగిన ప్రాంతాల్లో పర్యటిస్తున్న సిపిఎం నాయకులు సిహెచ్.బాబూరావు తదితరులు

కుండపోత

(మొదటి పేజి తరువాయి)


ఆచార్య నాగార్జునా విశ్వవిద్యాలయంలో వరద నీరు ముంచెత్తడంతో భవనం పైకి ఎక్కుతున్న విద్యార్థులు

వెలగపూడి వెళ్లేందుకు కూడా కృష్ణా నది వరదతో రాకపోకలు స్తంభించాయి. మంగళగిరి, విజయవాడ మార్గంలో మాత్రమే సచివాలయానికి వెళ్లాల్సి వచ్చింది. దీంతో, 50 శాతానికిపైగా ఉద్యోగులు సకాలంలో చేరుకోలేకపోయారు. హైకోర్టు మార్గంలో కూడా రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. గుంటూరు జిల్లాలో రికార్డు స్థాయిలో చేబ్రోలు మండలంలో 272.4 మిల్లీమీటర్లు, పల్నాడు జిల్లా పెదకూరపాడులో అత్యధికంగా 165 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. గుంటూరు జిల్లా మంగళగిరి మండలం చినకాకాని వద్ద ఎన్ఆర్ఐ ఆస్పత్రి సమీపంలో జాతీయ రహదారి సర్వీసు రోడ్డులో భారీగా వర్షపు నీరు నిలిచిపోయింది. కాజా టోల్ గేట్ వద్ద వర్షపు నీరు జాతీయ రహదారిపై ప్రవహించడంతో వాహనాల రాకపోకలకు రెండు గంటలపాటు అంతరాయం ఏర్పడింది. నాగార్జున విశ్వవిద్యాలయంలో వర్షం నీరు భారీగా చేరడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. హాస్టళ్ల పైఅంతస్తుల్లోకి నిచ్చెనలు, తాళ్ల సహాయంతో వెళ్లాల్సి వస్తోంది.

పశ్చిమగోదావరి జిల్లాలో ఆచంట, తాడేపల్లిలో కుండపోత వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమలమయ్యాయి. పెనుమంట్ర, మొగల్తూరు మండలాల్లో ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. భీమవరం, నరసాపురం, తాడేపల్లిగూడెంల్లో కంట్రోల్ రూములు ఏర్పాటు చేశారు. ఏలూరు జిల్లాలో భారీ వర్షం కురిసింది. ఏలూరు నగరంలో రోడ్లు జలమయమయ్యాయి. ముదినేపల్లి, ద్వారకాతిరుమల, ఉంగుటూరు తదితర ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. పలుచోట్ల వరి పొలాలు నీట మునిగాయి. కాకినాడ జిల్లాలో ఈదురు గాలులకు చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరంలో తహశీల్దార్ కార్యాలయం, వ్యవసాయ శాఖ కార్యాలయం, ట్రెజరీ కార్యాలయం, పోలీసు స్టేషన్లోలోకి మోకాల్లోతు నీరు చేరడంతో చెరువులను తలపించాయి. జాతీయ రహదారి 216పై ప్రభుత్వ కార్యాలయాల ఎదుట భారీ వృక్షం నేల కూలడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. వర్షాలకు నంద్యాల జిల్లా ఉయ్యాలవాడ మండలం బోడెమ్మనూరు వద్ద కుందూ నది ఉధృతంగా ప్రవహిస్తుండడంతో బ్రిడ్జిపై రాకపోకలు నిలిచిపోయాయి. ఆత్మకూరు మండలం శివభాష్యం వరదరాజుల స్వామి గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. కర్నూలు జిల్లాలో పలుచోట్ల వాగులు వంకలు పొంగిపొర్లుతున్నాయి.

లీజుకు ఫైబర్ ఆప్టిక్ నెట్

- గ్రీన్ ఎనర్జీ కారిడార్‌గా రాష్ట్రం
- ఇంధనశాఖ సమీక్షలో సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ట్రాన్స్‌కో వేసిన ఫైబర్ ఆప్టిక్ నెట్‌వర్క్‌ను లీజుకివ్వటం ద్వారా అదనపు ఆదాయాన్ని సాధించాలని ఇంధనశాఖ అధికారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచించారు. రాష్ట్రంలో విద్యుత్ వినియోగదారులపై భారం మోపేందుకు వీల్లేకుండా ఈ మార్గం ద్వారా దాదాపు రూ.7 వేలకోట్ల వరకూ ఆదాయం వచ్చే అవకాశం ఉందని ఆయన సూచించారు. ఉండవల్లిలోని తన నివాసంలో ఇంధనశాఖపై బుధవారం సమీక్ష నిర్వహించారు. గ్రీన్ ఎనర్జీ కారిడార్‌గా ఎపిని తీర్చిదిద్దేందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించుకోవాలని ఆదేశించారు. ప్రపంచ వ్యాప్తంగా రోజురోజుకూ మారుతున్న డైనమిక్స్‌కు అనుగుణంగా స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక ప్రణాళికలు ఉండాలని స్పష్టం చేశారు. భవిష్యత్తు అంతా గ్రీన్ పునరుత్పాదక విద్యుత్‌దే అని, ఇది వేగంగా విస్తరించి జన జీవనంలోకి వచ్చేసిందన్నారు. పునరుత్పాదక ఇంధన ఉత్పత్తిలో వ్యయం ఎలా తగ్గించాలన్న అంశంపై అధ్యయనం చేసి ప్రజలకు ఆ ప్రయోజనాలు అందించాలని పేర్కొన్నారు. రానున్న రెండు, మూడేళ్లలో విద్యుత్ వినియోగం 8.9 శాతం మేర పెరిగే అవకాశముందన్న సిఎం అందుకు అనుగుణంగా గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి చేసేలా ప్రణాళికలు చేసుకోవాలని తెలిపారు.

ఫీడర్లను సమర్థంగా నిర్వహించి విద్యుత్ పంపిణీ నష్టాలను గణనీయంగా తగ్గించాలని చెప్పారు. విద్యుదుత్పత్తి వ్యయంపై అధ్యయనం చేయాలని, వివిధ ప్రాంతాల్లో ఉత్పత్తి అవుతున్న విద్యుత్‌ను స్థానికంగానే వినియోగించేలా చేస్తే ట్రాన్స్‌మిషన్ నష్టాలను తగ్గించుకునేందుకు ఆస్కారం ఉంటుందన్నారు. అదే విధంగా ట్రాన్స్‌మిషన్ లైన్లను ఆధునీకరించి సరైన నిర్వహణ చేపడితే నష్టాలు గణనీయంగా తగ్గించుకోవచ్చని తెలిపారు. బహిరంగ మార్కెట్‌లో విద్యుత్ కొనుగోళ్లను గణనీయంగా తగ్గించాలని, పవర్ స్వాపింగ్ వంటి విధానాలను అనుసరించాలని సూచించారు. రాష్ట్రంలో సౌర, పవన విద్యుత్ ప్రాజెక్టులను ఏర్పాటు చేసేందుకు అవకాశమున్న ప్రాంతాలను అన్వేషించాలని సూచించారు. పంప్డ్ ఎనర్జీ ప్రాజెక్టుల ఏర్పాటుకు రాయలసీమలో విస్తృత అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసిలతోపాటు ఇతర వర్గాలకు పిఎం-సూర్యఘర్ సోలార్ రూఫ్‌టాప్ కింద ఎన్ని యూనిట్లు ఏర్పాటు చేశారన్న అంశాన్ని ఎప్పటికప్పుడు తెలియజేయాలని ఆదేశించారు. ప్రతి నియోజకవర్గంలో 10 వేల ఇళ్లకు సోలార్ రూఫ్‌లాప్ ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టామని, దీనికి అనుగుణంగా కార్యాచరణ చేపట్టాలని తెలిపారు. రాష్ట్రంలో ఎక్కడా వ్యవసాయానికి స్మార్ట్ మీటర్లు పెట్టొద్దని ఆదేశించారు. జెన్ థర్మల్ యూనిట్లకు అవసరమైన బొగ్గు సేకరణలోనూ కేంద్రం నుంచి సహకారం కోరాలని సూచించారు.

అన్ని విద్యుత్ సంస్థలు అందించే పౌర సేవల్ని వాట్సాప్ మనమిత్ర ద్వారా అందించాలని పేర్కొన్నారు. సెప్టెంబరు నుంచి మార్చి మధ్యలో 12,700 మెగావాట్లకు విద్యుత్ డిమాండ్ పెరుగుతుందని అంచనా వేస్తున్నట్లు ముఖ్యమంత్రికి ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ చెప్పగా.. ఉత్పత్తి పెంచుకోవాలని ఆదేశించారు.

ఈ సమావేశంలో ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ట్రాన్స్‌కో జెఎమ్‌డి కీర్తి చేకూరి, డిస్కమ్‌ల సిఎమ్‌డిలు ఐ పృధ్వీతేజ్, కె సంతోషరావు, పుల్లారెడ్డి, నెడ్‌క్యాప్ ఎమ్‌డి కమలాకర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

అనంతలో 25న 'సూపర్ సిక్స్.. సూపర్ హిట్' సభ

- 'స్త్రీ శక్తి'పై వారం రోజులు ప్రచారం : చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సూపర్ సిక్స్.. సూపర్ హిట్ పేరుతో ఈ నెల 25న అనంతపురంలో భారీ బహిరంగ సభ నిర్వహించాలని టిడిపి అధిష్టానం నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఆ పార్టీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు టిడిపి కార్యాలయంలో సుపరిపాలనలో తొలి అడుగు, నామినేటెడ్ పదవుల భర్తీ, కార్యకర్తల సంక్షేమం వంటి అంశాలపై బుధవారం సమీక్ష నిర్వహించారు. పార్టీ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్, టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్‌తో కలిసి ఈ సమీక్ష చేశారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించే స్త్రీ శక్తి పథకం అమలుతో సూపర్ సిక్స్‌లో ఇచ్చిన హామీలు 90 శాతం పూర్తవుతాయని చంద్రబాబు భావించినట్లు తెలిసింది. ఈ నెల 18 నుంచి వారం రోజులపాటు ఈ పథకంపై ప్రచారం నిర్వహించాలని, ముగింపు రోజైన 25న అనంతపురంలో భారీ బహిరంగ సభ నిర్వహించాలని పేర్కొన్నారు. తొలి అడుగు కార్యక్రమం నిర్వహణపై చంద్రబాబు ఆరా తీశారు. నియోజకవర్గంలో 30 వేల కుటుంబాల కంటే తక్కువ తిరిగిన నియోజకవర్గ ఇన్‌ఛార్జులకు నోటీసులు అందించాలని, ఎందుకు పూర్తి చేయలేకపోయారో వివరణ తీసుకోవాలని ఆదేశించినట్లు సమాచారం. దేవాదాయ పాలక మండళ్లు, వ్యవసాయ మార్కెట్ కమిటీ, సహకారం సంఘాలతో రాష్ట్రస్థాయిలో ఇంకా ఎన్ని పోస్టులు భర్తీ చేయాల్సి ఉందని ఆరా తీశారు. పార్టీ కార్యకర్తల సంక్షేమంపై సమీక్ష నిర్వహించారు. పార్లమెంటు పార్టీ అధ్యక్షుల నియామకాలు చేపట్టాలని పల్లా శ్రీనివాసరావును నారా లోకేష్ ఆదేశించినట్లు సమాచారం. 45 రోజుల అనంతరం పార్టీ కార్యాలయానికి వచ్చిన చంద్రబాబు, లోకేష్ ప్రజల నుంచి వేర్వేరుగా అర్జీలు స్వీకరించారు.

అందరికీ సంక్షేమ పథకాలు : పల్లా

ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందేందుకు విధించిన ఆరు అంచెల విధానాన్ని రద్దు చేయాలని 'సుపరిపాలన తొలి అడుగు'లో ప్రజలు కోరారని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు చెప్పారు. దీనిపై ప్రభుత్వం త్వరలో నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. టిడిపి కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం చేపట్టిన 'సుపరిపాలన తొలి అడుగు' కార్యక్రమం విజయవంతమైందని పల్లా చెప్పారు. 40 రోజులపాటు నిర్వహించిన తొలి అడుగు కార్యక్రమంలో 1.20 కోట్ల మంది ఇళ్లను పార్టీ కార్యకర్తలు సందర్శించారని తెలిపారు. రోజుకు సగటున 1.08 లక్షల ఇళ్లకు వెళ్లారని పేర్కొన్నారు. ఏడాది కాలంలో ప్రజలు పొందిన లబ్ధి, ప్రభుత్వ పాలనపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారని చెప్పారు. సూపర్ సిక్స్ హామీల్లో 70 శాతం ఇప్పటికే తమ ప్రభుత్వం అమలు చేసిందన్నారు. 2029 ఎన్నికలే లక్ష్యంగా రాష్ట్రాన్ని పునర్ నిర్మాణం చేయడానికి అందరూ కష్టపడాలని పార్టీ అధినేత పిలుపునిచ్చారని చెప్పారు.

హెడ్ కానిస్టేబుల్ కుటుంబానికి రూ.కోటి సాయం

- డిజిపి హరీష్‌కుమార్ గుప్తా

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రోడ్డు ప్రమాదంలో మరణించిన అనంతపురానికి చెందిన హెడ్ కానిస్టేబుల్ వి నారాయణ నాయక్ కుటుంబానికి డిజిపి హరీష్‌కుమార్‌గుప్తా రూ.కోటి చెక్కును బుధవారం అందజేశారు. విధుల్లో ఉండి మరణించిన పోలీస్ సిబ్బందికి ఎస్‌బిఐ పోలీస్ శాలరీ ప్యాకేజీలో భాగంగా ఈ చెక్కును నారాయణ నాయక్ సతీమణి శాంతాభాయికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐజిపి రవిప్రకాష్, సిఎఒ రాజన్, అనంతపురం ఎస్‌బిఐ రీజినల్ మేనేజరు రమేష్‌కుమార్ పాల్గొన్నారు.

యువకుడి దారుణ హత్య

ప్రజాశక్తి-నెల్లూరు

నెల్లూరులో ఓ యువకుడు దారుణ హత్యకు గురయ్యారు. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు.. మూలాపేట అలంకార్ సెంటర్‌కు చెందిన షేక్ లైక్ (36) క్యాటరింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. పాల ప్యాకెట్ కోసం ఇంటి నుంచి బయటకు వచ్చిన ఆయనను ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు కత్తులతో విచక్షణారహితంగా దాడి చేశారు. లైక్‌కు నూర్ అనే వ్యక్తికి మధ్య ఉన్న వివాదాల కారణంగా ఈ హత్య జరిగిందా? లేక మరే ఇతర కారణాలేమైనా ఉన్నాయా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జిజిహెచ్‌కు తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

గూగుల్ క్రోమ్ స్వాధీనానికి పర్‌ప్లెక్సిటీ భారీ ఆఫర్

వాషింగ్టన్ : ప్రపంచంలోనే అత్యంత ప్రజాదరణ పొందిన ఓపెన్ సోర్స్ వెబ్‌బ్రౌజర్ గూగుల్ క్రోమ్‌ను కొనేందుకు కృత్రిమ మేధా (ఎఐ) స్టార్టప్ కంపెనీ పర్‌ప్లెక్సిటీ ఆసక్తి చూపింది. పర్‌ప్లెక్సిటీ కోఫౌండర్ అరవింద్ శ్రీనివాస్ నేతృత్వంలోని ఈ కంపెనీ గూగుల్‌కి మొత్తం 34.5 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.3 లక్షల కోట్లు) ఆఫర్ చేసినట్లు సమాచారం. ఇది పర్‌ప్లెక్సిటీ కంపెనీ మొత్తం విలువ కంటే ఎక్కువ కావడం గమనార్హం. బ్రౌజర్ విషయంలో గూగుల్ క్రోమ్ గుత్తాధిపత్యం కొనసాగుతోన్న విషయం తెలిసిందే. దాన్ని విక్రయించాలని అమెరికా ప్రభుత్వం నుంచి ఓ వైపు ఒత్తిడి వస్తోంది. ఈ నేపథ్యంలో పర్‌ప్లెక్సిటీ నుంచి ఈ భారీ ఆఫర్ రావడం విశేషం. ఈ ఒప్పందాన్ని పూర్తి చేసేందుకు పర్‌ప్లెక్సిటీ ఇతర పెట్టుబడిదారుల సాయం తీసుకోనుంది.

వాణిజ్య ఒప్పందాలను విరమించుకోవాలి

- వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు తాకట్టు పెట్టొద్దు
- రైతు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసనలు, బైక్ ర్యాలీలు


అనంతపురం టవర్ క్లాక్ వద్ద నిరసన తెలుపుతున్న రైతు, కార్మిక సంఘాల నాయకులు

ప్రజాశక్తి - యంత్రాంగం

భారత్ దిగుమతులపై అమెరికా విధించిన 50 శాతం సుంకాలను తక్షణమే ఎత్తివేయాలని, మోడీ కుదుర్చుకున్న విదేశీ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలతో దేశ వ్యవసాయ రంగానికి తీవ్ర నష్టం వాటిల్లుతుందని, వాటిని తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ రైతు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసనలు, బైక్‌ర్యాలీలు నిర్వహించారు. సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం), కేంద్ర కార్మిక సంఘాల సమన్వయ కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు 'క్విట్ కార్పొరేట్స్' పేరిట బుధవారం పలు జిల్లాల్లో నిరసనలు తెలిపారు. కార్పొరేట్ల చెర నుంచి వ్యవసాయాన్ని, దేశ సంపదను కాపాడుకోవాలని నినదించారు. వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు అప్పగించేలా ప్రధాని నరేంద్ర మోడీ చేసుకుంటున్న ఒప్పందాలను తక్షణం రద్దు చేసుకోవాలని డిమాండ్ చేశారు.

విశాఖపట్నం జగదాంబ సెంటర్‌లో నిరసన తెలిపారు. ప్రపంచంలో అన్ని దేశాల కంటే అధికంగా భారత్‌పై అమెరికా అధ్యక్షుడు సుంకాలు విధిస్తున్నా మోడీ ప్రభుత్వం వ్యతిరేకించకపోవడాన్ని కార్మిక, ప్రజాసంఘాల నాయకులు ఖండించారు. ట్రంప్ తన స్నేహితుడు అని గొప్పలు చెప్పుకుంటున్న మోడీ నేడు భారత్‌ను అమెరికాకు తాకట్టుపెడుతున్నారని దుయ్యబట్టారు. విజయనగరం, పార్వతీపురం మన్యం కలెక్టరేట్‌ల వద్ద నిరసన తెలిపారు. విజయనగరంలో రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వర్మ మాట్లాడుతూ.. వ్యవసాయ రంగంలో కార్పొరేట్ల ప్రవేశాన్ని అడ్డుకోవాలని డిమాండ్ చేశారు. శ్రీకాకుళం జిల్లా పలాస మండలం కాశీబుగ్గలోని పెంట దాలయ్య ఆశ్రమం నుంచి పాత బస్టాండ్ మీదుగా ఆర్‌టిసి కాంప్లెక్స్ వరకూ ట్రాక్టర్, బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.మోహనరావు మాట్లాడుతూ.. వ్యవసాయాన్ని కార్పొరేట్లకు కేంద్ర ప్రభుత్వం అప్పగిస్తోందని విమర్శించారు. కృష్ణా జిల్లా మచిలీపట్నంలోని కోనేరు సెంటరులో ధర్నా నిర్వహించారు. అనంతపురం టవర్ క్లాక్ వద్ద నిరసన తెలిపి, అగ్రిమెంట్ పత్రాలను దహనం చేశారు. ఏలూరు పాత బస్టాండ్ సెంటర్‌లో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. మోడీ, ట్రంప్ దిష్టిబొమ్మలను దగ్ధం చేశారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. కర్నూలు సుందరయ్య సర్కిల్ నుండి కలెక్టరేట్ వరకు ట్రాక్టరు, బైకు ర్యాలీ నిర్వహించారు. నరేంద్రమోడీ మూడోసారి అధికారంలోకి వచ్చాక రైతు,కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్నారని ధ్వజమెత్తారు.

ఒంగోలులో పోలీసుల అడ్డగింత

ఒంగోలులో ర్యాలీ నిర్వహించేందుకు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, ఎపి రైతు సంఘం, అఖిల భారత రైతు కూలి సంఘం, కిసాన్ కాంగ్రెస్, సిపిఎం, కాంగ్రెస్ పార్టీ, పలు ప్రజాసంఘాల నేతలు ట్రాక్టర్లు, మోటార్‌బైకులు, జెండాలతో మినీ స్టేడియానికి చేరుకున్నారు. పోలీసులు అక్కడకు చేరుకొని ప్రదర్శనను అడ్డుకున్నారు. జిల్లాలో 30 యాక్ట్ అమలు ఉన్నందున ముందస్తు అనుమతి పొందాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే ట్రాక్టర్లు, ఇతర వాహనాలు సీజ్ చేస్తామని, నిరసనకారులను అరెస్ట్ చేస్తామని పోలీసులు హెచ్చరించారు. ఈ నేపథ్యంలో రైతు నాయకులు ధర్నా నిర్వహించారు.

బసవ తారకం కేన్సర్ ఆస్పత్రికి భూమిపూజ

ప్రజాశక్తి - తుళ్లూరు (గుంటూరు జిల్లా)


ఆస్పత్రి నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న చైర్మన్ బాలకృష్ణ

రాజధాని అమరావతి పరిధిలోని తుళ్లూరు సమీపంలో బసవ తారకం కేన్సర్ హాస్పటల్, ఇండో అమెరికన్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ నిర్మాణానికి బుధవారం భూమి పూజ జరిగింది. హాస్పిటల్, రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ చైర్మన్, హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ భూమిపూజ నిర్వహించారు. తుళ్లూరులో ఈ-7 రోడ్డు పక్కన 21 ఎకరాల్లో 500 పడకల సామర్థ్యంతో రూ.750 కోట్లతో బసవ తారకం కేన్సర్ హాస్పటల్‌ను నిర్మించనున్నారు. హాస్పటల్ నిర్మాణానికి 2014-19లో అప్పటి ప్రభుత్వం 15 ఎకరాలు కేటాయించింది. 2019 ఫిబ్రవరి 14న ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు ఆస్పత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. 2019లో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆస్పత్రి నిర్మాణం నిలిచిపోయింది. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆస్పత్రికి మరో ఆరు ఎకరాలు కేటాయించడంతో ఆస్పత్రి నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు, పురపాలక శాఖ మంత్రి పి నారాయణ, ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్, మాదిగ సంక్షేమ కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఉండవల్లి శ్రీదేవి, బసవతారకం కేన్సర్ హాస్పటల్ ట్రస్ట్ సభ్యులు నారా బ్రాహ్మణి పాల్గొన్నారు..

ఎన్‌టిఆర్ విగ్రహావిష్కరణ..

బసవతారకం కేన్సర్ ఆస్పత్రికి భూమిపూజ నిర్వహించిన అనంతరం బాలకష్ణ స్థానిక అయ్యన్న చెరువు ఒడ్డున ఎన్‌టిఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అభిమానులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

యూనియన్ అసెట్ నుంచి కొత్త ఫండ్

ప్రజాశక్తి - హైదరాబాద్

యూనియన్ మ్యూచువల్ ఫండ్ కొత్త స్కీమ్‌ను ఆవిష్కరించింది. యూనియన్ డైవర్సిఫైడ్ ఈక్విటీ ఆల్ క్యాప్ యాక్టివ్ ఎఫ్‌ఒఎఫ్‌ను సెప్టెంబర్ 1 నుంచి తెరుస్తున్నట్లు వెల్లడించింది. ఇది సెప్టెంబర్ 15 వరకు తెరిచి ఉంటుందని తెలిపింది. అలాట్‌మెంట్ తర్వాత ఐదు వ్యాపార రోజులలో తిరిగి ఓపెన్ అవుతుంది. హైదరాబాద్‌లో యూనియన్ అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ సిఇఒ, ఎండి మధు నయ్యర్ మాట్లాడుతూ.. ఇందులో కనీస పెట్టుబడి రూ.1000 నుంచి ప్రారంభమవుతుందన్నారు. ఈ నిధులను లార్జ్, మిడ్, స్మాల్ క్యాప్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేయనున్నామన్నారు. "మ్యూచువల్ ఫండ్ వినియోగం పెరుగుతోంది, కానీ మరింత లోతుగా విస్తరించడానికి సరళమైన, అన్ని రకాల ఈక్విటీ ఉత్పత్తులు అవసరం. ఈ స్కీమ్ మార్కెట్ టైమింగ్, ఆలోకేషన్, టాక్స్ సమస్యలను సులభతరం చేస్తూ, ఈక్విటీ ఫండ్ టాక్స్ ప్రయోజనాలను అందిస్తుంది." అని మధు నయ్యర్ తెలిపారు.


కొత్తపల్లెలో ఓటు వేసేందుకు క్యూలో నిల్చున్న ఓటర్లు

పులివెందులలో ముగిసిన రీపోలింగ్

- బహిష్కరించిన వైసిపి

ప్రజాశక్తి-పులివెందుల టౌన్, రూరల్

పులివెందుల జడ్‌పిటిసి ఉప ఎన్నికల్లో ప్రభుత్వం, పోలీసులు కుమ్మక్కై ఓటర్లను పోలింగ్ కేంద్రాలకు రానివ్వకుండా చేశారని ఎన్నికల కమిషన్‌కు కడప ఎంపి అవినాష్‌రెడ్డి చేసిన ఫిర్యాదు మేరకు బుధవారం అచ్చువెల్లిలోని మూడో నంబర్, ఎర్రబల్లె కొత్తపల్లిలోని 14వ నంబర్ పోలింగ్‌బూత్‌లో రీ పోలింగ్ జరిగింది. ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు బారులు తీరారు. రీ పోలింగ్ సందర్భంగా పోలీసులు పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేశారు. బుధవారం సాయంత్రం ఐదు గంటలకు 55 శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెల్లడించారు.

రీ పోలింగ్ ఎన్నికలను బహిష్కరిస్తున్నాం : అవినాష్



రీ పోలింగ్ ఎన్నికలను తాము బహిష్కరిస్తు న్నట్లు ఎంపి అవినాష్‌రెడ్డి తెలిపారు. రీ పోలింగ్ ఒక డ్రామా అని, తాము కోర్టును ఆశ్రయిస్తే చెప్పుకోవ డానికి రెండు బూతులలో రీ పోలింగ్ నిర్వహించారని విమ ర్శించారు. స్థానిక వైసిపి కార్యాలయంలో మీడి యాతో ఆయన మాట్లాడుతూ.. బుధవారం తెల్లవా రుజామున రెండు గంటల సమయంలో కేవలం రెండు బూతుల్లో మాత్రమే రీ పోలింగ్ ప్రకటించారని తెలిపారు. మేము స్పష్టంగా 15 బూతుల్లో రీ పోలింగ్ జరగాలని, కేంద్ర బలగాలతో ఎన్నిక జరపాలని కోరామని చెప్పారు. మహిళల ఓట్లను కూడా మగవాళ్లు వేశారని ఆరోపించారు. 15 బూతుల్లో రీ పోలింగ్ జరపాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లోకి వెళ్లి ప్రజల్ని అడిగితే వాస్తవాలు బయటకు వస్తాయన్నారు. కోర్టును ఆశ్రయించి న్యాయపోరాటం చేస్తామని తెలిపారు.

టారిఫ్‌ల ప్రభావాన్ని అంచనా వేయలేం

- సిఇఎ అనంత నాగేశ్వరన్

ముంబయి : భారత్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన అధిక టారిఫ్‌ల ప్రభావాన్ని ఇప్పుడే అంచనా వేయలేమని కేంద్ర ప్రభుత్వ చీఫ్ ఎకనామిక్ అడ్వైజర్ (సిఇఎ) అనంత నాగేశ్వరన్ అన్నారు. ఇప్పటి వరకు భారత ఆర్థిక వ్యవస్థ మందగిస్తున్న సంకేతాలు ఏమీ కనిపించలేదన్నారు. ఈ ఏడాది భారత ఆర్థిక వ్యవస్థ 6.3 నుంచి 6.8శాతం వృద్ధిని నమోదు చేయొచ్చన్నారు. ముంబయిలో జరిగిన ఒక కార్యక్రమంలో అనంత నాగేశ్వరన్ మాట్లాడుతూ.. భారత్‌లో రాజకీయ స్థిరత్వం, భారీ మార్కెట్ అవకాశాలు, బలమైన లేబర్ మార్కెట్, స్థిరమైన ఆర్థిక వృద్ధి కారణంగా తయారీ సంస్థల ఏర్పాటుకు భారత్ అత్యుత్తమ ప్రదేశమని పేర్కొన్నారు. సెమీకండక్టర్లు, కృత్రిమ మేధ రంగాల్లో పోటీపడేందుకు భారత్ కీలక చర్యలు చేపడుతోందన్నారు. ప్రస్తుతం భారత వస్తువులపై అమెరికా 25 శాతం టారిఫ్‌లను విధిస్తోంది. ఇవి ఆగస్టు 27 నుంచి 50 శాతానికి పెరగనున్నాయి. రష్యా నుంచి చమురు, గ్యాస్ దిగుమతుల కారణంగా ఈ అదనంగా 25 శాతం టారిఫ్‌లను విధిస్తున్నట్లు ట్రంప్ పేర్కొన్న విషయం తెలిసిందే.


రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న పూర్వ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ

పుస్తకాల నిషేధం తగదు

- ముక్తకంఠంతో ఖండించిన కవులు, రచయితలు, మేధావులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

ప్రపంచంలో ఇప్పటి వరకు ఎన్నడూ లేనివిధంగా జమ్మూ కశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ 25 పుస్తకాలను నిషేధించడాన్ని కవులు, రచయితలు, మేధావులు, అభ్యుదయవాదులు ముక్తకంఠంతో ఖండించారు. 'భావ ప్రకటన స్వేచ్ఛను కాపాడుకుందాం' 'పుస్తకాలు నోరు తెరవని మహావక్తలు' పేరుతో విశాఖలోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో అరసం ప్రధాన కార్యదర్శి ఉప్పల అప్పలరాజు అధ్యక్షతన బుధవారం రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది.

ఈ సమావేశంలో పూర్వ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ మాట్లాడుతూ.. జమ్మూ కశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్‌సిన్హా 25 పుస్తకాలను నిషేధిత పుస్తకాలుగా ప్రకటిస్తూ అవి ఎవరి దగ్గర ఉన్నా స్వాధీనం చేసుకోవాలని, ఈ పుస్తకాలు కలిగిన వారిపై కేసులు పెడతామని జిఒ జారీ చేశారని తెలిపారు. ఈ జిఒ కశ్మీర్‌కు మాత్రమే వర్తించేది కాదని, మోడీ ప్రభుత్వం రూపొందించిన కొత్త చట్టాల్లోని భారతీయ న్యాయ సంహిత ప్రకారం ఒక రాష్ట్రంలో నిషేధించిన పుస్తకాలను వేరే ప్రాంతంలో ఎవరి దగ్గర ఉన్నా వారిపై కూడా కేసులు నమోదు చేసే అవకాశం ఉందని తెలిపారు. బిజెపి ప్రభుత్వం ఎవరినైనా వేధించడానికి గతంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, సిబిఐలను వినియోగించుకునేదని, ఇప్పుడు పుస్తకాల నిషేధం పేరుతో వేధించే అవకాశం ఉందని వివరించారు.

ఇప్పటి వరకు ప్రపంచ చరిత్రలో 25 పుస్తకాలను ఒకేసారి నిషేధించిన సందర్భం ఏదీ లేదన్నారు. కశ్మీర్ ప్రజలకు ఉన్న హక్కుల గురించి వివరించిన ఈ పుస్తకాల ద్వారా ప్రజలకు నిజాలు ఎక్కడ తెలుస్తాయోననే భయంతో బిజెపి కనుసన్నలలో నడిచే కశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ వీటిని నిషేధించారని తెలిపారు. యుపిఎస్‌సి మాజీ సభ్యులు ఆచార్య కెఎస్.చలం మాట్లాడుతూ ఎ.జినూరాని కశ్మీరుపై 15 నుంచి 20 వరకు పుస్తకాలు రాశారని, నిషేధిత పుస్తకాల్లో కొన్ని అంతర్జాతీయ పబ్లికేషన్స్ ముద్రించినవి కూడా ఉన్నాయని తెలిపారు. రాజ్యాంగం ప్రజలకు ఇచ్చిన ఆర్టికల్ 19 "ఫ్రీడమ్ ఆఫ్ స్పీచ్"ను అణచివేసే చర్యగా ఈ పుస్తకాల నిషేధాన్ని ఆయన అభివర్ణించారు. నాగార్జున విశ్వవిద్యాలయం మాజీ వైస్ ఛాన్సలర్ ఆచార్య వి.బాలమోహన్‌దాస్ మాట్లాడుతూ.. భావ ప్రకటన స్వేచ్ఛను అణచివేసే ఇటువంటి నిషేధాలను ఖండించాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు.

'బ్రెయిన్ డెడ్' వ్యక్తి అవయవదానం

ప్రజాశక్తి-పర్చూరు (బాపట్ల జిల్లా)


ముద్దన వెంకట్రావు

బ్రెయిన్‌డెడ్ అయిన వ్యక్తి అవయవాలను ఆయన కుటుంబ సభ్యులు దానం చేసి పలువురికి ఆదర్శంగా నిలిచారు. ఈ సంఘటన బాపట్ల జిల్లా పర్చూరు మండలంలో బుధవారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు వివరాల ప్రకారం.. నాగులపాలెం గ్రామానికి చెందిన ముద్దన వెంకట్రావు (62) ఈ నెల 9న చిలకలూరిపేట నుంచి స్వగ్రామానికి బైక్‌పై వస్తుండగా ఎడారిపల్లె వద్ద గేదె అడ్డురావడంతో ప్రమాదానికి గురయ్యారు. చికిత్స నిమిత్తం ఆయనను గుంటూరులోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం వెంకట్రావు బ్రెయిన్‌డెడ్ అయినట్లు వైద్యులు నిర్ధారించారు. వెంకట్రావుకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. భార్య ఉషారాణి ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్నారు. వెంకట్రావు మరణానంతరం ఆయన అవయవాలైనా ఇతరులకు ఉపయోగపడాలని ఆయన కుటుంబసభ్యులు అభిప్రాయపడ్డారు. దీంతో అవయవాలను దానం చేసేందుకు ముందుకొచ్చి వైద్యులకు సమాచారం అందించారు. ఈ నేపథ్యంలోనే బెంగళూరులోని ఓ ఆస్పత్రికి కిడ్నీ, లివర్, కార్నియా దానం చేశారు. సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు డి.రమాదేవి నాగులపాలెం వచ్చి వెంకట్రావు మతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వెంకట్రావు సిపిఎం సానుభూతిపరులని, అభ్యుదయ భావాలు కలవారని, ఆయన మరణించినా అవయవాలు దానం చేసి ఐదుగురికి ప్రాణదానం చేశారని కొనియాడారు. కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

పోలవరంలో భూములు మాయం !

- ప్రజాప్రతినిధులు, పెత్తందార్ల గుప్పిట్లో వెయ్యి ఎకరాలు
- పెద్దల ప్రమేయంతో నోరు మెదపని రెవెన్యూ అధికారులు
- నిర్వాసితుల కోసం మళ్లీ భూసేకరణ
- గిరిజనుల సాగు భూములే టార్గెట్

ప్రజాశక్తి- ఏలూరు ప్రతినిధి


జీలుగుమిల్లి మండలం పి.అంకంపాలెంలోని మిగులు భూమి

పోలవరంలో భూములు మాయమయ్యాయి. నిర్వాసితుల కోసం సేకరించిన భూముల్లో వెయ్యికి పైగా ఎకరాలు ప్రస్తుతం ఎక్కడున్నాయో..ఎవరి ఆధీనంలో ఉన్నాయో తెలియడం లేదు. ప్రజాప్రతినిధులు, పెత్తందార్ల గుప్పిట్లో ఈ భూములు బంధీ అయినందునే రెవెన్యూ అధికారులు సైతం వీటి గురించి నోరు మెదపడం లేదని విమర్శలొస్తున్నాయి. ఇదే నేపథ్యంలో పోలవరం నిర్వాసితుల కోసం మరో ఏడు వేల ఎకరాలు భూసేకరణ చేపట్టాలని ప్రభుత్వం కసరత్తు చేస్తుండటం అనేక సందేహాలకు తావిస్తోంది. పైగా గిరిజనులు సాగు చేస్తున్న భూములనే లక్ష్యంగా చేసుకొని ఈ దఫా భూసేకరణ చేస్తుండటంతో స్థానిక ఆదివాసీలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఏలూరు జిల్లాలో ఏజెన్సీ మండలాలైన జీలుగుమిల్లి, బుట్టాయగూడెంల్లో గతంలో పోలవరం నిర్వాసితుల కోసం సేకరించిన వెయ్యి ఎకరాల మిగులు భూములు ఏమయ్యాయో రెవెన్యూ అధికారులు గుట్టువిప్పడం లేదు. ఈ భూములను కొందరు ప్రజాప్రతినిధులు, అధికారులు తమ ఆధీనంలో పెట్టుకుని అనుభవిస్తున్నట్లు విమర్శలున్నాయి. మిగులు భూముల గురించి జంగారెడ్డిగూడెం రెవెన్యూ డివిజన్ అధికారులుగానీ, ఆయా మండలాల తహశీల్దార్లుగానీ నోరు మెదపకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఈ భూముల గురించి తేల్చకుండా పూర్వపు తూర్పుగోదావరి జిల్లాలోని ఏజెన్సీ గ్రామాలకు చెందిన పోలవరం నిర్వాసితులను తరలించేందుకు మరోసారి భూ సేకరణకు దిగడం తీవ్ర ఆందోళనలకు దారితీసింది. వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లోని పోలవరం నిర్వాసితులకు భూమికి భూమి, కాలనీల నిర్మాణం కోసం 2017లో జీలుగుమిల్లి, బుట్టాయిగూడెం మండలాల్లో పెద్ద ఎత్తున భూసేకరణ చేపట్టారు. నిర్వాసితులకు కాలనీల నిర్మాణం, భూమికి భూమిపోను ఇంకా దాదాపు వెయ్యి ఎకరాల వరకూ మిగిలాయి. ఈ భూములను నిర్వాసితుల కోసం ఉపయోగిస్తామని అప్పట్లో ఐటిడిఎ అధికారులు ప్రకటించారు. ఇప్పుడు ఆ భూముల గురించి మాట్లాడకుండా చింతూరు, విఆర్‌పురం, కూనవరం మండలాల్లోని 36 గ్రామాల ప్రజలను తరలించేందుకు బుట్టాయగూడెం, జీలుగుమిల్లి మండలాల్లో ఏడు వేల ఎకరాలను బలవంతంగా భూసేకరించేందుకు అధికారులు సిద్ధమయ్యారు. ఇందులో 6,700 ఎకరాలు భూమికి భూమి కింద, మరో 400 ఎకరాలు కాలనీలకు అవసరమవుతుందని చెబుతున్నారు. దీంతో, గతంలోని మిగులు భూముల సంగతి తేల్చాలని గిరిజనులు ప్రశ్నిస్తున్నారు. గిరిజనుల సాగులో ఉన్న భూముల సేకరణే లక్ష్యంగా ముందుకు సాగడం ఆందోళన కలిగిస్తోంది.

దళారులతో రెవెన్యూ అధికారుల చెట్టాపట్టాలు?

ఏజెన్సీ ప్రాంతంలో భూ సేకరణ చేయాలంటే గ్రామసభ నిర్వహించి ఆమోదం పొందాలి. ఆ తర్వాత నోటిఫికేషన్ జారీ చేయాలి. బుట్టాయగూడెం, జీలుగుమిల్లి మండలాల్లో భూసేకరణ ప్రక్రియలో రెవెన్యూ అధికారులు నిబంధనలకు తిలోదకాలిచ్చారు. దళారులతో అధికారులు కుమ్మక్కై వివాదాస్పద భూములను సేకరించేలా ముందుకు సాగుతున్నారనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. గ్రామాల్లోని ప్రజలతో సంబంధం లేకుండా రెవెన్యూ అధికారులే తమకు నచ్చిన వారితో గ్రామసభలు నిర్వహించి తీర్మానాలు చేయాలని ప్రయత్నించడం వివాదాస్పదమవుతోంది. బుట్టాయగూడెం తహశీల్దార్ రెడ్డిగణపవరంలో తమకు కావాల్సిన కొంతమందితో ఇటీవల నిర్వహించిన గ్రామసభను గిరిజనులు అడ్డుకున్నారు. గిరిజనులు, గిరిజనేతరుల మధ్య వివాదంలో ఉన్న భూములను సేకరించి గిరిజనేతర భూస్వాములకు పరిహారం అందించి లాభం చేకూర్చాలని చూస్తున్నారు. వచ్చిన పరిహారంలో పది నుంచి 15 శాతం కొందరు అధికారులకు, కొందరు ప్రజాప్రతినిధులకు ఇచ్చేలా ఒప్పందాలు కుదిరినట్లు ఆరోపణలు విన్పిస్తున్నాయి. కూనవరం, చింతూరు, విఆర్ పురం ప్రాంతాల అధికారులు వచ్చినా ఇక్కడి అధికారులు సహకరించడం లేదని సమాచారం.

మిగులు భూములను తేల్చాలి

గతంలో సేకరించిన దాదాపు వెయ్యి ఎకరాల మిగులు భూములను ముందుగా నిర్వాసితులకు పంపిణీ చేయాలి. భూ సేకరణకు సంబంధించి గ్రామసభల ఆమోదం తర్వాతే భూ సేకరణ నోటిఫికేషన్లు ఇవ్వాలి. వివాదంలో ఉన్న, ఎల్‌టిఆర్ భూముల జోలికి వెళ్లకూడదు. అభ్యంతరాలులేని భూములను మాత్రమే తీసుకోవాలి. గ్రామసభలు జరపకుండా భూ సేకరణ నోటిఫికేషన్ ఇవ్వడం చట్టవిరుద్ధం.

-తెల్లం రామకృష్ణ, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు

'బలిమెల'లో ఒడిశా అధిక వినియోగం

- 2024-25లో 4.88, 2025-26లో 8.87 టిఎంసిలు వాడకం
- సమీక్షా సమావేశంలో అధికారుల వెల్లడి

ప్రజాశక్తి - సీలేరు (అల్లూరి జిల్లా)


ఆంధ్ర -ఒడిశా ఉమ్మడి నిర్వహణలో ఉన్న బలిమెల జలాశయం నీటిని ఒడిశా అధికంగా వినియోగించుకుందని ఇరు రాష్ట్రాల అధికారులు తేల్చారు. బలిమెల జలాశయం నీటి నిల్వలపై సీలేరు ఎపి జెన్‌కో గెస్ట్ హౌస్‌లో ఇరు రాష్ట్రాల అధికారులు బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. 2024 -25 నీటి సంవత్సరంలో ఆంధ్ర కంటే ఒడిశా 4.8847 టిఎంసిలు అధికంగా వినియోగించుకుందని, 2025 -26 నీటి సంవత్సరంలో జులైలో 8.8756 టిఎంసిలను ఒడిశా వినియోగించుకుందని లెక్కలు తేల్చారు. 2024-25లో వినియోగించుకున్న నీటితో కలుపుకొని ఒడిశా 13.7603 టిఎంసిల నీటిని వినియోగించుకోగా, ఆంధ్ర తన వాటా కింద 2025- 26 సంవత్సరం జులైలో 4.8669 టిఎంసిలు నీటిని వినియోగించినట్లు సమావేశంలో లెక్కగట్టారు.

దీని ప్రకారం ఒడిశా కంటే ఆంధ్ర 8.8934 టిఎంసిల తక్కువ నీటిని వినియోగించుకున్నట్లు అధికారులు లెక్క గట్టారు. ప్రస్తుతం బలిమెల జలాశయంలో 23.1750 టిఎంసిలు, జోలాపుట్‌లో 24.0611 టిఎంసిల నీటి నిల్వలు ఉన్నాయని, ఆగస్టు నెలాఖరు నాటికి బలిమెల జలాశయం నదీ పరీవాహ ప్రాంతాల నుంచి 10.5000 టిఎంసిలు, జోలాపుట్ జలాశయంలో ఎనిమిది టిఎంసిల నీరు చేరుతుందని, వీటితో కలుపుకుని రెండు జలాశయాల్లో 65.7361 నీటి నిల్వలు చేరుతాయని ఇరు రాష్ట్రాధికారులు లెక్కలు కట్టారు. ఇందులో ఆంధ్ర వాటాగా 37.3148 టిఎంసిలు, ఒడిశా వాటాగా 28.4213 టిఎంసిలుగా నీటి పంపకాలు చేశారు. విద్యుత్ అవసరాల నిమిత్తం ఆంధ్రకు 2500 క్యూసెక్కులు, ఒడిశాకు 4000 క్యూసెక్కులను బలిమెల జలాశయం నుంచి విడుదల చేయడానికి ఇరు రాష్ట్రాలు ఒప్పందం కుదుర్చుకున్నాయి.

ఒడిశా తరుపున హైడ్రోపవర్ కార్పొరేషన్ బలిమెల మేనేజర్లు అక్షయ్ కుమార్ సాహొ, రంజన్‌నాయక్, జనరల్ మేనేజర్ ఆనందరావు, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ సభదీప్ పాండా, ఒడిశా వాటర్ రిసోర్స్ అధికారులు దిలీప్‌కుమార్, దాలా బెహరా ఎస్టిమేటర్ గడదర్ ప్రధాన్, ఆంధ్ర తరపున సీలేరు కాంప్లెక్స్ ఎస్ఇ (ఒఅండ్‌డాం) చిన్న కామేశ్వరరావు, ఎపి జెన్‌కో ఎస్‌సి (సివిల్) చంద్రశేఖర్ రెడ్డి, ఇఇలు రాజేంద్రప్రసాద్, నాగ శ్రీనివాస్, డిఇఇ జైపాల్, ఎఇఇ సిహెచ్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

టిటిడికి రూ.కోటి విరాళం

ప్రజాశక్తి-తిరుమల:



బెంగళూరుకు చెందిన కల్యాణ్ రామన్ కృష్ణమూర్తి అనే యాత్రికుడు బుధవారం టిటిడి శ్రీవేంకటేశ్వర అన్న ప్రసాదం ట్రస్టు రూ.కోటి విరాళంగా అందించారు. ఈ మేరకు తిరుమలలోని టిటిడి అదనపు ఇఒ క్యాంపు కార్యాలయంలో అదనపు ఇఒ సిహెచ్ వెంకయ్య చౌదరికి విరాళం డిడిని అందజేశారు.

శ్రీవారికి బంగారు లక్ష్మీ పతకం విరాళం

బెంగళూరుకు చెందిన కెఎం శ్రీనివాసమూర్తి అనే యాత్రికుడు రూ.25 లక్షలు విలువైన వజ్రాలు పొదిగిన 148 గ్రాముల బంగారు లక్ష్మీ పతకాన్ని భోగ శ్రీనివాసమూర్తికి అలంకరించేందుకు విరాళంగా అందించారు. శ్రీవారి ఆలయంలోని రంగనాయకులు మండపంలో టిటిడి అదనపు ఇఒ సిహెచ్ వెంకయ్య చౌదరికి ఆభరణాన్ని అందజేశారు.

శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు

తిరుమల శ్రీవారిని బుధవారం ఉదయం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, బిజెపి నేత విష్ణు వర్ధన్ రెడ్డి, నిజామాబాద్ శాసనసభ్యులు సూర్యనారాయణ ఉన్నారు. వీరికి ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం దర్శన ఏర్పాట్లను చేసి స్వామివారి తీర్థప్రసాదాలు అందించారు.

సంపాదకీయం

టారిఫ్‌ల తుపాన్

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో రెండు రోజులుగా తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో అనేక ప్రాంతాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పాలవుతున్నారు. ఈ సమయంలోనే అమెరికా ప్రారంభించిన ట్రేడ్ వార్ ప్రభావం కూడా పెరిగింది. టారిఫ్‌ల తుపాన్ దేశంలోని పలు రంగాలను తీవ్రంగా దెబ్బ తీస్తోందన్న వార్తలు వస్తున్నాయి. మన దేశ ఎగుమతులపై 25నుండి 50శాతం వరకు భారీగా పెంచిన సుంకాలు దేశ ఆర్థిక వ్యవస్థకు పెద్ద దెబ్బకొడుతున్నాయన్నది ఈ వార్తల సారాంశం. అధిక సుంకాలు సీ-ఫుడ్, టెక్స్‌టైల్స్, రత్నాలు, యంత్రాలు వాటి విభాగాలపై ప్రభావం చూపుతున్నాయి. దేశీయ ఎగుమతిదారులు ఒక్క రోజులోనే గణనీయమైన పతనాన్ని చూడాల్సిరావడం ఆందోళనకలిగిస్తోంది. అమెరికా మార్కెట్‌పై అధికంగా ఆధారపడిన వారికి 30 నుండి 40 శాతం మేర ఆర్డర్లు తగ్గినట్లు, దాదాపు ఆ స్థాయిలోనే ఆదాయంలో కూడా తగ్గుదల నమోదైనట్లు ఆర్థిక నిపుణుల అంచనా! దేశ వ్యాప్తంగా మారుమూల ప్రాంతాలకు సైతం ఆన్‌లైన్ వ్యాపారాన్ని విస్తరించి, లాభాలు పోగుచేసుకుంటున్న అమెజాన్ సంస్థ కొత్త ఆర్డర్లను నిలిపివేసింది. మరో దిగ్గజ సంస్థ వాల్‌మార్ట్ కూడా అదేబాటన నడిచింది. వాటితో పాటు మరికొందరు అమెరికా కొనుగోలుదారులు కూడా వియత్నాం, బంగ్లాదేశ్, ఈక్వెడార్ వంటి తక్కువ టారిఫ్ కలిగిన దేశాలవైపు మళ్లిపోయారు. ఫలితంగా ఆర్డర్లలో భారీగా తగ్గుదల నమోదైంది. తొలి రెండురోజుల్లోనే 40 శాతం వరకు ఈ తగ్గుదల నమోదుకాగా, భవిష్యత్తులో ఇది 50 శాతం దాటుతుందని అంచనా!

ఈ సంక్షోభ ప్రభావం మన రాష్ట్రంపై కూడా తీవ్రంగా పడుతోంది. దేశ వ్యాప్తంగా జరుగుతున్న సీ-ఫుడ్ ఎగుమతులలో మూడవ వంతు మన రాష్ట్రం నుంచే జరుగుతుండటం గమనార్హం. మన దేశం నుండి జరుగుతున్న సీ-ఫుడ్ ఎగుమతుల్లో అత్యధిక వాటా రొయ్యలదే కాగా, దానిలో ఆంధ్రప్రదేశ్ వాటా 60 శాతానికి పైగా ఉంటుందని అంచనా! రొయ్యల సాగుకు కీలకమైన హార్వెస్టింగ్ సీజన్ సాగుతున్న ప్రస్తుత సమయంలోనే ట్రంప్ విధించిన కొత్త సుంకాలు అమలులోకి వచ్చాయి. దీని ప్రభావం వెంటనే రైతులు, ఎగుమతిదారులపై పడింది. ఫామ్ గేటువద్దే 19శాతం ధర పడిపోయినట్లు చెబుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 6.5 లక్షల మంది రొయ్యల రైతుల మీద, ఆ రంగంపై ఆధారపడి పొట్టపోసుకుంటున్న మరో 30నుండి 40 లక్షల మందిపైనా దీని ప్రభావం తీవ్రంగా పడనుంది. ఆంధ్రప్రదేశ్ తరువాత ఒడిషా, కేరళ, తమిళనాడు రాష్ట్రాలు ఈ రంగంలో తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్నాయి. ఉత్తర, మధ్య భారతంలోని అనేక రాష్ట్రాలు టెక్స్‌టైల్స్, యంత్రాల ఎగుమతులపై విధించిన టారిఫ్‌ల కారణంగా నష్టాలను ఎదుర్కొంటున్నాయి. ప్రధాన మంత్రి సొంత రాష్ట్రమైన గుజరాత్ నుండి పెద్ద ఎత్తున జరుగుతున్న టెక్స్‌టైల్స్ ఎగుమతులపై టారిఫ్‌లు తీవ్ర పభ్రావాన్ని చూపించాయి. అమెరికాతో జరిగే టెక్స్‌టైల్ వ్యాపారంలో గుజరాత్‌ది దాదాపు 35శాతం వాటా కాగా, ప్రస్తుతం యార్న్ నుండి ఫ్యాబ్రిక్ వరకు మొత్తం ఉత్పత్తులు నిలిచిపోయాయి. దీంతో లక్షలాది మంది ఉపాధి కోల్పోయే పరిస్థితి ఏర్పడింది. అనేక చిన్న, మధ్యతరహా వ్యాపారాలు (ఎంఎస్‌ఎంఇలు) మూసివేత ముప్పును ఎదుర్కొంటున్నాయి.

ఇంత జరుగుతున్నా మోడీ ప్రభుత్వానికి చీమ కుట్టినట్టు కూడా లేకపోవడం దిగ్భ్రాంతి కలిగిస్తోంది. ట్రంప్ టారిఫ్‌ల ప్రభావం దేశ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపి, దేశాన్ని పతనం దిశకు నెట్టకముందే కేంద్ర ప్రభుత్వం మేల్కోవాలి. తక్షణ, దీర్ఘకాల ప్రత్యామ్నాయ ప్రణాళికలను రూపొందించి, అమలు ప్రారంభించాలి. కార్పొరేట్ అనుకూల, ఉదారవాద విధానాల అమలు నేపథ్యంలో దేశ విదేశాంగ విధానాన్ని, ఆర్థిక వ్యవస్థను అమెరికాకు డూడూ బసవన్నగా మారిన పర్యవసానం ఇది. ఇప్పటికైనా అమెరికా చేస్తున్న వాణిజ్యయుద్ధాన్ని ఎదుర్కొనాలి. కేంద్ర ప్రభుత్వం సరైన వ్యూహంతో దాన్ని తిప్పికొట్టాలి. ఆక్వా, టెక్స్‌టైల్ తదితర రంగాలపై తీవ్ర ప్రభావం పడుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రయోజనాల పరిరక్షణకు కేంద్ర ప్రభుత్వంపై తగిన ఒత్తిడి తేవడం టిడిపి కూటమి సర్కారు విద్యుక్త ధర్మం.

మంచి మాట




ఆలోచనలు తుపాకుల కంటే శక్తిమంతమైనవి. శత్రువులు మన దగ్గర తుపాకులను వుండనివ్వరు.
- జోసెఫ్ స్టాలిన్

సమాఖ్య వ్యవస్థపై బహుముఖ దాడి

సందర్భం



ప్రకాశ్ కరత్



> హిందూత్వ, కార్పొరేట్ కలయికకు ప్రాతినిధ్యం వహించే మోడీ ప్రభుత్వం రాజ్యాంగం మూడు మూల స్తంభాలైన ప్రజాస్వామ్యం, లౌకికతత్వం, సమాఖ్యతత్వం మూడింటినీ తన దాడికి లక్ష్యాలుగా చేసుకుంది. రాజ్యాంగానికి పునాది రాళ్లయిన ఈ మూడు మౌలిక సూత్రాలపై దాడి చేయడంలో పరస్పర అంతస్సంబంధం వుంది. సమాఖ్య సూత్రాలపై దాడి అంటే ప్రజాస్వామ్యంపై దాడి తప్ప మరొకటి కాదు. ఎందుకంటే ఎన్నికైన ప్రభుత్వాల, చట్టసభల హక్కులను ఏ విధంగా హరించినా అది ప్రజాస్వామ్యంపైనా దాడి అవుతుంది. అదే విధంగా మైనార్టీలకు ప్రజాస్వామ్యంలో సమాన హక్కు వుంటుంది గనక లౌకికతత్వాన్ని దెబ్బతీసే ఏ చర్య అయినా ప్రజాస్వామ్యంపై దాడి అవుతుంది.

భారత దేశం 'రాష్ట్రాల సమాఖ్య' అనే ఫెడరల్ సూత్రాన్ని ఆర్.ఎస్.ఎస్, బి.జె.పి లు ఏనాడూ ఆమోదించ లేదు. ఆర్.ఎస్.ఎస్ భావన అయిన అఖండ భారత్ దృక్పథమే వారికి కావలసింది. అలాంటి భారత్ ఒక సర్వాధికార కేంద్రీకృత రాజ్యంగా వుంటే రాష్ట్రాలు కేవలం పాలనా సౌలభ్యం కోసం ఏర్పడిన పాలనా విభాగాలుగా మాత్రమే వుండాలన్నది వారి దృక్పథం.

రాజ్యాంగంలో సమాఖ్య స్వభావం పొందుపర్చబడింది. కేంద్ర రాష్ట్రాల మధ్య అధికార పరిధులు ప్రత్యేకంగా పేర్కొనబడ్డాయి. ప్రజలచే ఎన్నుకోబడిన రాష్ట్ర ప్రభుత్వాలకూ రాష్ట్రాల శాసనసభలకూ రాజ్యాంగ ప్రాతిపదిక ఏర్పర్చబడింది. స్వాతంత్ర్యం వచ్చాక 77 ఏళ్లకు ఇప్పుడు వాటన్నిటినీ విచ్ఛిన్నం చేసే ప్రమాదం కనిపిస్తున్నది.

త్రిముఖ దాడి

హిందూత్వ, కార్పొరేట్ కలయికకు ప్రాతినిధ్యం వహించే మోడీ ప్రభుత్వం రాజ్యాంగం మూడు మూల స్తంభాలైన ప్రజాస్వామ్యం, లౌకికతత్వం, సమాఖ్యతత్వం మూడింటినీ తన దాడికి లక్ష్యాలుగా చేసుకుంది. రాజ్యాంగానికి పునాది రాళ్లయిన ఈ మూడు మౌలిక సూత్రాలపై దాడి చేయడంలో పరస్పర అంతస్సంబంధం వుంది. సమాఖ్య సూత్రాలపై దాడి అంటే ప్రజాస్వామ్యంపై దాడి తప్ప మరొకటి కాదు. ఎందుకంటే ఎన్నికైన ప్రభుత్వాల, చట్టసభల హక్కులను ఏ విధంగా హరించినా అది ప్రజాస్వామ్యంపైనా దాడి అవుతుంది. అదే విధంగా మైనార్టీలకు ప్రజాస్వామ్యంలో సమాన హక్కు వుంటుంది గనక లౌకికతత్వాన్ని దెబ్బతీసే ఏ చర్య అయినా ప్రజాస్వామ్యంపై దాడి అవుతుంది. రాజ్యాంగం సమాఖ్య సూత్రాల వరకే తీసుకుంటే దేశానికి స్వాతంత్ర్యానంతరం అధికారం చేజిక్కించుకున్న పాలక వర్గాల స్వభావం రీత్యా కేంద్రం చేతుల్లోనే అధికారాలన్నీ కేంద్రీకృతం చేసి కేంద్రం చేతుల్లో పెట్టాలనే నిరంతర ఒత్తిడి కొనసాగుతూనే వచ్చింది. పాలక వర్గ కూటమికి నాయకత్వం వహిస్తున్న బడా బూర్జువా వర్గానికి తమ పెట్టుబడులు, సరుకులు ఎలాంటి ఆటంకాలు లేకుండా నిరాటంకంగా సాగిపోవాలంటే ఒక సమైక్య అఖిల భారత మార్కెట్ వుండాలి. బడా వ్యాపారులకు ప్రాతినిధ్యం వహించే సంఘాలు ఆర్.ఎస్.ఎస్ లాగానే భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటును వ్యతిరేకించాయి.

1970లలోనూ, 80లలోనూ వెంటవెంట వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వాలు కేంద్రం చేతుల్లో మరిన్ని అధికారాలను పోగు వేసేందుకు చర్యలు తీసుకున్నాయి. మరీ ముఖ్యంగా ఇందిరా గాంధీ పాలనలో ఇది జరిగింది. అయితే ఈ రోజున మనం చూస్తున్నది అందుకు పూరితిగా భిన్నమైంది. రాష్ట్రాల హక్కులపై ఉద్దేశపూరకంగానూ, పథకం ప్రకారమూ దాడి జరుగుతున్నది. రాజ్యాంగంలో అంతర్భాగమైన సమాఖ్య లక్షణాన్ని ధ్వంసం చేసే చర్యలు తీసుకుంటున్నారు. సమాఖ్యకు సంబంధించిన రాజకీయ ఆర్థిక సాంస్కృతిక అంశాలలో ఇదే కనిపిస్తుంది.

వ్యవస్థకే చేటు

ఎన్నికల ద్వారా వచ్చిన రాష్ట్ర ప్రభుత్వాల అధికారాలను దెబ్బ తీసేందుకు గవర్నర్లను వినియోగించడం బి.జె.పి, ఆర్.ఎస్.ఎస్ ల ఈ సరికొత్త నిరంకుశ పోకడలో నూతన కోణం. గతకాలంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు గవర్నర్ కార్యాలయాన్ని దుర్వినియోగ పర్చేవారు. గవర్నర్ 356వ అధికరణం కింద ఒక రాష్ట్ర ప్రభుత్వాన్ని కూలగొట్టి రాష్ట్రపతి పాలన కోసం సిఫార్సు చేసేవారు. అయితే 1995లో ఎస్.ఆర్.బొమ్మై కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో గవర్నర్ పదవిని ఈ విధంగా దుర్వినియోగానికి పగ్గాలు వేసింది.

మోడీ ప్రభుత్వ హయాంలో గవర్నర్లు రాజకీయంగా చురుగ్గా, పక్షపాతంగా వుండాలనే పద్ధతి నడుస్తున్నది. ప్రత్యేకించి బి.జె.పి యేతర పార్టీల పాలనలోని రాష్ట్రాలలో ఇది జరుగుతున్నది. గవర్నర్లు రాష్ట్ర ప్రభుత్వాలను విమర్శిస్తూ ప్రకటనలు చేసే పద్ధతి అమలులోకి వచ్చింది. అధికారులను రమ్మని హుకుంలు జారీ చేయడం, రాష్ట్ర శాసనసభలు ఆమోదించిన బిల్లులకు ఆమోదం చెప్పకుండా తొక్కిపట్టడం, ఛాన్సలర్‌గా తనకు వున్న స్థానాన్ని అడ్డం పెట్టుకుని విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్లుగా ఆ ప్రభుత్వాలు సిఫార్సు చేసిన వారిని నియమించకపోవడం జరుగుతున్నది. బిజెపి యేతర ప్రభుత్వాల పాలనలోని తమిళనాడు, కేరళ, పశ్చిమ బెంగాల్, పంజాబ్, కర్ణాటక రాష్ట్రాల గవర్నర్లు ఎప్పటికప్పుడు రాజ్యాంగ పరిధి ఉల్లంఘించేస్తున్నారు. కేంద్రం ఆదేశాలతోనే ఇది జరుగుతున్నది. రాజకీయ రంగంలో రాష్ట్రాల పాత్రను దురాక్రమించే అత్యంత తీవ్రమైన పద్ధతిగా తయారైంది.

గవర్నర్ల రాజ్యాంగ వ్యతిరేక చర్యలపై ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలు ఎదురుతిరిగి పోరాడుతున్నాయి. ఉదాహరణకు రాష్ట్ర శాసనసభ ఆమోదించిన బిల్లులకు సంతకం చెయ్యకుండా గవర్నర్ తొక్కిపట్టడంపై కేరళ, తమిళనాడు సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేశాయి. గతంలో 2023 నవంబరులో పంజాబ్‌కు సంబంధించి ఇచ్చిన తీర్పులో సుప్రీం కోర్టు శాసనసభ ఆమోదించిన నాలుగు బిల్లుల చెల్లుబాటును గవర్నర్ ప్రశ్నించడానికి లేదని, వాటికి ఆమోదం తెల్పకుండా అట్టిపెట్టుకోరాదనీ స్పష్టం చేసింది. తాజాగా 2025 ఏప్రిల్‌లో తమిళనాడు గవర్నర్ ఆర్.ఎన్.రవి శాసనసభ ఆమోదించిన 12 బిల్లులకు ఆమోదం తెల్పకుండా తొక్కిపట్టడానికి సంబంధించి వేసిన కేసులో సుప్రీంకోర్టు చరిత్రాత్మకమైన తీర్పునిచ్చింది. 200 అధికరణం ప్రకారం గవర్నర్ పాత్ర ఏమిటో నిర్వచించింది. ఆ బిల్లులను నిలిపివేసే వీటో అధికారం గవర్నర్‌కు లేదనీ తేల్చిచెబుతూ ఇద్దరు సభ్యుల ధర్మాసనం వాటి ఆమోద ప్రక్రియకు గడువు నిర్దేశించింది. లేదంటే ఆ లోగానే వాటిని పున:పరిశీలనకై అసెంబ్లీకి తిప్పి పంపాలన్నది. అదే విధంగా రాష్ట్రపతి కూడా వాటిపై అభిప్రాయం చెప్పడానికి తీసుకునే సమయంపై గడువు పెట్టారు. వాటిని గనక గవర్నర్ ఆమోదించకుండా అలాగే అట్టిపెడితే ఆ చర్య చట్టవిరుద్ధమనీ, వాటిని ఆమోదించినట్టే భావించవలసి వుంటుందని కూడా స్పష్టం చేశారు.

పాక్షిక రాజకీయ ప్రయోజనాల కోసం గవర్నర్ల అధికారాలను దుర్వినియోగం చేస్తున్న మోడీ ప్రభుత్వ తీరుకు సుప్రీంకోర్టు తీర్పు చెంపపెట్టుగా మారింది. ఈ తీర్పు మింగుడుపడని కేంద్రం సుప్రీంకోర్టుకు రాష్ట్రపతి ప్రస్తావనను పంపించే అసాధారణ చర్యకు పాల్పడింది. ఉన్నత రాజ్యాంగ పదవుల్లో ఉన్న వారికి న్యాయవ్యవస్థ నిర్దేశాలు చేయవచ్చునా అనే మీమాంసపై దాని అభిప్రాయం అడిగింది. మోడీ ప్రభుత్వం ఏక పార్టీ నియంతృత్వం దిశలో వెళ్తున్న తీరుకు ఈ ఘట్టం అద్దం పడుతున్నది.

ఒక దేశం ఒకే ఎన్నిక ద్వారా లోక్‌సభకు, రాష్ట్రాల శాసనసభలకు, స్థానిక సంస్థలకు ఒకేసారి ఎన్నికలు జరపాలనే పద్ధతి రాష్ట్రాలకు రాజ్యాంగం ఇచ్చిన హామీలను తీవ్రంగా కోత కోస్తుంది. శాసనసభలకు ఐదేళ్ల కాల పరిమితి లేకుండా చేస్తుంది. మోడీ ప్రభుత్వం దీన్ని అమల్లోకి తేవడం కోసం పార్లమెంట్‌లో రాజ్యాంగ సవరణ ప్రవేశపెట్టింది. ఎన్నికల వ్యవస్థలో ఈ మార్పు తేవడం చాలా తీవ్ర పర్యవసానాలకు దారితీస్తుంది. దీనివల్ల కొన్ని రాష్ట్రాల శాసనసభల పదవీ కాలాన్ని ముక్కలు చేయటం, గవర్నర్ పాలన ప్రవేశ పెట్టడం, కేంద్రం జోక్యం పెరగడం సంభవిస్తాయి. ఇది సమాఖ్య వ్యవస్థకు శరాఘాతంగా పరిణమిస్తుంది.

> ఒక దేశం ఒకే ఎన్నిక ద్వారా లోక్‌సభకు, రాష్ట్రాల శాసనసభలకు, స్థానిక సంస్థలకు ఒకేసారి ఎన్నికలు జరపాలనే పద్ధతి రాష్ట్రాలకు రాజ్యాంగం ఇచ్చిన హామీలను తీవ్రంగా కోత కోస్తుంది. శాసనసభలకు ఐదేళ్ల కాల పరిమితి లేకుండా చేస్తుంది. మోడీ ప్రభుత్వం దీన్ని అమల్లోకి తేవడం కోసం పార్లమెంట్‌లో రాజ్యాంగ సవరణ ప్రవేశపెట్టింది. ఎన్నికల వ్యవస్థలో ఈ మార్పు తేవడం చాలా తీవ్ర పర్యవసానాలకు దారితీస్తుంది. దీనివల్ల కొన్ని రాష్ట్రాల శాసనసభల పదవీ కాలాన్ని ముక్కలు చేయటం, గవర్నర్ పాలన ప్రవేశ పెట్టడం, కేంద్రం జోక్యం పెరగడం సంభవిస్తాయి. ఇది సమాఖ్య వ్యవస్థకు శరాఘాతంగా పరిణమిస్తుంది.

ఆర్థిక దిగ్బంధనం

ఆర్థిక ద్రవ్య విభాగాలు మరో కీలక రంగంగా ఉన్నాయి. ప్రతిపక్షాల పాలనలోని రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థికంగా ద్రవ్యపరంగా వివక్ష ఎదుర్కొంటున్నాయి. కొన్ని సందర్భాల్లోనైతే కేరళ వంటి చోట్ల వాటిని ఆర్థిక దిగ్బంధనానికి గురి చేసే ప్రయత్నం జరుగుతున్నది. రాష్ట్రాలతో పంచుకోవాల్సిన ఉమ్మడి పన్నులను తగ్గించటం, రాష్ట్రాలకు వనరులను నిరాకరించటం, జిఎస్టి పరిహారం కొనసాగించక పోవడం ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలకు ఆర్థిక సంక్షోభాన్ని తెచ్చిపెట్టాయి. కేంద్ర బడ్జెట్లో రాష్ట్రాలకు పంపిణీ కావాల్సిన వాటా తగ్గించివేయటం కొన్నేళ్లుగా జరుగుతూ వస్తున్నది. 2016లో ఇది 41.1 శాతం ఉంటే 2023లో 35.1 శాతానికి పడిపోయింది.

రాష్ట్రాలకు వాటా ఇవ్వనవసరం లేని ఆదాయాలు సర్ చార్జీలపై కేంద్రం మరింతగా ఆధార పడటంతో పన్ను ఆదాయం మొత్తం తగ్గించి వేసింది. వీటన్నిటిని మించి వనరులను తగ్గించి వేయడంతో రాష్ట్రాలు అప్పులు తెచ్చుకోవడం మీద ఆంక్షలు పెరిగాయి. అప్పు చేయడంపై ఆంక్షలు పెట్టడం ద్వారా కేంద్రం రాష్ట్రాల ఆర్థిక వనరులను బిగించేసి వాటి అభివృద్ధి కార్యకలాపాలకు అడ్డుపడుతున్నది. ఆ తర్వాత బి.జె.పి కేంద్ర పాలక పార్టీగా రాష్ట్రాల ఆర్థిక సమస్యలను ఆధారం చేసుకుని ఆ ప్రభుత్వాలపై వ్యతిరేక ప్రచారం చేసేందుకు పాల్పడుతున్నది. ఈ విధంగా నిధులను నిరాకరించే ఈ వివక్షాయుత రీతులు రాష్ట్రాలను కేంద్రానికి తోకలుగా మార్చివేస్తుంది. సమాఖ్య సూత్రం లక్షణాలనే దెబ్బ తీస్తుంది.

హిందుత్వ రుద్దుడు

ఇక సమాఖ్య వ్యవస్థపై సాగుతున్న కేంద్రీకృత దాడిలో మూడో భాగం సాంస్కృతిక రంగానికి సంబంధించినది. విద్య, భాష, ఇతర సాంస్కృతిక సంప్రదాయాలు దీని కిందకే వస్తాయి. బి.జె.పి, ఆర్.ఎస్.ఎస్ నినాదం ఒకే దేశం, ఒకే భాష, ఒకే సంస్కృతి అన్నదాన్ని దేశ వ్యాపితంగా ఏకపక్షంగా రుద్దడం వల్ల సమాఖ్యతత్వం లోని సాంస్కృతిక వైవిధ్యం, బహుళత్వం కాలరాచి వేయబడతాయి. విద్యా రంగంలో హిందుత్వ విలువలను రుద్దే పోకడలు, ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల్లో గవర్నర్లను ఉపయోగించుకుని వైస్ ఛాన్సలర్లను నియమించడం ద్వారా తమిళనాడు, కేరళ, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో వైస్‌ఛాన్సలర్ల ఎంపిక రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలోని విశ్వవిద్యాలయాలలో కేంద్రం ఆదేశాల మేరకు జరుగుతున్నది.

కేంద్రం జారీ చేసిన యుజిసి మార్గదర్శకాల ముసాయిదా వైస్ ఛాన్సలర్ల నియామకంలో ఛాన్సలర్/గవర్నర్ పాత్రను మరింత పెంచుతున్నది. విద్యారంగం ఉమ్మడి జాబితాలోది. అయితే అనేక కేంద్ర విద్యా సంస్థలు కేంద్ర పథకాల ద్వారా రాష్ట్ర ప్రభుత్వాలు పాఠశాలల్లో ఆ పథకాలను అమలు చేయక తప్పని పరిస్థితి కల్పించబడుతున్నది. లేకపోతే వాటికి నిధులు నిలిపివేస్తామన్న బెదిరింపు వస్తోంది. భాషా విధానానికి సంబంధించి హిందీని బలవంతంగా రుద్దడానికి హిందీయేతర రాష్ట్రాలపై చర్యలు కొనసాగుతూనే ఉన్నాయి. కేంద్ర సెన్సార్ బోర్డ్ ద్వారా హిందుత్వ సందేశంతో వచ్చే చిత్రాలను ప్రోత్సహించటం, ప్రజాస్వామ్య సాంస్కృతిక విలువలు చెప్పే చిత్రాలను అడ్డుకోవడం జరుగుతున్నది. ఈ విషయంలో కూడా సాంస్కృతిక కార్యక్రమాలు, సృజనలను పూర్తిగా కేంద్రీకృతం చేసే ఏకరూపంగా మార్చడానికి బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ పాలకులు పాకులాడుతున్నారు.

హిందుత్వ నియంతృత్వ విధానం అమలు కావాలంటే కేంద్రీకృత పోకడలే ఉండాలి. అది రాష్ట్రాల హక్కులకు సమాఖ్యతత్వానికి వ్యతిరేకం. అందువల్ల సమాఖ్య తత్వాన్ని సంరక్షించుకోవడం, రాష్ట్రాల హక్కుల కోసం పోరాటం నియంతృత్వ వ్యతిరేక, హిందుత్వ వ్యతిరేక పోరాటంలో ముఖ్యమైన భాగంగా ఉంటాయి. ఈ పోరాటాన్ని బిజెపి యేతర రాష్ట్ర ప్రభుత్వాలన్నీ సమైక్యంగా కొనసాగించాలి. అన్ని వామపక్ష, ప్రజాస్వామ్య, లౌకిక శక్తుల విశాల ఐక్యతను పెంపొందించాలి.

/ వ్యాసకర్త సిపిఐ(ఎం) పూర్వ ప్రధాన కార్యదర్శి /

రాయితీలు కార్పొరేట్లకు - పేదల బాధ్యత చిరుద్యోగులకు

వ్యాఖ్య

ఎం. సూర్యారావు

గుజరాత్ లోని ఆనంద్‌లో పాఠశాల విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న సందర్భంగా ఓ పిల్లవాడు నన్ను తెలివైన ప్రశ్న వేశాడు. 'మన శత్రువు ఎవరు?' అని. నాకా ప్రశ్న నచ్చి తక్కిన విద్యార్థుల ముందు పెట్టి వారి అభిప్రాయాలు అడిగాను. "పేదరికమే మన శత్రువు" అని అప్పుడు వచ్చింది జవాబు.- డా॥ఎ.పి.జె.అబ్దుల్ కలాం చాలా కాలం కిందట చెప్పారు. ఇప్పటికీ మన శత్రువు పేదరికమే. దానిని పారదోలేందుకే కమ్యూనిస్టు పోరాటాలు. అయితే పాలకవర్గ పార్టీల హామీలు, ఎజెండాలతో 78 ఏళ్ల స్వాతంత్ర్య పాలనలో ప్రభుత్వాలకు ఇది సాధ్యపడలేదు. ఇప్పుడు మన ముఖ్యమంత్రి గారు పేదరికాన్ని రూపుమాపడానికి పి-4 (ప్రభుత్వం, ప్రైవేట్, పీపుల్, పార్టనర్‌షిప్) అనే ఒక కొత్త పల్లవి అందుకున్నారు.

పి-4 ప్రైవేటీకరణ నుండి పేదరికం వరకు

దేశంలో మోడీ, రాష్ట్రంలో చంద్రబాబు వికసిత భారత్, స్వర్ణాంధ్రప్రదేశ్ 2047 విజన్‌లను ప్రకటించారు. ప్రైవేటీకరణ ద్వారానే ఇవి సాధ్యమని, ఆ మార్గాన్ని ఎంచుకున్నారు. 2014-19లో కూడా ఈ మార్గమే అనుసరించారు. సన్‌రైజ్ ఆంధ్రప్రదేశ్ అనే నినాదం ఎత్తుకున్నారు. అది కాస్తా ఎన్నికల దగ్గర బోల్తా పడి 'సన్ సెట్'గా మారింది. దాని కొనసాగింపే వివిధ రంగాలకు చెందిన 12 పాలసీలు. ఈ స్వర్ణాంధ్ర, పి-4. ఈ పాలసీల అమలులో భాగంగానే ప్రభుత్వ ఆసుపత్రులు, స్కూళ్ల ఆధునీకరణ, నిర్వహణ, తాగునీరు, పారిశుధ్యం, వృద్ధాలు, వీధిలైట్ల నిర్వహణను ప్రైవేటు వారికి, కార్పొరేట్లకు, ఎన్‌జిఓలకు అప్పగించాలనుకోవడం. తొలి విడతలో 18 రోడ్లు (1307 కి.మీ), మలి దశలో పంచాయితీ రోడ్లను సైతం అభివృద్ధి చేసి, టోల్ వసూలు చేయాలనుకుంటున్నది. వీటిపై ప్రజల నుండి తీవ్ర స్థాయిలో వ్యతిరేకత వ్యక్తమైంది. దీంతో పి-4 అంటే పేదరిక నిర్మూలన, జీరో పోవర్టీ అని నమ్మించేందుకే పేదల దత్తత పేరుతో ఈ కొత్త నాటకం మొదలెట్టింది.

కేంద్ర ఆర్థిక సర్వే ప్రకారం పేదరికంలో మన రాష్ట్రం దేశంలో తొమ్మిదవ స్థానంలో ఉంది. రాష్ట్రంలో రేషన్ కార్డు ఉన్న కుటుంబాల సంఖ్య 1.48 కోట్లు. కేంద్ర ప్రభుత్వం గుర్తించిన పేద కుటుంబాలు 90 లక్షలు. వీరంతా పేదలే అని ప్రభుత్వం కార్డులు ఇచ్చింది. పి-4 కింద వీరిందరిని పేదరికం నుండి బయటపడేయాలి. కాని అది సాధ్యం కాదని ప్రభుత్వానికి తెలుసు. అందుకే పేదరికం కుదింపు ప్రక్రియను ఉగాది రోజున ప్రారంభించింది. సచివాలయాల వారీగా తెల్ల రేషన్ కార్డుదారుల వివరాలు పంపి పేదలను గుర్తించమంది. తాగునీటి సౌకర్యం, విద్యుత్, బ్యాంకు అకౌంట్ ఉందా? వంటకు గ్యాస్ వాడుతున్నారా? కట్టెలా? కుటుంబంలో సంపాదిస్తున్నవారు ఉన్నారా? వంటి ప్రశ్నలతో పేదలను కుదించమని ఉద్యోగులను ఆదేశించింది. గ్యాస్, కరెంట్, బ్యాంక్ అకౌంట్ లేని కుటుంబాలు ఉండవు. వీటి ఆధారంగా పేదలు 19.15 లక్షలకు కుదించబడ్డారు. మార్గదర్శకులు (దత్తత) దొరకకపోతే పేదల సంఖ్య ఇంకా తగ్గుతూనే ఉంటుందేమో!

పేదరిక నిర్మూలన నుండి తప్పుకోవడమే

ఈ మాత్రపు పేదలను కూడా పేదరికం నుండి బయటపడేసే పని ప్రభత్వానిది కాదట! పేదలకు బంగారు కుటుంబాలుగా నామకరణం చేసింది. అదే ఏరియాలో ఆర్థికంగా ఉన్న వారిని మార్గదర్శి కుటుంబాలుగా గుర్తించింది. మార్గదర్శి కుటుంబాలు రెండు రకాలుగా పేదలకు సహాయం చేయవచ్చు. 1. మార్గదర్శకత్వం చేయడం, కొంత ఆర్థిక సహాయం చేయడం. 2. ఆర్థిక సహాయం మాత్రమే చేయడమట. మార్గదర్శి కుటుంబాలు దానం చేస్తే వారి సహాయంతో వీరు పేదరికం నుండి బయట పడాలి. పడకపోతే ఆ లోపం పేద బంగారు కుటుంబానిది. ఇక తప్పు ప్రభుత్వానిది కాదు. ప్రభుత్వం తన బాధ్యత నుండి తప్పుకొని పారిపోతున్నది. పైగా ఆర్థిక సహాయం చేయడాన్ని దానంగా చూడకండంటూ ఉచిత సలహా ఇస్తోంది.



> వికసిత భారత్, స్వర్ణాంధ్ర-2047 వంటి విజన్‌లు ప్రకటించినంత మాత్రాన పేదరిక నిర్మూలన సాధ్యం కాదు. దత్తత పరిష్కారం అసలే కాదు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం మాదిరిగానే పట్టణ ఉపాధికి సంబంధించి కూడా ఒక చట్టం తీసుకువచ్చి ఉపాధి కల్పించాలి. షాపింగ్ మాల్స్, ప్రైవేటు విద్యాసంస్థల వంటి చోట్ల ఐదారు వేల రూపాయలకే పని చేసే సిబ్బందికి, స్కీమ్ వర్కర్లకు కనీస వేతనాలు రూ.21 వేలకు తగ్గకుండా ఇవ్వాలి. కార్పొరేట్లకు రూ.లక్షల కోట్ల రాయితీలు ఇచ్చేకన్నా ప్రభుత్వమే పరిశ్రమలు పెట్టి ఉపాధి కల్పించవచ్చు.

దత్తతకు ముందుకు రారే...!

కార్పొరేట్ ట్యాక్స్ చెల్లిస్తున్నవారు అధికంగా ఉన్న విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, తిరుపతి లాంటి కార్పొరేషన్లలోనే పేదలను దత్తత తీసుకునేందుకు ముందుకు రావడం లేదు. రాయితీలు పొందుతున్న శ్రీమంతులు సైతం సిద్ధపడడం లేదు. దీంతో సచివాలయ ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు, ఉద్యాన, వ్యవసాయ శాఖ ద్వారా ఆదర్శ రైతులకు ఆ బాధ్యతను అప్పగించారు. చిరుద్యోగులకు పేదరిక నిర్మూలన బాధ్యత అప్పగించడం సరికాదు.

ప్రభుత్వ రాయితీలు పొందుతున్న, రూ. కోటి ఆపైన ఆదాయం కలిగిన 1,362 మంది కోటీశ్వరులు ఎంత మందిని దత్తత తీసుకున్నారు? జివికె, ఎన్‌సిసి, హైటెక్ ఇన్‌ఫ్రా, రెడ్డీస్, అరోక్ష, ఎన్‌టిపిసి వంటి కార్పొరేట్ సంస్థలు ముందుకు వచ్చాయా? కనీసం సిఎస్‌ఆర్ నిధులు వెచ్చించే సంస్థలు కూడా పేదలను దత్తత తీసుకోవడానికి ముందుకు రావడం లేదు. ఒకవేళ దత్తత తీసుకుని ఆర్థిక సహాయం అందిస్తే ఎంత చేయాలి? ఎన్ని సంవత్సరాలు చేయాలి? ఒక స్పష్టత లేదు. ఇలా చేస్తే శాశ్వతంగా ఆధారపడేవారిగా మారతారు తప్ప, పేదరికం నుండి బయటపడలేరు.

జీరో పోవర్టీ కావాలంటే ....?

వికసిత భారత్, స్వర్ణాంధ్ర-2047 వంటి విజన్‌లు ప్రకటించినంత మాత్రాన పేదరిక నిర్మూలన సాధ్యం కాదు. దత్తత పరిష్కారం అసలే కాదు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం మాదిరిగానే పట్టణ ఉపాధికి సంబంధించి కూడా ఒక చట్టం తీసుకువచ్చి ఉపాధి కల్పించాలి. షాపింగ్ మాల్స్, ప్రైవేటు విద్యాసంస్థల వంటి చోట్ల ఐదారు వేల రూపాయలకే పని చేసే సిబ్బందికి, స్కీమ్ వర్కర్లకు కనీస వేతనాలు రూ.21 వేలకు తగ్గకుండా ఇవ్వాలి. కార్పొరేట్లకు రూ.లక్షల కోట్ల రాయితీలు ఇచ్చేకన్నా ప్రభుత్వమే పరిశ్రమలు పెట్టి ఉపాధి కల్పించవచ్చు.

ప్రభుత్వం నుండి రాయితీలు పొందుతున్న కార్పొరేట్ సంస్థలు, పెద్ద పెద్ద వ్యాపారస్తులకు పేద కుటుంబాలలో ఉపాధి కల్పనకు కోటాలు ఇవ్వాలి. అమెరికా, బ్రెజిల్ మాదిరిగానే నిరుద్యోగులకు ఉపాధి కల్పించేవరకూ ఆర్థిక సహకారం అందించాలి. అలాగే పరిశ్రమలు, ఐ.టి సెక్టార్లలో పని గంటలు కుదించాలి. తద్వారా ఎక్కువ మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పించవచ్చు. కోనేరు రంగారావు కమిటీ సిఫార్సుల ప్రకారం మిగులు భూమి, ప్రభుత్వ భూములను పేదలకు పంచాలి! ★

కవిత్వం

ఎక్కడున్నాం?

ఎక్కడున్నాం? మనమెక్కడున్నాం?
మన దేహంతో మన దేశంలోనే ఉన్నామా?
త్రివర్ణం కింద ఆ స్వేచ్ఛనే శ్వాసిస్తున్నామా?
మన గాలిని మనమే పీలుస్తున్నామా?

లేదు, మనమెందులోనో బందీలమై ఉన్నాం
తెల్లోడి బానిసత్వం వదిలించుకున్నా
ఇంకా బానిసత్వం చీడ వదలని
పాలన కిందే నలుగుతున్నాం
మన చమురు దిగుమతులపై
పరాయోడి పెత్తనం సాగుతోందంటే
వినలేదని బెదిరిస్తూ టారిఫ్ లు పెంచి
రొమ్ము విరిచి మనపై పన్నులేసే దమ్ము
విదేశీ పాలకుడికి వచ్చిందంటే ...
బ్రిటీషోడికి తలొంచి తలాడించిన
బానిసత్వం మన పాలకులనొదలలేదు
మన త్రివర్ణంపై ఆ 'చెదపురుగు' తొలగలేదు.

త్రివర్ణమా! ఇప్పుడు తీర్పు నువ్వే చెప్పాలి
నీ శ్వాస నీదిగానే ఉందా? లేదా?
బెదిరించే వాడిని ఎదిరించి నిలవాలా?
తలలొంచి బానిసత్వంలోనే తడవాలా?
ధర్మచక్రమా! నీ ఆదేశం నువ్వే ఇవ్వాలి
బానిస పాలకుల తరమాలా? తలొంచాలా?
మన సార్వభౌమాధికారాన్ని ప్రకటించాలా?
దాన్ని వదిలేసి నిస్సిగ్గుగా నిలవాలా?

- ఉన్నం వెంకటేశ్వర్లు

మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్ : editpageps @ gmail.com

ఇక విద్యార్థి వీసాలకు నిర్దిష్ట కాలపరిమితి ?

- ట్రంప్ ప్రభుత్వ యోచన
- అమెరికాలో చదువుకై భారత విద్యార్థులకు తప్పని ఇబ్బందులు



వాషింగ్టన్ : నిర్దిష్ట కాలపరిమితి లేకుండా అపరిమితంగా అమెరికాలో వుండేందుకు విదేశీ విద్యార్థులను అనుమతిస్తున్న "డ్యూరేషన్ ఆఫ్ స్టేటస్" చట్టాన్ని మార్చాలని ట్రంప్ ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకు గానూ నిర్దిష్ట కాలపరిమితితో ఎఫ్-1, జె-1 వీసాలను అమలు చేయాలని యోచిస్తోంది.

అమెరికాలో చదువుకునే విదేశీ విద్యార్థులు ప్రస్తుతం తమ కోర్సులో రిజిస్టర్ అయి వున్నంతవరకు ఎంత కాలమైనా అక్కడ వుండొచ్చు. అయితే ట్రంప్ ప్రభుత్వం కొత్తగా తీసుకురావాలని ప్రతిపాదించిన నిబంధన ప్రకారం కచ్చితమైన కాలపరిమితి వుంటుంది. విద్యార్థులు వారు చదువుకునే కోర్సు కాలపరిమితితో సంబంధం వుండదు. దీనివల్ల కొంతమంది విద్యార్థులు తమ చదువు మధ్యలోనే తమ వీసాలను మళ్లీ పునరుద్ధరించుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడతాయి.

వైట్‌హౌస్ సమీక్షించిన తర్వాతనే ఈ ప్రతిపాదనను హోం ల్యాండ్ భద్రతా విభాగం ఆమోదించింది. ఇది అమల్లోకి రావడానికి ముందుగా దీనిపై ప్రజలు తమ అభిప్రాయాలు తెలియచేసేందుకు వీలుగా పెడతారు.

2024లో దాదాపు 4,20,000మంది విద్యార్థులు ఎన్‌రోల్ చేసుకున్నారు. అమెరికా యూనివర్శిటీల్లో చదివే విదేశీ విద్యార్థుల్లో భారత విద్యార్థులే మెజారిటీ భాగం వుంటారు. లాంగ్ టర్మ్ రీసెర్చ్, మాస్టర్స్ డిగ్రీ, డాక్టోరల్ డిగ్రీలతో పాటూ పలు ఏళ్లపాటు సాగే కార్యక్రమాలను చాలామంది కోరుకుంటారు. అయితే ఇప్పుడు నిర్దిష్ట కాలపరిమితి నిబంధన విధిస్తే సెమిస్టర్ మధ్యలోనే వీసాల గడువు పూర్తయి, డెడ్‌లైన్‌లతో ఇబ్బందులు తలెత్తవచ్చునని భావిస్తున్నారు.

ట్రంప్ 2020 ప్రతిపాదనల ప్రకారం, విద్యార్థి వీసాలు ఆ విద్యార్థి ఏ ప్రాంతానికి చెందినవాడన్న ప్రాతిపదికన కేవలం రెండేళ్ళు లేదా నాలుగేళ్ళు మాత్రమే చెల్లుబాటు అవుతాయి. పైగా, అమెరికాలో ఎక్కువ కాలం వుండాలనుకునే విద్యార్థులు పొడిగింపు కావాలనుకుంటే ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకోవాల్సి వుంటుంది.

కొత్త ప్రతిపాదనతో భారత విద్యార్థులపై ప్రభావం

వర్క్ వీసా కోరడంతో పాటూ నాలుగేళ్ళలో గ్రాడ్యుయేషన్ చేసేవారు ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రెయినింగ్ (ఒపిటి)లో పాల్గొనేందుకు గానూ తమ స్టేటస్ పొడిగింపు కోసం దరఖాస్తును పెట్టుకోవాల్సి వుంటుంది. పాలనాపరమైన పొరపాట్లకు గల అవకాశాలతో పాటూ ఈ మొత్తం ప్రక్రియ అత్యంత శ్రమతో కూడినదిగా వుండొచ్చునని బ్లూమ్‌బెర్గ్ పేర్కొంది. పైగా అదనంగా చట్టపరంగా, ప్రభుత్వ పరంగా వ్యయాలు కూడా అవుతాయని తెలిపింది. ఇలా నిర్దిష్ట కాలపరిమితులవల్ల దీర్ఘకాలం పాటు రీసెర్చ్ చేసేవారికి ముఖ్యంగా స్టెమ్ ప్రోగ్రామ్స్‌లో పాల్గొనేవారికి ఇబ్బందులు తప్పవు. యూనివర్శిటీలు, ప్రోగ్రామ్ స్పాన్సర్లు ఇందుకు అనుగుణంగా తమ మార్గదర్శకాలు సవరించుకోవాల్సిన అవసరం వుంది.

తగ్గిన విదేశీ విద్యార్థులు

ప్రయాణాలపై అనేక నిషేధాలు, నాన్ ఇమ్మిగ్రెంట్ వీసా కాలపరిమితి విషయంలో 26 దేశాలకు సవరణలు, వీసా ఇంటర్వ్యూలపై దాదాపు నెల రోజులుగా విదేశాంగ శాఖ సస్పెన్షన్ కారణంగా కొత్తగావిదేశీ విద్యార్థులు ఎన్‌రోల్ చేసుకోవడం దాదాపు 30నుండి 40శాతం తగ్గిపోయిందని సెవిస్ విశ్లేషణలో, విదేశాంగ శాఖ డేటాలో వెల్లడైంది.

బిటెక్ బెంగ..!

- పూర్తికాని రెండో విడత ఇంజినీరింగ్ సీట్ల కౌన్సెలింగ్
- కౌన్సెలింగ్ పూర్తి కాకుండానే ఫీజు కట్టాలని కాలేజీల ఒత్తిడి
- మేనేజ్‌మెంట్ కోటా విద్యార్థులకు తరగతులు ప్రారంభం.. కౌన్సెలింగ్ విద్యార్థులు ఇంటికే పరిమితం
- విద్యార్థుల గురించి ప్రభుత్వానికి పట్టడం లేదని లేదని విమర్శలు వెల్లువ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఇంటర్ పూర్తి చేసి బిటెక్ ఇంజినీరింగ్ కోర్సులో చేరే విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఈ నెల నాలుగో తేదీన పూర్తి కావాల్సిన రెండో విడత కౌన్సెలింగ్ వివిధ కారణాలతో నిలిచిపోవడంతో విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడింది. సమస్యను పరిష్కరించి విద్యార్థులకు కౌన్సెలింగ్ పూర్తి చేయాల్సిన ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందనే విమర్శలు విన్పిస్తున్నాయి. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 14 ఇంజినీరింగ్ కాలేజీలు ఉన్నాయి. వీటిలో 12,900 వరకూ సీట్లు ఉన్నాయి. మేనేజ్‌మెంట్ కోటా 3,870 సీట్లు పోను మిగిలినవి ఎపిఇఎపిసెట్ (ఎంసెట్) పరీక్షల్లో వచ్చే ర్యాంకుల ఆధారంగా భర్తీ చేస్తారు. జులై ఏడో తేదీన మొదటి విడత కౌన్సెలింగ్ ప్రారంభమై 19వ తేదీతో ముగిసింది. 23న సీట్ల కేటాయింపు జరిగింది. జులై 28వ తేదీ వరకూ రిపోర్టింగ్‌కు అవకాశం ఇచ్చారు. తర్వాత 30వ తేదీ నుంచి రెండో విడత కౌన్సెలింగ్‌కు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. తాము కోరుకున్న సీటు రాక, తమకు నచ్చిన కాలేజీ కోసం వేలాది మంది విద్యార్థులు రెండో విడత కౌన్సెలింగ్‌లో పాల్గొని ఆప్షన్లు పెట్టుకున్నారు. ఆగస్టు నాలుగో తేదీన సీట్ల కేటాయింపు ఉంటుందని ప్రభుత్వం చెప్పింది. స్థానికతపై కొంతమంది విద్యార్థులు కోర్టును ఆశ్రయించడంతో రెండో విడత కౌన్సెలింగ్ సీట్ల కేటాయింపు నిలిచిపోయింది. దీంతో విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఉమ్మడి జిల్లాలో 14 ఇంజినీరింగ్ కాలేజీలు ఉండగా, ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కాలేజీలో 1,248, సిఆర్‌ఆర్ కాలేజీలో 912, స్వర్ణాంధ్రలో 1200, విష్ణు కాలేజీలో 864, శశిలో 840, వాసవి కాలేజీలో 768, డిఎన్ఆర్‌లో 552 మొత్తం 12,900 సీట్లు వరకూ ఉన్నాయి. రెండో విడత కౌన్సెలింగ్‌లో పాల్గొన్న విద్యార్థులు 70 శాతానికిపైగా ఉన్నారు. కౌన్సెలింగ్ నిలిచిపోవడంతో విద్యార్థులకు ఏం చేయాలో తెలియని పరిస్థితి నెలకొంది.

కాలేజీల నుంచి తీవ్ర ఒత్తిడి..

నిబంధనల ప్రకారం రెండో విడత కౌన్సెలింగ్‌లో ఆప్షన్ పెట్టుకున్న విద్యార్థులు సీట్ల కేటాయింపు జరిగిన తర్వాత కాలేజీల్లో చేరాల్సి ఉంది. కౌన్సెలింగ్‌లో వేరే కాలేజీ పెట్టుకున్నప్పటికీ మొదటివిడతలో సీటు వచ్చిన విద్యార్థులపై ఆయా కళాశాలలు ఒత్తిడి చేస్తున్నాయి. క్లాసులు ప్రారంభిస్తున్నామని, ఫీజులు కట్టాలని చెబుతున్నాయి. కాలేజీ డెవలప్‌మెంట్ ఫీజు, ప్లేస్‌మెంట్ ట్రైనింగ్, ఇతర ఫీజుల కింద ప్రతి కాలేజీ రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకూ వసూలు చేస్తున్నాయి. ఈ సొమ్ము వెంటనే కట్టాలని చెబుతున్నాయి. డేస్కాలర్ విద్యార్థులకైతే బస్సు ఫీజు చెల్లించకపోతే మీకు అవకాశం ఉండదని బెదిరిస్తున్న పరిస్థితి ఉంది. తీరా ఈ కాలేజీలో ఫీజు చెల్లించాక వేరే కాలేజీలో సీటు వస్తే పరిస్థితి ఏమిటనే ప్రశ్నకు మాత్రం సమాధానం ఇవ్వడం లేదు. నాలుగో తేదీ నుంచి తరగతులు ప్రారంభమయ్యాయని, రెండో విడత కౌన్సెలింగ్ ఇప్పట్లో తేలుతుందో. లేదో తెలియదని, సీటు వచ్చిన కాలేజీలో చేరిపోవాలని ఒత్తిడి చేయడంతో విద్యార్థులకు ఏం చేయాలో అర్థం కావడం లేదు. కొన్ని కాలేజీలైతే ప్రభుత్వం ఇచ్చే ఫీజు రీయంబర్స్‌మెంట్ సొమ్మును సైతం నాలుగు విడతలుగా కాలేజీలకు విద్యార్థులే చెల్లించాలనే నిబంధన పెడుతున్న పరిస్థితి ఉంది. మేనేజ్‌మెంట్ కోటాలో సీటుకు ఈ ఏడాది కాలేజీని బట్టి రూ.ఐదు లక్షల నుంచి రూ.ఏడు లక్షల వరకూ వసూలు చేసిన పరిస్థితి ఉంది. ఇప్పుడు కౌన్సెలింగ్ ఆలస్యం నేపథ్యంలో విద్యార్థులను ప్రలోభపెట్టి ఫీజులు వసూలు చేయాలని చూస్తున్నారు. విద్యార్థులను ఇంటి వద్ద ఉంచలేక తల్లిదండ్రులు కొంతమంది ఫీజులు కట్టేస్తున్న పరిస్థితి ఉంది. ప్రభుత్వం వెంటనే ఇంజినీరింగ్ రెండో విడత కౌన్సెలింగ్ పూర్తి చేయాలని విద్యార్థులు కోరుతున్నారు.

అక్టోబర్ 7న పైడితల్లి అమ్మవారి సిరిమానోత్సవం

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

ఉత్తరాంధ్రుల కల్పవల్లి పైడితల్లి అమ్మవారి సిరిమానోత్సవం తేదీలను దేవాదాయశాఖ ఖరారుచేసింది. ఈ మేరకు వివరాలను ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శిరీష, సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు బుధవారం మీడియాకు వెల్లడించారు. అక్టోబరు 6న అమ్మవారి తొలేళ్ల ఉత్సవం, 7న సిరిమానోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు ప్రకటించారు. 14న తెప్పోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. 19న కలశజ్యోతి ఊరేగింపు, 21న ఉయ్యాల కంబాల ఉత్సవం నిర్వహిస్తామన్నారు. 22న జరిగే చండీ హోమం, పూర్ణాహుతితో ఉత్సవాలు ముగుస్తాయని తెలిపారు.

ఎల్‌జి పాలిమర్స్ నిరసనకారులపై కేసులు ఎత్తివేత

ప్రజాశక్తి-గోపాలపట్నం (విశాఖ)

ఎల్‌జి పాలీమర్స్ విషవాయువులు విడుదల సమయంలో పెద్ద ఎత్తున ప్రాణనష్టం జరిగింది. ఈ నేపథ్యంలో వెంకటాపురం గ్రామానికి చెందిన 32 మంది యువకులు కంపెనీ యాజమాన్యం తీరుపై నిరసన వ్యక్తం చేయగా, వారిపై కేసు నమోదైంది. దీంతో నాలుగేళ్లుగా ప్రభుత్వం ఉద్యోగాలకు దరఖాస్తులు చేసుకోలేక, అలాగే విదేశాలకు వెళ్లలేక ఉపాధిని కోల్పోయారు. స్థానిక ఎమ్మెల్యే గణబాబు చొరవతో ప్రభుత్వం వీరిపై ఉన్న కేసులను ఇటీవలే ఎత్తివేసింది. బుధవారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గణబాబును కలిసి కృతజ్ఞతలు తెలిపారు. తమపై ఉన్న కేసులు ఎత్తివేయడంతో భవిష్యత్తుపై ఆశ చిగురించిందని ఆశభావం వ్యక్తంచేశారు.

ఫ్లోరెన్స్ నైటింగేల్‌కు నివాళి



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్ నేషనల్ హెల్త్ మిషన్ కాంట్రాక్టు స్టాఫ్ నర్సెస్ ఫెడరేషన్ రాష్ట్ర సమావేశం సందర్భంగా విశ్వ విఖ్యాత వైద్య సేవా సామాజిక కార్యకర్త ఫ్లోరెన్స్ నైటింగేల్‌కు సమాఖ్య నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా పౌర వైద్య సేవల రంగంలో ఆమె చేసిన సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎవి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ స్టేట్ ఫస్ట్ ర్యాంకర్‌కు గవర్నర్ ఆహ్వానం

ప్రజాశక్తి - కాకినాడ

ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో 600 మార్కులు సాధించిన స్టేట్ ఫస్ట్ ర్యాంకర్ యాళ్ల నేహాంజనికి గవర్నర్ కార్యాలయం నుంచి ఆహ్వానం అందింది. రాష్ట్ర గవర్నర్ కార్యాలయం నుంచి ఎట్ హోం కార్యక్రమానికి ప్రత్యేక ఆహ్వాన పత్రం అందుకున్న యాళ్ళ నేహాంజని విశేష గౌరవం పొందింది. రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ ఆతిథ్యంతో ఆగస్టు 15న సాయంత్రం 5 గంటలకు విజయవాడ రాజ్ భవన్‌లో జరగనున్న ఈ ప్రత్యేక కార్యక్రమానికి స్టూడెంట్ టాపర్స్ విభాగంలో నేహాంజనిని ఆహ్వానించారు. ఈ సందర్భంగా జిల్లా అధికారుల ఆధ్వర్యంలో ఆమెకు సన్మానం నిర్వహించగా నేహాంజని తన విద్యలో సాధించిన విజయాన్ని గుర్తిస్తూ ప్రశంసలు అందించారు.

అదే పేరు...అదే ఫొటో !

- ఓటరుగా ఆరు చోట్ల ఎంట్రీ

న్యూఢిల్లీ : ఓటర్ల జాబితాలో చోటుచేసుకున్న అవకతవకలకు తెలుగు టీవీ సీరియల్ మాదిరిగా ముగింపు అంటూ కన్పించడం లేదు. తాజాగా మహారాష్ట్ర ఓటర్ల జాబితాలో మరో సిత్రం కన్పించింది. ముంబయి నగర శివారులోని నాలాసోపర ప్రాంతంలో నివసిస్తున్న ఓ మహిళ పేరు ఓటరు జాబితాలో ఏకంగా ఆరు చోట్ల దర్శనమిచ్చింది. వ్యక్తి ఒకరే అయినప్పటికీ ఒక్కో చోట ఒక్కో ఓటరు ఫొటో గుర్తింపు కార్డు (ఎపిక్) నెంబరు ఉంది. అంటే ఆమె పేరిట ఆరు ఎపిక్ కార్డులు జారీ అయ్యాయన్న మాట. బెంగళూరులోని మహదేవ్‌పురా శాసనసభ స్థానంలో ఓటర్ల జాబితాలో పలు అవకతవకలు చోటుచేసుకున్నాయంటూ కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆరోపణలు చేసిన నేపథ్యంలో సుష్మా గుప్తా ఉదంతం వెలుగులోకి వచ్చింది. కేంద్ర ఎన్నికల సంఘం బీహార్‌లో చేపట్టిన ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)పై పెద్ద ఎత్తున దుమారం రేగుతున్న విషయం తెలిసిందే.

హైడ్రో పవర్ ప్రాజెక్ట్ ఒప్పందాలు రద్దు చేయాలి

- ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేంద్ర

ప్రజాశక్తి- పెదబయలు (అల్లూరి జిల్లా)

జిఒ నెంబర్ 3కు చట్టబద్ధత, ఏజెన్సీ స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్‌పై ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికలకు ముందు అరకు బహిరంగ సభలో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని ఎపి ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర డిమాండ్ చేశారు. వీటితో పాటు హైడ్రో పవర్ ప్రాజెక్ట్ ఒప్పందాలు రద్దు చేసిన తర్వాతే టిడిపి కూటమి నాయకులు సూపర్ సిక్స్ సూపర్ హిట్ సంబరాలు చేసుకోవాలన్నారు. పెదబయలులో బుధవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఈనెల 9న పాడేరులో జరిగిన ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి ప్రధానమైన ఏజెన్సీ స్పెషల్ డీఎస్సీ, జివో నంబర్ 3 చట్టబద్ధత, హైడ్రో పవర్ ప్రాజెక్ట్ ఒప్పందాలు రద్దు వంటి వాటిపై ఎటువంటి ప్రకటన చేయకపోవడం దారుణమన్నారు. ఏజెన్సీలో పండే కాఫీ పంటకు మాత్రం టాటా తదితర బడా కంపెనీలకు తలుపులు తెరిచి ఆదివాసీ రైతులను నట్టేట ముంచే ప్రకటన చేశారని పేర్కొన్నారు. ఏజెన్సీ ఆర్గానిక్ కాఫీ పంటను టాటా, నాంది తదితర బడా సంస్థలకు అప్పగించే ప్రయత్నాన్ని విరమించాలని, కాఫీ రైతులకు బకాయి డబ్బులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీలో హోం స్టే టూరిజం అమలు చేస్తే ఆదివాసీ సంస్కృతి నాశనమవుతుందని, 1/70 చట్టం ఉల్లంఘనకు గురవుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం ఆదివాసీ వ్యతిరేక విధానాలను విరమించుకోవాలని కోరారు.

అంతర్ రాష్ట్ర వాహనాల దొంగ అరెస్టు

ప్రజాశక్తి-పెనుకొండ (సత్యసాయి)

అంతరాష్ట్ర ద్విచక్ర వాహనాల దొంగను అరెస్ట్ చేసి 31 మోటార్ సైకిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు పెనుకొండ డిఎస్‌పి నరసింహగప్ప తెలిపారు. పెనుకొండ మండలం మునిమడుగు గ్రామానికి చెందిన ఓటన్నగారి వినోద్ కుమార్ మంగళవారం మండల పరిధిలోని దుద్దేబండ క్లాస్ వద్ద పోలీసులు వాహనా తనిఖీలు చేపడుతున్న సమయంలో తాను దొంగలించిన మోటారు సైకిల్‌పై రావడంతో పోలీసులు గుర్తించి అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు.

ఉపాధి...వైద్యం

పి4 వినతుల్లో అధికభాగం ఇవే!

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

పేదరిక నిర్మూలన పేరిట రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పి4 కార్యక్రమంలో ప్రజల నుండి అత్యధికంగా ఉపాధి, వైద్యం కోసం వినతులు అందాయి. ఈ కార్యక్రమంలో భాగంగా బంగారుకుటుంబాలుగా వ్యవహరించే లబ్ధిదారుల నుండి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యతలు స్వీకరించిన విషయం తెలిసిందే. పేదలకు సాయం అందించడానికి ముందుకొచ్చే మార్గదర్శులకు ఈ ప్రాధాన్యతలను అందించి వాటిని తీర్చాలని కోరుతున్నారు.

31 శాతం బంగారుకుటుంబాలు తొలి ప్రాధాన్యత కింద ఉపాధి కల్పించాలని కోరగా, 25 శాతం కుటుంబాలు వైద్య సాయాన్ని తొలి ప్రాధాన్యతగా గుర్తించాయి. చిన్న వ్యాపారాలను విస్తరణ చేసుకోవడానికి తొమ్మిది శాతం, వ్యవసాయ ఆదాయాన్ని పెంచేందుకు ఏడు శాతం కుటుంబాలు తొలి ప్రాధాన్యతగా కోరుకున్నాయని, ఇతర అంశాలను మరో 27 శాతం కుటుంబాలు ప్రస్తావించాయని సమాచారం.

రెండో ప్రాధాన్యతలోనూ వైద్యానికే

రెండో ప్రాధాన్యతలోనూ 22శాతం బంగారు కుటుంబాలు వైద్యసేవను ఎంపిక చేసుకున్నాయి. చిన్న వ్యాపారాల విస్తరణకు 15 శాతం, వ్యాపారానికి రుణాలు కావాలని 11 శాతం కుటుంబాలు కోరుకున్నారు. ఇక వ్యవసాయ ఆదాయం పెంపు, ఉత్తమ ఉపాధి, ఉన్నత విద్య, నైపుణ్యాభివృద్ధి వంటి రంగాల్లో సాయాన్ని మరికొన్ని కుటుంబాలు విన్నవించుకున్నట్లు తెలిసింది.

అన్నీ ఆర్థికాంశాలే...

బంగారు కుటుంబాల నుండి అందిన ప్రాధాన్యతలన్నీ ఆర్థిక అంశాలతో కూడుకున్నవి కావడం అధికారవర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. వీటిని తీర్చాలంటే భారీ మొత్తంలో ఖర్చు అవుతుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఇలా కోరుకున్నారు

తొలి ప్రాధాన్యత		ద్వితీయ ప్రాధాన్యత	
	శాతం		శాతం
ఉత్తమ ఉపాధి	31	వైద్యం కోసం	22
వైద్య చికిత్సకు	25	వ్యాపార విస్తరణ	15
చిన్న వ్యాపారాలకు	9	వ్యాపార రుణాలకు	11
వ్యవసాయ ఆదాయం	7	వ్యవసాయ ఆదాయం	9
ఇతర అవసరాలకు	27	ఉన్నత విద్య ఇతరాలకు	35

విజయవాడ నెహ్రూ బస్‌స్టేషన్ వేదికగా
నేడు 'స్త్రీ శక్తి' పథకం ప్రారంభం

● ముఖ్యమంత్రి పర్యటనకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

ప్రజాశక్తి-విజయవాడ

ఆర్‌టిసి బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించేలా స్త్రీ శక్తి పథకాన్ని శుక్రవారం సాయంత్రం విజయవాడ పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్ సిటీ టెర్మినల్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభించనున్నారు. కార్యక్రమ ఏర్పాట్లను బుధవారం ఎన్‌టిఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులతో జరిపిన సమీక్షలో ముఖ్యమంత్రి ప్రాంగణానికి వచ్చే ఏరియాలో ఏ విధమైన ట్రాఫిక్ ఉండకుండా చర్యలు తీసుకోవాలని ట్రాఫిక్ పోలీసులకు సూచిస్తూ, వారు తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. సాధారణ ప్రజలకు ఏ విధమైన అడ్డంకులు [illegible] చంద్రబాబు ఆకాంక్ష మేరకు చర్యలు చేపట్టాలని ఆర్‌టిసి అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యంగా అందరు మహిళలే వస్తున్నందున్న అందుకు తగ్గ ఏర్పాట్లు చేయాలని మున్సిపల్ శానిటేషన్ అధికారులకు సూచించారు. సమీక్ష అనంతరం వేదిక వద్ద చేస్తున్న ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు తగు సూచనలు చేశారు. ముఖ్యమంత్రి ప్రారంభించే బస్సులు ఉంచే ప్రదేశాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిసిపి సరిత, డిసిపి (ఐఎస్ డబ్ల్యూ) ఎస్‌విడి ప్రసాద్, ఆర్‌టిసి రీజనల్ మేనేజర్ ఎమ్.వై. దానం తదితరులు పాల్గొన్నారు.

బలవంతపు భూసేకరణ దుర్మార్గం : సిపిఎం

ప్రజాశక్తి -పద్మనాభం (విశాఖ)

ఎంఎస్ఎంఇ పార్కుల ఏర్పాటు కోసమని ప్రజాభిప్రాయానికి వ్యతిరేకంగా రైతుల నుంచి బలవంతంగా భూసేకరణ చట్టవిరుద్ధమని జివిఎంసి సిపిఎం కౌన్సిలర్ బి.గంగారావు మండిపడ్డారు. బుధవారం మండలంలోని కృష్ణాపురంలో సర్వే నెంబర్లు 88, 93లో 66 ఎకరాల భూమిని దౌర్జన్యంగా గుంజుకోవడంతో పాటు రెండుదొబ్బలుగా ఆయా భూముల్లోని తోటలను జెసిబి, ప్రొక్లెయినర్లతో రెవెన్యూ, ఎపిఐఐసి అధికారులు కూల్చేస్తున్నారన్న సమాచారంతో ఆయా భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా గంగారావు మాట్లాడుతూ.. దళిత, బలహీన వర్గాల పేద రైతులు 50 ఏళ్లుగా నుండి టేకు, నీలగిరి, జీడి తోటలు వేసుకొని జీవనం సాగిస్తున్న భూముల్లో గ్రామసభ తీర్మానం, ప్రజాభిప్రాయ సేకరణ, పర్యావరణ అనుమతులు వంటి ప్రక్రియలేవీ చేపట్ట కుండా సెజ్ పనులు ప్రారంభించడం దుర్మార్గం అన్నారు.

కొత్త మార్కెట్లకు వెళ్లండి

● ట్రంప్ సుంకాల ప్రభావం ఎదుర్కొనేందుకు ఇదే మార్గం
● ఆక్వాపై సమావేశంలో మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

భారత రొయ్య ఎగుమతులపై అమెరికా 50 శాతం టారిఫ్ విధించిన నేపథ్యంలో కొత్త మార్కెట్లను అన్వేషించాలని రాష్ట్ర వ్యవసాయ, అనుబంధ శాఖల మంత్రి కె అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. బుధవారం సచివాలయంలో రాష్ట్ర ఆక్వాకల్చర్ అభివృద్ధి సంస్థ ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశం మంత్రి అధ్యక్షతన జరిగింది. రాష్ట్రంలోని మత్స్య సంపద, ఉత్పత్తి నాణ్యత, ఎగుమతి అవకాశాలు, రైతుల ఆదాయాన్ని పెంచే విధానాలపై చర్చించారు. ఎంపెడా సహకారంతో దక్షిణ కొరియా, యూరప్, యూకే, మిడిల్ ఈస్ట్, రష్యా, ఆఫ్రికా వంటి కొత్త మార్కెట్లకు ప్రయత్నించాలని మంత్రి అన్నారు... యూకేతో కుదిరిన ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్ అవకాశాలను వినియోగించుకోవాలి. ఎగుమతిదారులు, ప్రాసెసర్లు విలువ ఆధారిత ఉత్పత్తులపై దష్టి పెట్టాలి. ఆక్వా రైతులకు మేలు జరిగేలా అధిక సుంకాల వ్యవహారంపై సిఎం చంద్రబాబు కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రాన్ ప్రొడ్యూసర్స్ కోఆర్డినేషన్ కమిటీని కంపెనీ చట్టం కింద ఏర్పాటు చేయాలి. ప్రభుత్వ పథకాలు పొందడానికి ప్రతి అక్వా రైతు తమ చెరువులను తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. పర్యావరణం, ప్రజారోగ్యం ప్రభుత్వ ప్రథమ కర్తవ్యం. కొన్ని ప్రాంతాల్లో పౌల్ట్రీ వ్యర్థాలను చేపల ఆహారంగా వాడుతున్నట్లు గుర్తించాం. రైతులు వెంటనే నిలిపేయాలి. లేకపోతే వారి లైసెన్స్‌లను రద్దు చేసి, క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం. ఆక్వా చెరువులను ఆన్‌లైన్‌లో సులభంగా నమోదు చేసుకునేలా సరళీకరించాం. రాష్ట్రంలో మారికల్చర్, రిజర్వాయర్ కేజ్ కల్చర్ విధానాలకు కమిటీ ఆమోదం తెలిపింది. ఈ సమావేశంలో కో-వైస్ చైర్మన్ ఆనం వెంకట రమణా రెడ్డి, మత్స్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి రాజశేఖర్, కమిషనర్ రామ శంకర్ నాయిక్, పాల్గొన్నారు. అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న భారీవర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి టెలికాన్ఫరెన్స్‌లో వ్యవసాయశాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు.

ప్రైవేటు, అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో
మిగులు సీట్లకు దరఖాస్తు చేసుకోవాలి

ప్రజాశక్తి-అనకాపల్లి

విద్యాహక్కు చట్టం ప్రకారం 202- 26 విద్యా సంవత్సరానికి ప్రైవేటు, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో మిగులు సీట్లు ఒకటవ తరగతిలో ప్రవేశానికి విద్యాశాఖ వెబ్సైట్లో నమోదు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి గిడ్డి అప్పారావు నాయుడు, జిల్లా సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ డాక్టర్ ఆర్. జయ ప్రకాష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొంటున్న వారు, ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీలు, ఓసి గ్రామీణ ప్రాంతాలకు చెందిన ఏడాదికి రూ.1,20,000 పట్టణంలో రూ.1,44,000 ఆదాయం లోబడి ఉన్న కుటుంబాలకు చెందిన విద్యార్థులు ఈనెల 12 నుంచి 20వ తేదీ వరకు తమ వివరాలను విద్యాశాఖ వెబ్సైట్ https://cse.ap.gov.in నమోదు చేసుకోవాలని కోరారు. సీబీఎస్ఈ, ఐసిఎస్ఈ, ఐబి సిలబస్ ఉన్న పాఠశాలల్లో ప్రవేశానికి 2019 ఏప్రిల్ 2 నుంచి 2020 మార్చి 31 లోపు జన్మించి ఉండాలని, స్టేట్ సిలబస్ పాఠశాలల్లో ప్రవేశానికి 2019 జూన్ 2 నుండి 2020 మే 31 లోపు జన్మించి ఉండాలని పేర్కొన్నారు. అనాధ, హెచ్ఐవి ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొంటున్న వారికి ఐదు శాతం, ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు 4 శాతం, బీసీలకు, ఇతరులకు 6 శాతం మొత్తం 25 శాతం సీట్లు లభిస్తాయని తెలిపారు. ప్రస్తుత చిరునామా ధ్రువీకరణ కోసం తల్లిదండ్రుల రేషన్ కార్డు ఆధార్ కార్డు, ఓటర్ కార్డు, భూమి హక్కుపత్రం, ఉపాధి హామీ జాబ్ కార్డు, పాస్పోర్టు, విద్యుత్తు బిల్లు, రెంట్ అగ్రిమెంట్ కాపీ, డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు ధ్రువీకరణ పత్రాలను దరఖాస్తుకు జతపరచాలన్నారు. సచివాలయాల డేటా ఆధారంగా ఈనెల 12 నుంచి 20 వరకు ప్రవేశానికి అర్హతలు రాష్ట్ర పథక సంచాలకులు నిర్ణయిస్తారని పేర్కొన్నారు. లాటరీ ద్వారా మొదటి విడత ఫలితాలను ఈనెల 25న విడుదల చేస్తారని, సీట్లు పొందిన విద్యార్థుల నిర్ధారణ ఈనెల 31న ప్రకటించడం జరుగుతుందని తెలిపారు. పూర్తి సమాచారం కోసం 18004258599 టోల్ ఫ్రీ నెంబర్ కు సంప్రదించాలన్నారు.

మన్యంలో భర్తీకాని సచివాలయ ఉద్యోగాలు

ప్రజాశక్తి-సీతంపేట (పార్వతీపురం మన్యం జిల్లా)

పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట మండలంలో సుమారు 50 వేల మంది జనాభా. 53 పంచాయతీలు ఉంటే, 31 సచివాలయాలు ఉన్నాయి. వీటిలో గోయిది, చిన్నబగ్గ, హడ్డుబంగి, కిసరజోడు, కిల్లాడ, కుడ్డపల్లి, మండ, మర్రిపాడు, పులిపుట్టి, పూతికవలస, వజ్జాయిగూడ.. ఇలా 13 సచివాలయాల్లో డిజిటల్ అసిస్టెంట్లు లేరు. దీంతో ఆయా సచివాలయాల్లో పనులు జాప్యమవుతున్నాయి. దీంతో ఉన్న సిబ్బందిపై పని ఒత్తిడి పెరిగి దేనికీ న్యాయం చేయలేని పరిస్థితి నెలకొంది. దీనివల్ల ధ్రువపత్రాలు, మిగతా సేవలు సరిగా అందక విద్యార్థులు, గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

పెరిగిన పనిభారం

సచివాలయంలో ఎంతో కీలకమైనది డిజిటల్ అసిస్టెంట్ పోస్టు. విద్యార్థుల ధ్రువపత్రాలు, సంక్షేమ పథకాలు అప్లోడ్ చేయడం, రైతుల అడంగల్, పెన్షన్, రేషన్ కార్డులు ప్రతి పనీ డిజిటల్ అసిస్టెంట్ ద్వారానే జరగాలి. క్షణం తీరిక లేని డిజిటల్ అసిస్టెంట్లు పోస్టులు 13 ఖాళీగా ఉండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అంతేకాకుండా డిజిటల్ అసిస్టెంట్లకు ప్రభుత్వం ప్రత్యేకమైన శిక్షణలో మెలకువలు నేర్పింది.

సచివాలయంలో మిగతా సిబ్బందితో వీరి పని చేయించినా అంత వేగంగా చేయలేని పరిస్థితి నెలకొంది. దీంతో వారిపై పనిభారం పెరిగి, ఒత్తిడి పడుతోంది. ఏదేమైనా అధికారులు పాలకులు స్పందించి, 13 డిజిటల్ అసిస్టెంట్లు పోస్టులు వెంటనే భర్తీ చేయాలని గిరిజనులు కోరుతున్నారు.

కార్యదర్శులది అదే దారి

మండలంలో ఐదుగురు కార్యదర్శుల కుర్చీలు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. ఇందులో పూబ్బాడ కార్యదర్శి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. వజ్జాయిగూడ, గులుమూరు, కుమ్మర గండి, కొండాడ కార్యదర్శి పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో ఆ సచివాలయాల పరిధిలో పంచాయతీల అభివృద్ధితో పాటు మిగతా పనులు కూడా ఆటంకం కలుగుతోంది.

ఎంపిడిఒ కార్యాలయంలోనూ..

సీతంపేట ఎంపిడిఒ కార్యాలయంలో కీలక పోస్టులు ఖాళీగా ఉండటంతో పని ముందుకు సాగడం లేదు.



ఒడిశాలో మోడీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న రైతులు, కార్మికులు



హర్యానాలో మోడీ, ట్రంప్ దిష్టిబొమ్మలను దగ్ధం చేస్తున్న దృశ్యం

మోడీ కార్పొరేట్ విధానాలపై దేశవ్యాప్త ఆగ్రహం

- మోడీ, ట్రంప్ దిష్టి బొమ్మలు దగ్ధం
- సిఇటిఎ కాపీల దహనం
- దేశవ్యాప్తంగా ఆందోళనల్లో లక్షలాది మంది రైతులు, కార్మికులు
- రైతుల రెట్టింపు ఆదాయం ఏదీ : ఎస్‌కెఎం నేతలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో


మోడీ ప్రభుత్వ కార్పొరేట్ విధానాలు, అమెరికా విధించిన 50 శాతం సుంకాలుపై దేశంలోని రైతాంగం, కార్మిక వర్గం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ విధానాలు, దేశంపై అమెరికా సుంకాల విధింపునకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఆందోళనలు చేశారు. ప్రధాని మోడీ, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ దిష్టిబొమ్మలను దగ్ధం చేశారు అలాగే ఇండియా-యుకె స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందం (సిఇటిఎ) కాపీలను దహనం చేశారు. బుధవారం దేశవ్యాప్తంగా సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) ఆధ్వర్యంలో "బహుళ జాతి కంపెనీలు క్విట్ ఇండియా - క్విట్ కార్పొరేట్ వ్యవసాయం" ఆందోళన జరిగింది. ఈ ఆందోళనలో పది కేంద్ర కార్మిక సంఘాలు, వ్యవసాయ కార్మిక సంఘాలతో పాటు వివిధ సంఘాలు మద్దతుగా పాల్గొన్నాయి. దేశంలో ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, పంజాబ్,



తమిళనాడులో మోడీ చిత్రపటాన్ని అగ్నికి ఆహుతి చేస్తున్న నిరసనకారులు

ఒరిస్సా, కర్ణాటక, త్రిపుర, జార్ఖండ్, హర్యానా, బీహార్, తెలంగాణ, తమిళనాడు, మహారాష్ట్ర, రాజస్థాన్, కేరళ, మధ్యప్రదేశ్, హిమాచల్‌ప్రదేశ్ తదితర రాష్ట్రాల్లో ఆందోళన జరిగింది. అనేక ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నప్పటికీ రైతులు, కార్మికులు రోడ్లపైకి వచ్చి తన నిరసనను తెలిపారు. ఉత్తరప్రదేశ్‌తో వంటి రాష్ట్రాల్లో దిష్టిబొమ్మలను దగ్ధం చేయకుండా పోలీసులు అడ్డుకున్నారు. నోయిడాలో జరిగిన ఆందోళనలో ఎఐఎడబ్ల్యుయు ప్రధాన కార్యదర్శి బి.వెంకట్, ఎఐకెఎస్ ఆర్థిక కార్యదర్శి కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు. మోడీ, ట్రంప్ దిష్టిబొమ్మలను దగ్ధం చేయకుండా అడ్డుకోవడంతో పోలీసులకు రైతు, కార్మిక నేతలకు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. అయినప్పటికీ మోడీ, ట్రంప్ దిష్టిబొమ్మలను దగ్ధం చేశారు. ఆందోళనల్లో పాల్గొన్న రైతులు, కార్మికులకు ఎస్‌కెఎం అభినందనలు తెలిపింది.

2022 నాటికి రైతుల ఆదాయాలను రెట్టింపు చేస్తామని 2017లో ప్రధానమంత్రి మోడీ హామీ ఇచ్చారని, కానీ కార్పొరేట్ అనుకూల విధానాలతో పెట్టుబడి ఖర్చులను రెట్టింపు చేసి వ్యవసాయ దుస్థితిని మరింత తీవ్రతరం చేశాయని విమర్శించారు. దేశంలో ప్రతిరోజూ 31 మంది రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నారని, గ్రామీణ కుటుంబాలు వలస వెళ్లాల్సి వస్తుందని అన్నారు. మొత్తం శ్రామిక ప్రజల హక్కులను కాపాడటానికి, దేశీయ ఆర్థిక వ్యవస్థను శక్తివంతమైన, పోటీతత్వంతో అభివృద్ధి చేయడానికి బదులుగా, మోడీ ప్రభుత్వం దేశంలోని సహజ, మానవ వనరులను దోచుకోవడానికి కార్పొరేట్ అనుకూల విధానాలకు కట్టుబడి ఉందని విమర్శించారు. దేశ ఆర్థిక వ్యవస్థను విదేశాలకు అప్పగించడానికి యుకె, ఈయు వంటి దేశాల ఒత్తిడికి మోడీ ప్రభుత్వం లొంగిపోయిందని విమర్శించారు. రైతులకు గిట్టుబాటు ధర, కార్మికులకు కనీస జీవన వేతనం, శ్రామిక ప్రజలను అప్పుల నుండి విముక్తి చేయడం, నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయడం, వ్యవసాయ భూమిని కార్పొరేట్ దోపిడీని అంతం చేయడం, తీవ్రమైన నిరుద్యోగాన్ని పరిష్కరించడం వంటి దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న డిమాండ్లను వెంటనే అంగీకరించాలని ఎస్‌కెఎం నేతలు డిమాండ్ చేశారు. ప్రధానమంత్రి కార్పొరేట్ అనుకూల విధానాలకు కట్టుబడి ఉండాలని నిర్ణయించుకుంటే, కార్మికులు, రైతులు ఐక్యతంగా దేశవ్యాప్తంగా దీర్ఘకాలిక, మిలిటెంట్ భారీ పోరాటాలు జరుగుతాయని ఎస్‌కెఎం నేతలు హెచ్చరించారు.



రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడుకు వినతిపత్రం అందచేస్తున్న రైతు సంఘాల నాయకులు

కార్పొరేట్ సంస్థల నుంచి వ్యవసాయాన్ని రక్షించాలి

- ట్రంప్ విధించిన 50 శాతం సుంకాలను ఎత్తేయాలి
- ట్రంప్ దిష్టిబొమ్మ దగ్ధం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కార్పొరేట్ సంస్థల నుంచి వ్యవసాయాన్ని రక్షించాలని, అమెరికా అధ్యక్షులు ట్రంప్ విధించిన 50 శాతం సుంకాలను వెంటనే ఉపసంహరించుకోవాలని రైతు, కార్మిక, వ్యవసాయ, ప్రజా సంఘాల ఐక్యవేదిక డిమాండ్ చేసింది. విజయవాడ ధర్నా చౌక్‌లో బుధవారం ఐక్యవేదిక ఆధ్వర్యాన ధర్నా జరిగింది. ఈ సందర్భంగా ట్రంప్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ కార్యక్రమానికి ఎపి రైతు సంఘం ఎన్‌టిఆర్ జిల్లా అధ్యక్షులు మల్నీడి యలమందరావు, ఎన్‌టిఆర్ జిల్లా రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పివి ఆంజనేయులు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎపి రైతు సంఘాల సమన్వయ సమితి కన్వీనరు వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ.. మూడోసారి అధికారం చేపట్టిన బిజెపి ప్రభుత్వం రద్దయిన మూడు నల్ల చట్టాల కన్నా రైతు ప్రయోజనాలను దెబ్బతీసే ప్రమాదకరమైన చట్టాలు ప్రకటించిందన్నారు. విదేశీ, స్వదేశీ బడా కంపెనీల ఎగుమతి, దిగుమతుల వ్యాపారుల ప్రయోజనాల కోసం జాతీయ వ్యవసాయ మార్కెట్ విధానం తీసుకొచ్చిందని ఆయన విమర్శించారు. ఈ విధానంతో భవిష్యత్తులో పంటలకు మద్దతు ధరలు ప్రకటించే విధానాలకు స్వస్తి పలుకుతారన్నారు. కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేసే పద్ధతిలో కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. అఖిలభారత కిసాన్‌సభ జాతీయ ప్రధాన కార్యదర్శి రావుల వెంకయ్య మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం సామ్రాజ్యవాద దేశాలతో చేసుకున్న అన్ని స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలపై పార్లమెంట్లో చర్చించాలని డిమాండ్ చేశారు. రష్యా నుంచి ముడి చమురును దిగుమతి చేసుకుంటున్నామనే కారణంతో ట్రంప్ 50 శాతం సుంకాలు విధించడం దుర్మార్గమన్నారు. రైతు సంఘం సీనియర్ నాయకులు వై కేశవరావు మాట్లాడుతూ.. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది బడ్జెట్‌లో ధరల స్థిరీకరణ నిధికి నిధులు తగ్గించిందని, ఎరువుల ధరలు ముఖ్యంగా కాంప్లెక్స్ ఎరువుల ధరలు పెరిగాయన్నారు. వ్యవసాయ పరికరాల సబ్సిడీకి కోత పెట్టిందన్నారు. ఎపి కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి జమలయ్య మాట్లాడుతూ.. మనకు ఇష్టం ఉన్నా.. లేకపోయినా పాడి, పాల ఉత్పత్తులు, దిగుమతి చేసుకోవాలని ఆంక్షలు పెట్టడం సరైందికాదన్నారు. ఈ ధర్నా కార్యక్రమంలో కాంగ్రెస్ కిసాన్ సెల్ ఛైర్మన్ కామన ప్రభాకర్‌రావు, అఖిల భారత కిసాన్ మహాసభ ప్రధాన కార్యదర్శి డి హరినాథ్, ఎపి రైతు సంఘం అధ్యక్షులు వి కృష్ణయ్య, ఎఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య, ఎఐకెఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎం వెంకటరెడ్డి, ఇఫ్టూ రాష్ట్ర అధ్యక్షులు పి ప్రసాద్, జాగృతి రైతు సంఘం ప్రధాన కార్యదర్శి మరీదు ప్రసాద్, కౌలు రైతు సంఘం రాష్ట్ర నాయకులు ఎం హరిబాబు, రైతు సంఘం నాయకులు సూర్యనారాయణ, పలువురు సిఐటియు, ఎఐటియుసి నాయకులు పాల్గొన్నారు

మంత్రి అచ్చెన్నాయుడుకు వినతి

ధర్నా అనంతరం రైతు సంఘాల నేతలు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును కలిసి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకొచ్చారు.

చొరబాటు యత్నం భగ్నం

ఒక సైనికుడు మృతి

శ్రీనగర్ : జమ్ముకాశ్మీర్‌లోని బారాముల్లా జిల్లాలో ఉరి వద్ద నియంత్రణ రేఖ సమీపంలో ఉగ్రవాదులుగా అనుమానిస్తున్న వ్యక్తులు దేశంలోకి చొరబాటుకు చేసిన యత్నాన్ని భారత్ సైన్యం తిప్పికొట్టింది. అయితే ఈ ప్రయత్నంలో ఒక భారత సైనికుడు మృతి చెందాడు. మృతి చెందిన సైనికుడ్ని చినార్ క్రాప్స్‌కు చెందిన హవిల్దర్ అంకిత్ కుమార్‌గా గుర్తించారు. బుధవారం ఉదయం ఈ ఘటన జరిగింది. కొందరు పాకిస్తానీ చొరబాటుదారులు భారత్‌లోకి ప్రవేశించడానికి యత్నించారు. భారత సైన్యం వారిని అడ్డుకుంటుండగా.. చొరబాటుదారులు కాల్పులు జరిపారు. చొరబాటుదారులు పారిపోయినట్లు అధికారులు తెలిపారు. తనిఖీలు కొనసాగుతున్నాయని చెప్పారు. కాగా, ఇదే ప్రాంతంలో రెండు రోజుల క్రితం ఇద్దరు ఉగ్రవాదులను భారత సైన్యం కాల్చిచంపింది.

సాక్షి టివి ప్రసారాల నిలిపివేతపై

రాష్ట్ర ప్రభుత్వానికి సుప్రీం నోటీసు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

సాక్షి టివి ప్రసారాల నిలిపివేత కేసులో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి సుప్రీంకోర్టు నోటీసులు ఇచ్చింది. ఏపి ఫైబర్ నెట్ సహా పలు ఎంఎస్‌వోలుకు నోటీసులు ఇచ్చింది. మూడు వారాల్లోగా సమాధానం చెప్పాలని సుప్రీంకోర్టు ఆదేశాల్లో పేర్కొంది. ఏపి ఫైబర్ నెట్, ఎంఎస్‌వోలు సాక్షి టివి ప్రసారాలను అక్రమంగా నిలిపివేయడంపై సుప్రీంకోర్టులో సాక్షిటివి యాజమాన్యం పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌ను బుధవారం సుప్రీం కోర్టు న్యాయమూర్తులు జస్టిస్ పిఎస్. నరసింహ, జస్టిస్ ఎ.ఎస్. చందూర్కర్‌లతో కూడిన ధర్మాసనం విచారించింది.

జార్ఖండ్‌లో ఎన్‌కౌంటర్

- మావోయిస్టు మృతి

రాంచీ : జార్ఖండ్‌లో బుధవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఒక మావోయిస్టు మృతి చెందాడు. మృతుడ్ని సిపిఐ(మావోయిస్టు) సభ్యుడిగా గుర్తించినట్లు అధికారులు తెలిపారు. బుధవారం తెల్లవారుజామున పశ్చిమ సింగ్‌భూమ్ జిల్లాలో భద్రతాదళాలు గాలింపు చేపడుతుండగా ఎన్‌కౌంటర్ జరిగిందని అన్నారు. మావోయిస్టులు, భద్రతా దళాల మధ్య జరిగిన కాల్పుల్లో మావోయిస్టు మరణించినట్లు కొల్హాన్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ మనోజ్ కౌశిక్ తెలిపారు. గాలింపు కొనసాగుతోందని అన్నారు.

రికార్డు స్థాయికి అమెరికా జాతీయ రుణం

వాషింగ్టన్ : అగ్ర రాజ్యమైన అమెరికా జాతీయ రుణం రికార్డు స్థాయిలో 37లక్షల కోట్ల డాలర్లకు చేరుకుంది. కరోనా మహమ్మారి ముందు అంచనాల కంటే చాలా త్వరగా జాతీయ రుణం ఈ కొత్త మైలురాయిని దాటింది. 2020 జనవరిలో కాంగ్రెస్ బడ్జెట్ కార్యాలయం వేసిన అంచనాల ప్రకారం 2030 ఆర్థిక సంవత్సరం నాటికి అమెరికా జాతీయ రుణం ఈ స్థాయికి చేరుకుంటుందని భావించారు. కానీ, కరోనా వల్ల అమెరికా ఆర్థిక వ్యవస్థ మూతపడడం, దానికి తోడు, దేశ ఆర్థిక వ్యవస్థను స్థిరీకరించేందుకు ట్రంప్, బైడెన్ ప్రభుత్వాలు భారీగా రుణాలు తీసుకోవడంతో జాతీయ రుణం ఊహించిన దానికన్నా చాలా త్వరగా పెరిగిపోయింది. ఐదేళ్లముందుగానే అంచనాలను దాటేసింది.

తమిళనాడు గవర్నర్ రవి నుంచి డాక్టరేట్ స్వీకరణకు నిరాకరించిన స్కాలర్

చెన్నై : తమిళనాడు గవర్నర్ ఆర్.ఎన్.రవి నుండి డాక్టరేట్‌ను తీసుకునేందుకు ఒక స్కాలర్ నిరాకరించారు. గవర్నర్ రవి తమిళనాడు రాష్ట్ర ప్రయోజనాలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని స్కాలర్ ఈ సందర్భంగా విమర్శించారు. ఈ సంఘటన వివరాల ప్రకారం.. మనోన్మణియం సుందరనార్ యూనివర్శిటీ 32వ స్నాతకోత్సవం బుధవారం జరిగింది. ఈ స్నాతకోత్సవానికి తమిళనాడు గవర్నర్ ఆర్.ఎన్.రవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులకు డాక్టరేట్లు అందచేశారు. విద్యార్థులంతా వరుసగా వచ్చి..వాటిని తీసుకున్నారు. అయితే జీన్ జోసెఫ్ అనే ఓ విద్యార్థిని మాత్రం గవర్నర్ పిలుస్తున్నా పట్టించుకోకుండా పక్కనే ఉన్న యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ చంద్రశేఖర్ నుంచి డిగ్రీని అందుకున్నారు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మరింది. మైక్రో ఫైనాన్స్‌లో డాక్టరేట్ పొందిన జీన్ జోసెఫ్ గవర్నర్‌కు బదులుగా యూనివర్శిటీ వైస్ చాన్సలర్ నుండి డాక్టరేట్‌ను అందుకోవడం సంచలనంగా మారింది. ఈ ఘటనపై ఆమె మీడియాతో మాట్లాడుతూ "గవర్నర్ ఆర్.ఎన్.రవి తమిళనాడు రాష్ట్రానికి, ప్రజలకు వ్యతిరేకం. ఆయన తమిళ ప్రజల కోసం ఏమీ చేయలేదు. అందుకే ఆయన చేతి నుండి డాక్టరేట్‌ను స్వీకరించాలనుకోలేదు" అని తెలిపారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. గవర్నర్ పొరపాటు జరిగిందని భావించి, ఆమెతో మాట్లాడేందుకు యత్నించగా.. అమె తిరస్కరించడం కనిపిస్తుంది.



విసి చంద్రశేఖర్ నుంచి పట్టా స్వీకరిస్తున్న స్కాలర్ జీన్ జోసెఫ్, చిత్రంలో నిశ్చేష్టులై చూస్తున గవర్నర్ రవి

'వీధి కుక్కలు'పై నేడు సుప్రీం విచారణ

న్యూఢిల్లీ : వీధి కుక్కల అంశానికి సంబంధించిన కేసును గురువారం ముగ్గురు జడ్జీలతో కూడిన ధర్మాసనం విచారించనుంది. దేశరాజధాని ప్రాంతం (ఎన్‌సిఆర్) నుంచి వీధి కుక్కలన్నింటినీ తొలగించాలంటూ ఈ నెల 11 ఇచ్చిన తీర్పుపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో బుధవారం ఈ నిర్ణయం తీసుకున్నారు. వీధికుక్కల పట్ల కరుణతో వ్యవహరించాలని సిజెఐ బిఆర్ గవాయికి ఒక న్యాయవాది చేసిన విజ్ఞప్తిని ఆయన పరిగణనలోకి తీసుకున్నారు. ఈ కేసును జాబితా చేయడానికి సిజెఐ అంగీకరించారు. ఈ నెల 11న జస్టిస్ పార్దివాలా, జస్టిస్ ఆర్. మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం.. 8 వారాల్లోపు అన్ని వీధి కుక్కలను షెల్టర్లకు తరలించాలని ఆదేశించిన సంగతి తెలిసిందే. ఢిల్లీ వీధుల్లో ఎక్కడా వీధి కుక్కలు ఉండటానికి వీల్లేదని స్పష్టంచేసింది. ఈ చర్యలను అడ్డుకోవడానికి ఏవైనా సంస్థలు ప్రయత్నిస్తే కఠిన చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించింది. ఈ తీర్పుపై అనేక అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ఈ తీర్పుపై జంతు హక్కుల సంస్థలు, ప్రముఖ వ్యక్తులు అభ్యంతరం తెలిపారు. తీర్పు ఆచరణ సాధ్యం కాదన్నారు.

గౌతమ్ అదానీకి సమన్లు అందజేయరేం ?

- భారత అధికారుల వైఫల్యంపై అమెరికా రెగ్యులేటర్ల విమర్శ
- న్యూయార్క్ కోర్టుకు తాజా నివేదిక

న్యూయార్క్ : భారత పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీపై న్యూయార్క్ కోర్టులో దాఖలైన కేసు విచారణలో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఈ కేసులో అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీకి, ఆయన భాగస్వాములకు భారత అధికారులు ఇప్పటి వరకూ సమన్లు కూడా అందజేయలేదని అమెరికా సెక్యూరిటీలు-ఎక్స్ఛేంజ్ కమిషన్ (ఎస్ఇసి) ఫెడరల్ కోర్టుకు నివేదించింది. ఈ మేరకు ఈ నెల 11న తన తాజా నివేదికను న్యాయస్థానానికి అందజేసింది. హేగ్ సర్వీస్ కన్వెన్షన్‌కు అనుగుణంగా భారత అధికారులు గౌతమ్‌కు విధిగా సమన్లు అందజేయాల్సి ఉంటుంది. కానీ ఈ విషయంలో భారత అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఎస్ఇసి ఫిర్యాదు చేసింది. గౌతమ్ అదానీ, ఆయన మేనల్లుడు సాగర్ అదానీ, మరికొందరు వ్యక్తులు అదానీ గ్రూప్ కార్యకలాపాలకు సంబంధించి



సెక్యూరిటీల చట్టాన్ని ఉల్లంఘించారని, తప్పుదోవ పట్టించేలా వ్యవహరించారని ఆరోపిస్తూ గత సంవత్సరం సివిల్ దావా దాఖలైంది. సౌర విద్యుత్ కాంట్రాక్టులు పొందేందుకు వీరు భారత అధికారులు, రాజకీయ నాయకులకు 265 మిలియన్ డాలర్ల ముడుపులు అందజేశారని అభియోగం మోపారు. అయితే ఈ ఆరోపణలను అదానీ గ్రూప్ ఖండిస్తూ అవి నిరాధారమైనవని తెలిపింది. కేసు విచారణను ముందుకు తీసుకుపోయేందుకు తాము ఎంతగానో ప్రయత్నిస్తున్నామని, అయితే సీమాంతర న్యాయ సహకారానికి సంబంధించి అడ్డంకులు ఎదురవుతుండడంతో పురోగతి నిలిచిపోయిందని కోర్టుకు అందజేసిన నివేదికలలో ఎస్ఇసి వివరించింది. భారత న్యాయ మంత్రిత్వ శాఖతో సంప్రదింపులు జరుపుతూనే ఉన్నామని, హేగ్ కన్వెన్షన్ ప్రకారం వారి సహకారం కోరానని తెలిపింది. ఉత్తరప్రత్యుత్తరాలు జరుపుతున్నప్పటికీ భారత అధికారులు స్పందించడం లేదని ఫిర్యాదు చేసింది. భారత్‌లోని అదానీ గ్రూప్ న్యాయవాదికి కూడా నేరుగా సమన్లు పంపామని తెలియజేసింది.గౌతమ్ అదానీపై చట్టపరమైన చర్యలు చేపట్టేందుకు న్యూయార్క్ కోర్టులో గత సంవత్సరం నవంబర్ 22న అభియోగాలు మోపారు. అదానీ తదితరులపై లంచం, మోసం ఆరోపణలు చేశారు. భారత విద్యుత్ పంపిణీ కంపెనీల నుంచి సౌర విద్యుత్ కాంట్రాక్టులు పొందేందుకు 2020-2024 మధ్యకాలంలో అదానీలు ముడుపులు ముట్టజెప్పారన్నది ఈ కేసులో ప్రధాన ఆరోపణ. సౌర ఇంధన ప్రాజెక్టు కోసం అదానీ గ్రూప్ అమెరికా బ్యాంకులను మోసం చేసి అనేక బిలియన్ డాలర్లను రుణంగా పొందినందున ఈ వ్యవహారంపై దర్యాప్తు జరిపే అధికారం అమెరికాకు ఉంటుంది.



దక్షిణ యూరప్‌లో కార్చిచ్చు.. ముగ్గురు మృతి

- వేలాది మంది స్థానభ్రంశం

ఏథేన్స్ : దక్షిణ యూరప్‌లో కార్చిచ్చు మరింత తీవ్రమైంది. ఈ కార్చిచ్చులతో స్పెయిన్, టర్కీ, అల్బేనియాల్లో ముగ్గురు మరణించినట్లు అధికారులు బుధవారం తెలిపారు. వేలాది మంది స్థానభ్రంశం చెందినట్లు చెప్పారు. గ్రీస్‌లోని మూడవ అతిపెద్ద నగరం పాట్రాస్‌ను మంటలు చుట్టుముట్టకుండా అగ్నిమాపక సిబ్బంది తీవ్రంగా యత్నిస్తున్నారు. పాట్రాస్ వెలుపల, ఆలివ్ తోటల్లోకి మంటలు వ్యాపించాయి. ఇళ్లు, వ్యవసాయ సదుపాయాలను రక్షించేందుకు సిబ్బంది ప్రయత్నిస్తున్నారు. హెలికాప్టర్లు, విమానాలతో మంటలపై నీటిని జల్లుతున్నారు. నరికివేసిన కొమ్మల మంటలను నివాసితులు బకెట్లతో నీటితో ఆర్పేందుకు యత్నిస్తున్నారు. డజన్ల కొద్దీ చెలరేగిన కార్చిచ్చులపై విమానాలతో నీళ్లను స్ప్రే చేస్తున్నారు. ఏథేన్స్ పొరుగున ఉన్న అల్బేనియాకు కూడా అగ్నిమాపక యంత్రాలను పంపినట్లు అధికారులు తెలిపారు. మాడ్రిడ్‌కు ఉత్తరాన ఉన్న కాస్టిల్ మరియు లియోన్ ప్రాంతం నుండి వేలాది మందిని తరలించారు. ఈఏడాది జూన్ నెల చివరి నుండి టర్కీ కార్చిచ్చులను ఎదుర్కొంటోంది. పది మంది సహాయక వాలంటీర్లు, అటవీకార్మికులు సహా మొత్తం 18మంది మరణించారు.

యుపిలో మరో దారుణం

- వికలాంగురాలిపై అత్యాచారం

లక్నో : ఉత్తరప్రదేశ్‌లో మరో దారుణం చోటుచేసుకుంది. వికలాంగురాలైన ఒక మహిళను ఇద్దరు యువకులు వెంబడించి.. నిర్జన ప్రదేశంలోకి తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డారు. బాధిత మహిళ బలరాంపుర్ జిల్లాలోని తన ఇంటికి వెళుతుండగా ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వెంబడించారు. తరువాత కిడ్నాప్ చేసి.. నిర్జన ప్రదేశంలోకి తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డారు. దీనికి సంబంధించిన దృశ్యాలు అక్కడి సీసీటీవీల్లో రికార్డయ్యాయి. బాధితురాలు ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు ఆందోళన చెందారు. పోలీస్ స్టేషన్ సమీపంలోని పొలాల్లో ఆమె పడి ఉండటం గుర్తించి.. ఆస్పత్రికి తరలించారు. జిల్లా ఉన్నతాధికారుల నివాసాలకు కొంత దూరంలోనే ఈ ఘటన చోటుచేసుకోవడం ఆందోళన కలిగిస్తోంది. దీనిపై బాధిత కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీటీవీ ఫుటేజీల ఆధారంగా దర్యాప్తు ప్రారంభించారు. నిందితులను అంకుర్ వర్మ, హర్షిత్ పాండేలుగా గుర్తించారు. వారిని పట్టుకునే క్రమంలో కాల్పులు జరిపామని పోలీసు సూపరింటెండెంట్ వికాస్ కుమార్ తెలిపారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించినట్లు వెల్లడించారు. నిందితులు నేరం అంగీకరించారని, పూర్తి స్థాయి దర్యాప్తు కొనసాగుతుందన్నారు.

వరదరాజన్‌ను అరెస్ట్ చేయొద్దు

- 'ది వైర్' పోర్టల్ వ్యవస్థాపక సంపాదకుడిపై కేసులో సుప్రీంకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ : భారతీయ న్యాయ సంహితలోని సెక్షన్ 152 కింద 'ది వైర్' పోర్టల్ వ్యవస్థాపక సంపాదకుడు సిద్దార్థ్ వరదరాజన్‌పై అస్సాంలో నమోదైన కేసులో ఆయనను అరెస్ట్ చేయవద్దని సుప్రీంకోర్టు మధ్యంతర ఆదేశాలు జారీ చేసింది. ఆపరేషన్ సిందూర్‌పై ప్రచురితమైన ఓ వ్యాసాన్ని ఆధారంగా చేసుకొని మోరిగావ్ పోలీసులు ఈ నెల 11న వరదరాజన్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. రాజకీయ నాయకత్వ పరిమితుల కారణంగా భారత వైమానిక దళం పాకిస్తాన్‌కు ఫైటర్ జెట్లను కోల్పోయిందన్న శీర్షికతో ఆ వ్యాసం ప్రచురితమైంది. భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)లోని సెక్షన్ 152 రాజ్యాంగబద్ధతను సవాలు చేస్తూ 'ది వైర్' పోర్టల్‌కు చెందిన ఫౌండేషన్ ఫర్ ఇండిపెండెంట్ జర్నలిజం ట్రస్ట్, వరదరాజన్ దాఖలు చేసిన రిట్ పిటిషన్లను పురస్కరించుకొని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మల్య బగ్చీతో కూడిన సుప్రీంకోర్టు బెంచ్ అరెస్ట్ నుంచి రక్షణ కల్పిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. వలసవాదుల కాలం నాటి రాజద్రోహం చట్టానికి బీఎన్ఎస్ నకలు అని పిటిషనర్లు వాదించారు. ఈ రిట్ పిటిషన్‌తో పాటు బీఎన్ఎస్ నిబంధనలను ప్రశ్నిస్తూ దాఖలైన మరో పిటిషన్‌ను కూడా జత చేస్తూ సుప్రీం బెంచ్ కేంద్రానికి నోటీసులు జారీ చేసింది. బీఎన్ఎస్ నిబంధన అస్పష్టంగా ఉన్నదని పిటిషనర్ల తరపున వాదించిన సీనియర్ న్యాయవాది నిత్య రామకృష్ణన్ తెలిపారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించేందుకు మీడియాకు ఉన్న హక్కుపై ఇది ప్రభావం చూపుతుందని చెప్పారు. దుర్వినియోగం అయ్యే అవకాశం ఉన్నదన్న కారణంతో నిబంధనను కొట్టివేయవచ్చునా అని బెంచ్ ప్రశ్నించింది. మీడియాను ప్రత్యేక వర్గంగా గుర్తించవచ్చా అని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా అడిగారు. దీనిపై జస్టిస్ బగ్చీ స్పందిస్తూ 'వారు కోరుకుంటున్నది అది కాదు. అది ప్రాథమిక హక్కు అయిన భావ ప్రకటనా స్వేచ్ఛతో పబ్లిక్ ఆర్డర్ పరిరక్షణను సమతూకం చేయడానికి సంబంధించిన అంశం' అని అన్నారు. జరిగిన నేరం వార్తా సంస్థ ప్రచురించిన కథనాలకు సంబంధించినది అయినప్పుడు కస్టోడియల్ విచారణ అవసరం ఉండకపోవచ్చునని జస్టిస్ కాంత్ అభిప్రాయపడ్డారు. ప్రాథమికంగా ఈ అంశాలకు కస్టోడియన్ విచారణ అవసరం లేదని చెప్పారు. ఇండోనేషియాలోని ఒక విశ్వవిద్యాలయం నిర్వహించిన సెమినార్ ఇచ్చిన వాస్తవ నివేదిక, ఆపరేషన్ సిందూర్ సమయంలో అనుసరించిన సైనిక వ్యూహాలపై భారత రక్షణ సిబ్బంది చేసిన ప్రకటనల ఆధారంగా ఈ వ్యాసాన్ని రూపొందించామని పిటిషనర్లు తెలియజేశారు. సైనికాధికారి వ్యాఖ్యలపై భారత రాయబార కార్యాలయ స్పందనను కూడా ఈ వ్యాసంలో పొందుపరిచామని చెప్పారు. సైనికాధికారి వ్యాఖ్యలను అనేక ఇతర మీడియా సంస్థలు కూడా ప్రచురించాయని వివరించారు. ఎఫ్ఐఆర్‌ను నమోదు చేయడం చట్ట ప్రక్రియను అవమానించడమే అవుతుందని, అది పత్రికా స్వేచ్ఛను అణచివేసేందుకు తీసుకున్న చర్య అని పిటిషనర్లు వాదించారు.

గుజరాత్ వ్యక్తులకు బీహార్‌లో ఓట్లా..?

- తేజస్వి యాదవ్

పాట్నా : బీహార్‌లో ఎస్ఐఆర్‌లో భాగంగా ఇటీవల విడుదల చేసిన ముసాయిదా జాబితాలో అక్రమాలు చోటుచేసుకున్నాయని ప్రతిపక్ష పార్టీలు విమర్శిస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా గుజరాత్ వ్యక్తులు బిహార్‌లో ఓటర్లుగా మారుతున్నారని ఆర్‌జెడి నేత తేజస్వీ యాదవ్ విమర్శించారు. "గుజరాత్‌కు చెందిన కొందరు వ్యక్తులు బిహార్‌లో ఓటు హక్కు పొందుతున్నారు. బిజెపి ఇంఛార్జి భిఖుభాయ్ దల్సానియా పట్నా ఓటర్‌గా మారారు. 2024లో ఆయన గుజరాత్‌లో ఓటువేశారు. అక్కడ ఆయన పేరు తొలగించారు. బిహార్ ఎన్నికలు ముగిసిన తర్వాత ఆయన మళ్లీ ఎక్కడికి వెళ్తారు. ఇదంతా ఒక కుట్ర. ఎన్నికల కమిషన్‌తో కలిసి బిజెపి మోసం చేస్తోంది" అని తేజస్వి తీవ్ర విమర్శలు చేశారు.

రాజస్థాన్‌లో రోడ్డు ప్రమాదం

- 11మంది మృతి

జైపూర్ : రాజస్థాన్ రాష్ట్రంలోని దౌసా జిల్లాలో బుధవారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. దౌసా-మనోహర్ పూర్ రోడ్డులో బాపీ సమీపంలో వ్యాన్ - కంటైనర్ ఢీకొనడంతో 11 మంది మరణించారు. ఈ ప్రమాదంలో 15 మంది గాయపడడంతో జైపూర్ లో వివిధ ఆస్పత్రులకు తరలించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిలో తొమ్మిది మంది పరిస్థితి విషమంగా ఉండడంతో జైపూర్ లోని సవాయి మన్ సింగ్ ఆస్పత్రిలోని ఐసియులో చికిత్స అందిస్తున్నారు. ఉత్తర ప్రదేశ్‌లోని ఎటావా జిల్లాకు చెందిన యాత్రికులు ఖాటూష్యామ్‌జీ దేవాలయాన్ని సందర్శించుకొని తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ట్రాఫిక్ జామ్ కావడంతో క్రేన్ సహాయంతో వాహనాలను పక్కకు తొలగించారు. మృతుల్లో ఏడుగురు పిల్లలు ఉన్నట్లు సమాచారం. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అతివేగమే ఈ ప్రమాదానికి కారణమని పోలీసులు భావిస్తున్నారు.

జీవన సౌరభం

కాలం విలువను గ్రహించని వారు, జీవితం విలువను అర్థం చేసుకోలేరు.

మీ కోసం

వంటగదిలో ఉపయోగించే నాప్‌కిన్లకు పొరపాటున మంట అంటుకుంటే దానిపై ఉప్పు చల్లితే ఆరిపోతుంది.





మన జెండా

మూడు రంగుల జెండా
ముద్దులొలికెడు జెండా
వినీల గగనంలో
రెపరెపలాడు జెండా

పింగళి చేసిన జెండా
గాంధీ ఎత్తిన జెండా
స్వతంత్ర పోరాటంలో
ఐక్యత నింపిన జెండా

ధైర్యం పెంచే జెండా
శాంతిని నింపే జెండా
అభివృద్ధికి చిహ్నము
స్వాతంత్ర్యపు జెండా

కులము లేని జెండా
మతము లేని జెండా
ప్రాంతీయత ఎరుగని
భారతదేశపు జెండా

చేత పట్టితే జెండా
పౌరుషం గుండెల నిండా
గర్వంతో ఎగురవేయరా
మువ్వన్నెల జెండా

వీరుల త్యాగ ఫలం జెండా
స్వాతంత్ర్య దినోత్సవ జెండా
వందనం చేయగా పెరుగును
దేశభక్తి గుండెల నిండా

– ఆవుల చక్రపాణి యాదవ్,
99633 50973



జెండా పండుగ

చిట్టి, చిన్నా రారండి
జెండా పండుగ వచ్చేనండి
త్వరగా నిద్దుర లేవండి!
చక్కగా తయారు అవ్వండి
బడికి బయలు దేరండి!!

పూలు దండిగా తేరండి
మాలలు చక్కగా కట్టండి!
జాతీయ నాయకులకు వేయండి
జెండా కర్రకు చుట్టండి!

దేశభక్తి గీతాలు నేర్వండి
ఒకే గొంతుకై పాడండి!
అన్నదమ్ముల వలే మెలగండి
దేశ గొప్పతనం చాటండి!

రాజు, రమణి రారండి
జెండా పండుగ వచ్చేనండి!
అమ్మ నాన్నలను పిలవండి
మీ బడి గొప్పని చూపండి!

చదువులు చక్కగా చదవండి
ఆటలు మేటిగా ఆడండి!
నిశ్శబ్దంగా ఉండండి
పెద్దలు చెప్పేవి వినండి!

గురువుల మాట జవదాటకండి
మిఠాయిలతో నోరు తీపి చేసుకోండి!
అందరూ ఒకటై కదలండి
జైహింద్ అని ముందుకు సాగండి!

– ఏడుకొండలు కళ్ళేపల్లి,
మచిలీపట్నం, 94908 32338.

నేను గీసిన బొమ్మ





జి.వెంకటసాయి దీక్షిత్,
3వ తరగతి,
మోడల్ ప్రైమరీ స్కూలు,
చిల్లకల్లు మెయిన్,
జగ్గయ్యపేట,
ఎన్‌టిఆర్ జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

జామతో ప్రయోజనాలు జమ

ఈ కాలం విరివిగా దొరికే జామకాయలను తినడం వల్ల ఎన్నో ఆరోగ్య లాభాలు ఉన్నాయి. అయితే రోజుకు ఎంత మోతాదులో వీటిని తినాలి? అనే దానిపై చాలామందికి స్పష్టత లేదు. పోషకాహార నిపుణుల సలహా ప్రకారం రోజుకి 100 గ్రాముల జామ కాయలు లేదా పండ్లను తినవచ్చు. అంతకు మించితే జీర్ణ సమస్యలు వస్తాయి. మితంగా జామకాయలను తినడం వల్ల అనేక లాభాలు ఉన్నాయి.



దయాబెటిస్ ఉన్నవారికి..

- జామకాయలు లేదా పండ్లు పోషకాలకు నెలవుగా చెప్పవచ్చు. వీటిల్లో మన శరీరానికి కావల్సిన అనేక విటమిన్లు, మినరల్స్ సమృద్ధిగా ఉంటాయి. అందువల్ల వీటిని తింటే పోషకాహార లోపం తగ్గుతుంది.
- ఈ పండ్లలో విటమిన్ సి అధికంగా ఉంటుంది. ఇది యాంటీ ఆక్సిడెంట్‌లా పనిచేస్తుంది. రోగ నిరోధక వ్యవస్థను పటిష్టంగా మారుస్తుంది. వ్యాధులు, ఇన్‌ఫెక్షన్లను తగ్గేలా చేస్తుంది. రోగాలు రాకుండా చూస్తుంది.
- జామ పండ్లను తినడం వల్ల ఫైబర్ అధికంగా లభిస్తుంది. దీని వల్ల పేగుల్లో మలం కదలికలు సరిగ్గా ఉంటాయి. దీంతో మలబద్ధకం తగ్గుతుంది.
- షుగర్‌తో బాధపడేవారికి జామ కాయలు ఎంతో మేలు చేస్తాయి. వీటిని తింటే షుగర్ లెవల్స్‌ను కంట్రోల్‌లో ఉంచుకోవచ్చు.
- ఈ కాయల గ్లైసీమిక్ ఇండెక్స్ చాలా తక్కువగా ఉంటుంది. అందువల్ల వీటిని తింటే రక్తంలో చక్కెర స్థాయిలు త్వరగా పెరగవు. పైగా ఈ కాయల్లో ఉండే ఫైబర్, విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు షుగర్ లెవల్స్‌ను తగ్గించేందుకు సహాయం చేస్తాయి.

గుండె ఆరోగ్యానికి..

- జామకాయల్లో పొటాషియం, ఫైబర్ అధికంగా ఉంటాయి. ఇవి రక్తపోటుని నియంత్రిస్తాయి. రక్త సరఫరాను మెరుగు పరుస్తాయి.
- కొలెస్ట్రాల్ స్థాయిలను అదుపులో ఉంచుతాయి. దీంతో గుండె ఆరోగ్యంగా ఉంటుంది. హార్ట్ ఎటాక్ రాకుండా అడ్డుకోవచ్చు.
- ఈ కాయల్లో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉన్న కారణంగా వీటిని తింటే చర్మ ఆరోగ్యం మెరుగ్గా ఉంటుంది. ఆక్సీకరణ ఒత్తిడి తగ్గి, వృద్ధాప్య ఛాయలు తగ్గుతాయి. చర్మం యవ్వనంగా మారి కాంతివంతంగా కనిపిస్తుంది.
- జామకాయల్లో ఉండే ఫైబర్ జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. ఈ కాయలను తింటే గ్యాస్, అజీర్తి, కడుపు ఉబ్బరం వంటి సమస్యలు తగ్గుతాయి. జీర్ణ వ్యవస్థ శుభ్రంగా మారుతుంది. పేగుల్లో ఉండే వ్యర్థాలు బయటకు పోతాయి.

రోగ నిరోధక వ్యవస్థకు..


- జామకాయలను తినడం వల్ల రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. దీంతో సీజనల్‌గా వచ్చే దగ్గు, జలుబు వంటి సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. జామకాయలను తింటే నోట్లో ఉండే బ్యాక్టీరియా నశిస్తుంది. దీంతో నోటి దుర్వాసన తగ్గుతుంది.
- దంతాలు, చిగుళ్లు దృఢంగా, ఆరోగ్యంగా ఉంటాయి.
- గులాబి రంగులో ఉండే జామకాయల్లో విటమిన్ ఎ అధికంగా లభిస్తుంది. ఇది కంటి చూపును మెరుగు పరచడంతోపాటు రోగ నిరోధక శక్తిని సైతం పెంచుతుంది. చర్మం ఆరోగ్యంగా ఉండేలా చేస్తుంది.

వాన నీటిని ఒడిసి పట్టుకుందాం!

నీటి కొరత ప్రపంచాన్ని పీడిస్తున్న అతిపెద్ద సమస్యల్లో ఒకటి. ప్రతి వర్షపుచుక్కని భద్రపరుచుకుంటేనే ఈ సమస్య నుండి కాస్త అయినా బయటపడగలం. ఇప్పటికే చాలామంది వాన నీటిని కాపాడుకుంటున్నారు. అయితే ఈ పద్ధతి ప్రతి ఒక్కరూ బాధ్యతగా నిర్వర్తించాలి. ఇంటి పైకప్పు నుండి పడే నీటిని చాలా సులభ పద్ధతిలో భద్రపరుచుకోవచ్చు.

ఎలా కాపాడుకోవాలంటే..

- ఒక పెద్ద ప్లాస్టిక్ డ్రమ్ము, శుభ్రమైన వస్త్రం, పోర్టబుల్ పైపులు వుంటే చాలు.. వర్షపు నీటిని కాపాడుకోవచ్చు.
- ఇంటి టెర్రస్ పైనుండి పడే వాననీళ్ల డ్రమ్ములోకి చేరేవిధంగా ఏర్పాటు చేసుకోవాలి.
- అలా పడే నీరు ఫిల్టర్ అయ్యేలా డ్రమ్ముపై పల్చని బట్టని కప్పాలి.
- డ్రమ్ములోకి ఇలా చేరిన నీటిని ఇంటి అవసరాలకు వాడుకునేలా, నీళ్ల ట్యాంకుల్లోకి పైపుల ద్వారా సరఫరా చేసుకోవాలి.
- అయితే వాన నీళ్లని భద్రపరుచుకునేటప్పుడు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి.



- వర్షాకాలం మొదట్లో పడే వాన నీటిని వదిలివేయాలి. ఆ నీటిలో దుమ్ము, ధూళి కలగలపి ఉంటాయి. కాబట్టి, ఆ తరువాత పడే నీటిని భద్రపరుచుకుని ఎంచక్కా ఇంటి అవసరాలకు వాడుకోవచ్చు.
- పట్టణాలు, గ్రామాలు అన్న తేడా లేకుండా ఈ పద్ధతి పాటించవచ్చు.

వర్షాకాలం నీరు తాగడం లేదా?



వర్షాకాలంలో సాధారణంగా దాహం చాలా తక్కువగా ఉంటుంది. దీంతో చాలా మంది నీరు తక్కువగా తాగుతారు. అయితే ఈ అలవాటును వెంటనే మార్చుకోవడం మంచిదంటున్నారు నిపుణులు. దాహం వేయకుండా నీరు తాగే అలవాటు ఆరోగ్యాన్ని కాపాడుతుందని సూచిస్తున్నారు. వర్షాకాలంలో తాగే నీటి పరిమాణం తగ్గితే అనేక ఆరోగ్య సమస్యలకు దారితీస్తుందనీ చెబుతున్నారు.

మలబద్ధకం : శరీరంలో తగినంత నీరు లేకపోతే మలబద్ధకం వంటి సమస్యలు తలెత్తుతాయి. ఇందుకు సరైన మందులు సకాలంలో తీసుకోకపోతే, మూలశంక వంటి వ్యాధులు వస్తాయి. అంతే కాదు వర్షాకాలంలో తక్కువ నీరు తాగడం వల్ల జీర్ణ సమస్యలు కూడా వస్తాయి.

శరీర బలహీనత : ప్రతిరోజూ ఉత్సాహంగా పనిచేయాలంటే శరీరానికి తగినంత శక్తి అవసరం. దీనికోసం క్రమం తప్పకుండా నీరు తాగడం చాలా అవసరం. లేకపోతే చిన్న చిన్న పనులు చేసినా త్వరగా అలసిపోతారు.

మూత్రపిండాల సమస్యలు : సాధారణంగా మూత్రపిండాలు మన శరీరం నుంచి విషాన్ని తొలగించడానికి సహాయపడతాయి. కానీ శరీరంలో నీటి కొరత ఉంటే, అది మూత్రపిండాల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతుంది.

చర్మ సమస్యలు : ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం.. శరీరంలో నీటి శాతం తగినంతగా లేనప్పుడు చర్మం దాని మెరుపును కోల్పోతుంది. ముఖంలో ప్రకాశం కూడా తగ్గుతుంది. దీనితో పాటు మొటిమలు, ఇతర చర్మ సంబంధిత సమస్యలు కూడా ప్రారంభమవుతాయి. తగినంత నీరు తాగే అలవాటు చర్మాన్ని హైడ్రేట్‌గా ఉంచుతుంది. అదేవిధంగా చర్మం పొడిబారడం వంటి సమస్యలను తగ్గిస్తుంది.

మూత్ర నాళ ఇన్ఫెక్షన్లు : శరీరంలో నీటి స్థాయి తగ్గితే మూత్ర నాళాల ఇన్ఫెక్షన్లు వచ్చే అవకాశం ఉంది. నిపుణుల అభిప్రాయం ప్రకారం.. రోజుకు కనీసం 3 లీటర్ల నీరు తాగాలి. అందుకే ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటే, ఎక్కువ నీరు తాగాలని నిపుణులు సూచిస్తున్నారు.

ఏకాభిప్రాయం కుదరలేదు

కొనసాగనున్న కార్మికుల ఆందోళన • షూటింగుల బంద్ యథాతథం

30 శాతం వేతనాల పెంపు కోసం టాలీవుడ్ సినీ కార్మికుల చేస్తున్న పోరాటం మరింత ఉధృతం కానుంది. బుధవారం జరిగిన కో ఆర్డినేషన్ కమిటీ సమావేశం ఎలాంటి నిర్ణయాలు తీసుకోకుండా ముగిసింది. 'కార్మికులు సంతోషంగా ఉండాలి' అంటూ నిర్మాతలు... 'పనులు కల్పించే నిర్మాతలు ఇబ్బంది పడకూడదు' అంటూ కార్మిక నేతలు ఒక మెట్టు దిగటంతో సమస్య పరిష్కారానికి కోఆర్డినేషన్ కమిటీ చొరవ చూపింది. సినీ కార్మికుల సమాఖ్య (ఫెడరేషన్), తెలుగు సినిమా నిర్మాతల మండలి సంయుక్త సమావేశం బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు అనుకున్నా, వర్షం కారణంగా కాస్త ఆల స్యంగా ప్రారంభమై.. సుమారు 4 గంటల పాటు జరిగింది. మొత్తం 13 మంది సభ్యుల ప్రతినిధుల బందం, కో–ఆర్డినేషన్ కమిటీ ఛైర్మన్ వీర శంకర్ తదితరుల ఆధ్వర్యంలో ఈ చర్చలు ప్రారంభమ య్యాయి. ఇరు సంఘాల ప్రతినిధుల పెద్దల జోక్యంతో కొంత సర్దుబాటు దిశగా కొనసాగాయి. డాన్సర్లు, ఫైటర్లు, టెక్నీషియన్లకు మినహా మిగతా కార్మికులకు వేతనాలు 25 శాతం పెంచుతామని నిర్మాతలు ప్రకటింగా, ఫెడరేషన్ నాయకులు 30 శాతం పెంపుదలపైనే నికరంగా ఉన్నామని చెప్పారు.



రెండు షరతులకే అంగీకారం

2018–22లో చేసుకున్న మొదటి 2 ఒప్పందాలకు ఫెడరేషన్ నాయకులు కూడా అంగీకరించారు. గతంలో ఉదయం 6 నుంచి సాయంత్రం 6 వరకు ఒక రోజు కాల్ షీట్ ఉండేది. ఇప్పుడు ఉదయం 6 నుంచి రాత్రి 9 వరకు కాల్ షీట్ ప్రవేశపెట్టడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. కాల్ షీట్ మార్పు చేస్తే వేతనాలు పెంచాలని.. రోజున్నర కాల్ షీట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సెలవు రోజుల్లో పని చేస్తే డబుల్ కాల్‌షీట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీనికి నిర్మాతల మండలి ప్రతినిధులు ఒప్పుకోలేదు. దీంతో ఫెడరేషన్ నాయకులు తాము ఆందోళనను యథాతథంగా కొనసాగిస్తామని తెలియజేశారు.

అగ్రిమెంట్ అమలే అస్త్రం

తామేమీ గొంతెమ్మ కోర్కులు కోరటం లేదని, గతంలో చేసిన అగ్రిమెంట్‌ను మాత్రమే అమలు చేయాలని కోరుతున్నామని కార్మిక సంఘాల నేతలు చెప్పారు. 'జూన్ 30లోగా అగ్రిమెంట్ చేయాలి. నాలుగు నెలలుగా ఈ విషయం గుర్తు చేస్తూనే ఉన్నాం. నిర్మాతలు పట్టించుకోకపోగా, కొందరు నిర్మాతలు పరుష పదజాలంతో మాట్లాడారు. ఇది కార్మికులను గాయపర్చింది.' అని తెలిపారు. మూడేళ్ల క్రితానికి, నేటికీ ధరల్లో వ్యత్యాసం చూడండి. సినీ కార్మికుల్లో సింహభాగం షూటింగ్‌లకు హాజరైతే తప్ప భుక్తి గడవని వారే. ఇంటి అద్దెలు భరించలేక పోతున్నారు. కొందరు నిర్మాతలు షూటింగ్‌లు చేయించుకుంటున్నారు. ఆనక డబ్బులివ్వటం లేదు.. టిజి విశ్వప్రసాద్ ఒక్కరూ రూ.90 లక్షలు బకాయిలు చెల్లించాలి. హీరో, హీరోయిన్లకు కోట్ల రూపాయలు రెమ్యూనరేషన్లు ఇస్తున్నారు. టెక్నీషియన్లకు కోరిన ప్యాకేజీలు ముట్టజెబు తున్నారు. ఎటుతిరిగి ఇబ్బంది పడేది 24 క్రాఫ్ట్‌ల పరిధిలో పనిచేసే కార్మికులు మాత్రమే. 30 శాతం ఈ ఒక్క ఏడాదే పెంచాలనీ మేము కోరటం లేదు. గత మూడేళ్లుగా అగ్రిమెంట్ ప్రకారం ఏటేటా 10 శాతం పెంపుదల చేయాల్సివుంది. పెండింగ్ పెంపుదల ఇప్పుడు చేయాలనే కోరుతున్నాం. అంతేకాకుండా పెంపుదల మొత్తం ఏరోజుకారోజు చెల్లింపులు చేసేయండి' అంటూ ఫెడరేషన్ నాయకత్వం తమ ప్రతిపాదనలు సమావేశం ముందుంచింది. నిర్మాతలు– కార్మికుల మధ్య సయోధ్యకు ఇది సంకేతంగా నిలుస్తుందని స్పష్టంచేశారు. 'కొందరికి మాత్రమే చేస్తాం. ఇంకొందరికి ఆపేస్తామంటే మేము ఒప్పుకోం' అని తెల్చి చెప్పారు.

'షరతులు పాటించొచ్చుగా....'

సినీ కార్మికుల్లో వేర్వేరు శాఖల్లో రకరకాల శ్రమలు చేసే వాళ్ళున్నారు. మేథ, శారీరక, నైపుణ్యం, నైపుణ్యం లేనివారు, శుభ్రం చేసే శ్రమలు చేసే వారు ఉన్నారు. అందరికీ ఎందుకు పెంచాలి. మాకు నచ్చిన వారికి మాత్రమే పెంచుతాం.. అదీ కూడా కొన్ని షరతులు పెడుతున్నాం. వాటిని పాటిస్తేనే 30 శాతం పెంపుదల చేస్తాం. సంఘాల్లో నమోదు కాని వారితో కూడా పనులు చేయించుకుంటాం. దానికి మీకెందుకు ఇబ్బంది? మా ఇష్టం. సినిమాల డబ్బు ఖర్చుపెట్టేది మేము. భారీ బడ్జెట్లతో హిట్లు రాక, థియేటర్లు దొరక్క, మార్కెట్లు లేక ఇప్పటికే తీవ్రంగా నష్టపోయాం. గత 10 రోజులుగా షూటింగ్‌లు నిలిచిపోయాయి. ఒక్కో నిర్మాత రూ.10 కోట్ల నుంచి రూ. 12 కోట్లు వరకూ నష్టపోయారు. దీనివల్ల ఎవ్వరికి లాభం. ఇది ఎవరు భరిస్తారు?" అంటూ నిర్మాతల మండలి ప్రతినిధులు కొద్దిసేపు వాగ్వాదానికి దిగారు.

విశ్వప్రసాద్ తీరుపైన దుమారం...

చర్చలు జరుగుతున్న క్రమంలో కూడా నిర్మాత, పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ అధినేత టివి విశ్వప్రసాద్ చేసిన కొన్ని వ్యాఖ్యలు మళ్లీ అగ్నికి ఆజ్యం పోశాయి. సినీ ఆర్ట్ డైరెక్టర్లు 'ఆర్ట్ మాఫియా' అంటూ విశ్వప్రసాద్ అభివర్ణించడంపై ఆర్ట్ డైరెక్టర్స్ యూనియన్ ప్రతినిధులు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన కూడా విడుదల చేశారు. మద్రాసు నుంచి ఇక్కడికి వచ్చి, ఎన్నో ఇబ్బందులకు గురై మన తెలుగు గడ్డ మీద అంకితభావంతో, నిబద్ధతతో కార్మికులు పనిచేస్తుంటారని, వారిని మాఫియాతో పోల్చడం సబబు కాదని ఖండించారు. విశ్వప్రసాద్ తన తప్పును తెలుసుకుని క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. సినీ పరిశ్రమ ఏర్పడిన తొలినాటి నుండి నేటి వరకు ఎంతో మంది ఆర్ట్ విభాగంలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందా రని పేర్కొన్నారు. విశ్వప్రసాద్ తాజా వ్యాఖ్యల ద్వారా వారి పనితనాన్ని కూడా విమర్శించినట్లే ఉన్నాయి. దర్శకుడి ఆలోచనలకు అనుగుణంగా ఏ సినిమాకైనా ఆర్ట్ డిపార్ట్‌మెంట్ వారు సెట్లు వేస్తుంటారు. వారి ఆలోచనలో మార్పు లకు అనుగుణంగా బడ్జెట్ ఒక్కోసారి పెరగటం, ఇంకోసారి తగ్గటం జరుగుతుంది. సెట్ నిర్మాణంలో గతంలో కాంట్రాక్ట్ వ్యవస్థను ప్రోత్సహించడంవల్ల, వారి అవగాహన లోపాలవల్ల నష్టాలు జరుగుతున్నాయని విశ్వప్రసాద్ తెలుసుకోవాలని ఆర్ట్ డైరెక్టర్స్ యూనియన్ నాయకులు తెలిపారు.

కాల్షీట్‌పై కొనసాగుతున్న వివాదం

'కాల్షీట్' పేరుతో నడిచే 'పనిదినం'లో కార్మికుడు 12 గంటలు పని చేసినందుకు నిర్మాత రూ.1,200 జీతం ఇస్తాడనుకుందాం. 30 శాతం పెంపుదలతో రూ.1560 పెరుగుతుంది. 'మేము ఐక్యంగానే ఉన్నాం.. ఉంటాం.. అన్ని క్రాఫ్ట్‌ల కార్మికుల వేతనాలు పెంచితేనే పోరుబాట ఆపుతాం' అంటూ ఫెడరేషన్ ప్రతినిధులు స్పష్టంచేశారు. చిన్న నిర్మాతలను వదిలేయండి. మిగతా నిర్మాతలు 30 శాతం పెంపుదల చేస్తారంటూ నిర్మాతల మండలి ప్రతిపాదనలు ఉంచింది. చిన్న నిర్మాతలంటే బడ్జెట్ ఎంత? అనే విషయమై కూడా చర్చలు కొనసాగాయి. అవును... నిర్మాతలు బాగుంటేనే కదా, మాకు పనులు దొరికేది. కాకపోతే, మా బాగు కూడా కొంచెం ఆలోచించమంటున్నాం' అని కార్మిక నాయకులు చర్చల్లో చెప్పారు. కానీ, నిర్మాతలు పాత పట్టును వీడకపోవడంతో చర్చలు ఒక కొలిక్కి రాలేదు.


అంగీకరిస్తే వేతనాల పెంపు : దిల్‌రాజు

సినీ కార్మికుల వేతనాల పెంపు అంశం ఇంకా కొలిక్కి రాలేదని నిర్మాత, ఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్ రాజు తెలిపారు. నిర్మాతలు, ఫెడరేషన్ నాయకుల మధ్య చర్చలు కొనసాగుతున్నాయని, మరో రెండు, మూడు సార్లు చర్చలు జరగాల్సి ఉందన్నారు. పని విధానాలకు అంగీకరిస్తే వేతనాలు పెంచేందుకు నిర్మాతలు సుముఖంగా ఉన్నట్లు చెప్పుకొచ్చారు.

రాయల్స్ ఆఫ్ రాయలసీమ విజయం

ప్రజాశక్తి –ఎంవిపి కాలనీ (విశాఖపట్నం)

ఆంధ్ర ప్రీమియర్ లీగ్ సీజన్ –4 లో భాగంగా ఎసిఎ–విడిసిఎ మైదానంలో బుధవారం జరిగిన 10వ మ్యాచ్‌లో రాయల్స్ ఆఫ్ రాయలసీమ – తుంగభద్ర వారియర్స్ జట్లు తలబడ్డాయి. తొలుత బ్యాటింగ్ చేసిన రాయల్స్ ఆఫ్ రాయలసీమ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి 191 పరుగులు చేసింది. తర్వాత బరిలో దిగిన తుంగభద్ర వారియర్స్ 17.2 ఓవర్లలో 140 పరుగులకు ఆల్ అవుట్ అయింది. 51 పరుగులు తేడాతో రాయల్స్ ఆఫ్ రాయలసీమ జట్టు విజయం సాధించింది. టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న తుంగభద్ర వారియర్స్ జట్టు బౌలర్లు రాయల్స్ ఆఫ్ రాయలసీమ జట్టు ఆటగాడు ఎంఎం.కుమార్‌ను 0 పరుగులకే అవుట్ చేసినప్పటికీ కెప్టెన్ రషీద్ బాధ్యతాయుత ఇన్నింగ్స్ ఆడి 48 బంతులలో రెండు సిక్సులు ఆరు ఫోర్లతో 67 పరుగులు, సత్య సాయి సాత్విక్ 22 బంతులలో నాలుగు సిక్సులు మూడు ఫోర్లతో 45 పరుగులు, చివరిలో ఎం.హర్షవర్ధన్ 21 బంతులలో ఒక సిక్స్, నాలుగు ఫోర్లతో 34 పరుగులు చేయటంతో నిర్ణీత 20 ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి 191 పరుగులు చేసింది. తుంగభద్ర వారియర్స్ జట్టు బౌలర్లలో తోషిత్ యాదవ్ 2 వికెట్లు, చీపురుపల్లి స్టీఫెన్, సౌరబ్ కుమార్ కె.వి.శశికాంత్ ఒక్కొక్క వికెట్ తీశారు. 192 పరుగులు విజయ లక్ష్యంతో బరిలో దిగిన తుంగభద్ర వారియర్స్ కెప్టెన్ మహీప్ కుమార్ 25 బంతులలో రెండు సిక్స్‌లు ఒక ఫోర్‌తో 34 పరుగులు చేయగా వికెట్ కీపర్ ఎంకె.దత్తారెడ్డి 26 బంతులలో మూడు సిక్సులు, రెండు ఫోర్లతో 37 పరుగులు చేశాడు. జి.రోహిత్ 16 బంతులలో మూడు సిక్సులు, ఒక ఫోర్‌తో 32 పరుగులు చేసినప్పటికీ మిగిలిన బ్యాటర్లు ఆశించిన స్థాయిలో రాణించకపోవడంతో తుంగభద్ర వారియర్స్ జట్టు లక్ష్యాన్ని ఛేదించడంలో విఫలమైంది. రాయల్ ఆఫ్ రాయలసీమ బౌలర్లు గిరినాథ్ రెడ్డి 3.2 ఓవర్లలో 21 పరుగులు ఇచ్చి మూడు వికెట్లు తీయగా, జాగర్లపూడి సాకేత్ రాము 3 ఓవర్లలో 8 పరుగులు ఇచ్చి మూడు వికెట్లు తీసి తుంగభద్ర వారియర్స్ బ్యాటర్లలను కట్టడి చేశారు. వీరితోపాటు వినుకొండ వేణు, మాధవ రాయుడు రెండేసి వికెట్లు తీశారు ఈ మ్యాచ్‌లో అద్భుత ప్రతిభ కనబరిచి 48 బంతులలో 67 పరుగులు చేసిన షేక్ రషీద్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది.



బ్యాటింగ్ చేస్తున్న షేక్ రషీద్



క్రికెట్ లెజెండ్ సచిన్ టెండూల్కర్ కుమారుడు అర్జున్ టెండూల్కర్ నిశ్చితార్థం సానియా ఛందోక్‌తో జరిగినట్లు బుధవారం రాత్రి సామాజిక మాధ్యమాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ఇరువురి కుటుంబ సభ్యులు ఈ నిశ్చితార్థంపై ఎలాంటి అధికారిక ప్రకటన విడుదల చేయలేదు.

2030 కామన్వెల్త్ గేమ్స్‌కు భారత్ బిడ్

ఎస్‌జిఎంలో ఏకగ్రీవ నిర్ణయం



న్యూఢిల్లీ: 2030 కామన్వెల్త్ క్రీడల ఆతిథ్యానికి భారత ఒలింపిక్ సంఘం(ఐఓఎ) ఆమోదం తెలిపింది. బుధవారం జరిగిన ప్రత్యేక సర్వసభ్య సమావేశం(ఎస్‌జిఎం)లో ఈమేరకు ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకున్నారు. కామన్వెల్త్ క్రీడల డైరెక్టర్ డారెన్ హాల్ ఇటీవల అహ్మదాబాద్ వేదికను పరిశీలించినట్లు గుజరాత్ ప్రభుత్వాధికారులతో క్రీడల ఆతిథ్య విషయమై మాట్లాడినట్లు ఎస్‌జిఎంలో ప్రధాన చర్చ జరిగింది. ఈ నెల చివర్లో కామన్వెల్త్ క్రీడల ప్రతినిధి బృందం మరోసారి అహ్మదాబాద్‌ను పరిశీలించనున్నట్లు ఎస్‌జిఎం సభ్యులు తెలిపారు. నవంబర్ చివరి వారంలో గ్లాస్గోలో జరిగే కామన్వెల్త్ క్రీడల జనరల్ అసెంబ్లీ అనంతరం ఆ తర్వాత కామన్వెల్ క్రీడల ఆతిథ్య దేశాన్ని అధికారికంగా ప్రకటిస్తారు. ఈ క్రమంలో 2030 కామన్వెల్ క్రీడలు నిర్వహించేందుకు బిడ్‌ను భారత్ దాఖలు చేయనుంది. వాస్తవానికి 2030 కామన్వెల్త్ క్రీడలకు కెనడా బిడ్ దాఖలు చేయాల్సి ఉండగా.. ఆ దేశం బిడ్ దాఖలు నుంచి వైదొలగడంతో భారత్‌కు అవకాశాలు పెరిగాయి. ఇప్పటికే 2030 కామన్వెల్ క్రీడల ఆతిథ్యంపై ఆసక్తిని వ్యక్తం చేసిన భారత్.. బిడ్ పత్రాలను ఈ నెల 31లోగా అందజేయాల్సి ఉంది. మెగా ఈవెంట్‌కు అయ్యే ఖర్చులన్నింటినీ భారత ప్రభుత్వమే భరిస్తుందని ఐఓఎ స్పష్టం చేసింది. సమావేశం అనంతరం ఐఓసి సంయుక్త కార్యదర్శి కల్యాణ్ చౌబే మాట్లాడుతూ కామన్వెల్త్ క్రీడలకు సంబంధించి జనరల్ హౌస్ ప్రతిపాదనలను ఏకగ్రీవంగా ఆమోదం తెలిపిందని చెప్పారు. గ్లాస్గో కామన్వెల్ క్రీడలను నిర్వహించనున్నట్లు ఐఓసి ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యుడు రోహిత్ రాజ్‌పాల్ పేర్కొన్నారు. భారత్‌కు కామన్వెల్ క్రీడల ఆతిథ్య హక్కులు దక్కితే... షూటింగ్, ఆర్చరీ, రెజ్లింగ్ తదితర క్రీడలతో పాటు కబడ్డీ, ఖోఖో పోటీలను సైతం ఈ క్రీడల్లో చేర్చే అవకాశముంది. 2010లో ఢిల్లీలో తొలిసారి కామన్వెల్త్ క్రీడలను నిర్వహించారు.



వన్డే సిరీస్ విజేత వెస్టిండీస్

మూడో మ్యాచ్‌లో పాక్‌పై 202 పరుగుల తేడాతో గెలుపు

ట్రినిడాడ్: నిర్ణయాత్మక మూడో, చివరి వన్డేలో వెస్టిండీస్ 202 పరుగుల భారీ తేడాతో ఘన విజయం సాధించింది. విండీస్ ఫాస్ట్ బౌలర్ జేడన్ సీల్స్ ఆరు వికెట్లు తీసుకోగా, కెప్టెన్ శాయ్ హోప్ అజేయ సెంచరీతో ఆకట్టుకున్నాడు. దీంతో వన్డే సిరీస్‌ను విండీస్ 2–1తేడాతో కైవసం చేసుకుంది. 1991 తర్వాత అంటే.. 34ఏళ్ల తర్వాత పాక్‌తో జరిగిన వన్డే సిరీస్‌ను విండీస్ గెలుచుకుంది. మూడో వన్డేలో తొలుత బ్యాటింగ్‌కు దిగిన వెస్టిండీస్ నిర్ణీత 50 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 294 పరుగులు చేసింది. విండీస్ జట్టులో కెప్టెన్ హోప్(120నాటౌట్) సెంచరీతో రాణించాడు. అతని ఇన్నింగ్స్‌లో 10 ఫోర్లు, అయిదు సిక్సర్లు ఉన్నాయి. రోస్టన్ ఛేజ్(36), జస్టిన్ గ్రీవ్స్(43) పరుగులతో రాణించారు. విండీస్ 42 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 184 పరుగులతో కష్టాల్లో పడింది. ఆ దశలో హోప్, గ్రీవ్స్ భారీ షాట్లతో 8 ఓవర్లలో 110 పరుగులు జతచేశారు. పాక్ బౌలర్లలో నసీమ్ షా, అబ్రార్ అహ్మద్ రెండేసి వికెట్లు తీసుకున్నారు. 295 టార్గెట్‌తో బరిలోకి దిగిన పాకిస్థాన్‌కు విండీస్ ఫాస్ట్ బౌలర్ జేడన్ సీల్స్(6/18) షాకిచ్చాడు. దీంతో పాకిస్తాన్ 29.2ఓవర్లలో 92 పరుగులకే ఆ జట్టు ఆలౌటైంది. అఘా సల్మాన్(30), నవాజ్(23), హసన్ నవాజ్(13) మాత్రమే రెండంక్కెల స్కోర్ చేశారు. మోటీకి రెండు, ఛేస్‌కు ఒక వికెట్ దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ హోప్‌కు, సిరీస్ సీల్స్‌కు దక్కాయి.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68